1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 6
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి


నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in




టంగుటూరి ప్రకాశం
150వ జయంతి సంవత్సరం
(ఆగస్టు 2022-23)



తాపీ ధర్మారావు
135వ జయంతి (2022 సెప్టెంబరు 19)
తెలుగు జనమాధ్యమాల దినోత్సవం

ప్రాధికార సంస్థ ఏర్పాటు అధికారభాషా సంఘానికి ఊపిరి పోయడం కోసమేనా?

తాపీ ధర్మారావు 135వ జయంతి (2022 సెప్టెంబరు19)-తెలుగు జనమాధ్యమాల దినోత్సవం సందర్భంగా



ఆహ్వానము

తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభంపై
వందలాది వ్యంగ్య చిత్రాలను సృష్టించిన
ఏకైక కార్టూనిస్టు

శ్రీ సరస్వతుల రామనరసింహం 'సరసి' గారికి

తాపీ ధర్మారావు పురస్కారం-2022



ఈ కార్యక్రమం 2022 సెప్టెంబరు 17న గాని 18న గాని విజయవాడలో జరుగుతుంది.
వేదిక : పి.బి.సిద్ధార్థ కళాశాల ఆడిటోరియం, విజయవాడ.

- ముఖ్య అతిథిగా భారత సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి డా॥జస్టిస్ ఎన్.వి.రమణ గారిని ఆహ్వానించాము.
- విశిష్ట అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి, అధికారభాషా సంఘం మాజీ అధ్యక్షులు డా॥మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారు.

సభ తేదీ స్పష్టంగా
సెప్టెంబరు నెల
మొదటి వారంలో
ప్రకటించబడుతుంది.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
'తెలుగుజాతి' (ట్రస్టు)
తాపీ ధర్మారావు వేదిక

తెలుగు భాషోద్యమ కార్టూనిష్టు

'సరసి'

వివిధ సామాజిక సమస్యలపై వేలాది కార్టూన్లతో ప్రజల్లో చైతన్యం కలిగించిన చిత్రకారుడు. భారతదేశంలోనే ప్రత్యేకించి భాషాసమస్యపై వందలాది వ్యంగ్యచిత్రాలను రచించిన ఏకైక కార్టూనిష్టు. ఆధునిక భాషగా పాలనా, బోధనా రంగాలలో తెలుగుకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాల్లో, ప్రజల్లో కదలిక తెచ్చి ఆలోచింపచేసే కార్టూన్లతో తెలుగు భాషోద్యమానికి శక్తిని కలిగించిన అనుపమాన వ్యంగ్యచిత్రకారుడు

అమ్మనుడిని అటకెక్కిస్తారా! 'సరసి' కార్టూన్ల పుస్తకాన్ని ఈ సభలో పెద్దలు ఆవిష్కరిస్తారు



తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు

డా॥ఎన్.వేణుగోపాల్-2009,
డా॥కె.శ్రీనివాస్-2011,
శ్రీ టంకశాల అశోక్-2013,
శ్రీ జి.శ్రీరామమూర్తి-2014
శ్రీ ఎ.కృష్ణారావు-2015,
శ్రీ ఆర్ఎం.ఉమామహేశ్వరరావు-2016,
శ్రీసతీష్ చందర్-2017,
డా॥ ఏటుకూరి ప్రసాద్-2018
(జీవనసాఫల్య పురస్కారం),
శ్రీ వై.ముకుందరామారావు-2020,
శ్రీమతి డి.పి.అనురాధ-2021

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు *9848016136*

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



సెప్టెంబరు 2022

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. హామీపత్రం తప్పనిసరి: **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు	కార్టూన్లు	కంప్యూటర్
చిదంబరేశ్వరరావు	**సరసి**	**బండారు రఘురాం**

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

తెలుగుజాతి (ట్రస్టు)

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సంగి: రూ.1000, 1 సంగి :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

TELUGU JAATHI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **914020020387880**

IFSC Code : UTIB0000556

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

94404 48244 లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ

ఇవీ సంగతులు...

తెలుగును మొదటి భాషగా బోధించడం తప్పనిసరి

ఆంగ్ల మాధ్యమ విద్యా సంస్థల్లో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించాలని తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్, అధికార భాషా సంఘం ఛైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సూచించారు. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు ప్రభుత్వం విశేష అధికారాలు కల్పించిందని, సెప్టెంబరు రెండో వారం నుంచి జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "అధికార యంత్రాంగం తెలుగు భాషను అమలు చేయకపోతే పత్రికలు, ప్రసార మాధ్యమాలు వెలుగులోకి తీసుకురావాలి. ఇంటర్మీడియట్ వరకు తెలుగును మొదటి భాషగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తాం. డిగ్రీ స్థాయిలోని అన్ని సెమిస్టర్లలో ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్యలు తీసుకోవాలి. (జర్నలిస్ట్ సాయి వలగూడు పత్రిక నుంచి)

'ది హిందూ' ఆంగ్లపత్రిక వ్యతిరేకత

ది హిందూ పత్రికలో ఆగస్టు 2న వచ్చిన సంపాదకీయం మాతృభాషా మాధ్యమంలో ఇంజనీరింగ్ విద్యకు ప్రతికూలంగా వచ్చింది. మాతృభాషా మాధ్యమ విధానాన్ని జాతీయ విద్యావిధానంగా ప్రకటించిన కేంద్రప్రభుత్వం ఇంగ్లిష్‌ను కేవలం పరాయి భాషగా చూస్తుందని, ఇంగ్లిష్‌ను ప్రపంచ భాషగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఈ సంపాదకీయం సారాంశం. జాతీయ విద్యావిధానం అందరి అభిప్రాయాలతో కాకుండా కొందరు సిద్ధాంతకర్తల అభిప్రాయాలతో తయారైందని, క్షేత్ర స్థాయిలో మాతృభాషల్లో ఉన్నత విద్యలు ఇవ్వటం సాధ్యం కాని పని అని సంపాదకుడు అన్నాడు.

మాతృభాషల్లో శిక్షణకు తగిన సమర్థులనే నియమించాలి

ఫినాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ఒక కథనం ప్రకారం మాతృభాషా మాధ్యమాలపై గత ఏడాది ఆసక్తి చూపిన తల్లిదండ్రులు ఈ ఏడాది ఇంగ్లిష్ బడులకు తిరిగి తమ పిల్లలను పంపిస్తున్నారట. ఈ సంగతి అస్సాంలోని గౌహతిలో జరిగింది. సరైన పాఠ్య పుస్తకాల లేమి, ఉపాధ్యాయుల కొరత, చదివించేప్పుడు బోధనా సిబ్బంది పారిభాషిక పదాలతో పడుతున్న ఇబ్బంది ఇందుకు కారణాలని ఆ కథనంలో తెలిపారు. ఉద్యోగార్హత కోసం మాత్రమే తల్లిదండ్రులు పిల్లలను ఇంగ్లిష్ మీడియంకి పంపుతున్నారనే వాదన కూడా ఉంది. అయితే ప్రాంతీయ భాషల్లో / విద్యార్థి మాతృభాషలో తగినంత బోధనా సామగ్రి, నిపుణులైన బోధనా సిబ్బంది ఉంటే ఇది ఇబ్బంది కాకూడదు.

తెలుగుపట్ల టంగుటూరి నిబద్ధత

టంగుటూరి ప్రకాశం పంతులు తెలుగు రాష్ట్రం ఏర్పాటుకై ఎంతో కృషి చేశారని, భాషను రక్షించుకోడానికై ప్రత్యేక రాష్ట్రం కీలకమని ఆయన స్పష్టం చేశారని, ఆయన స్ఫూర్తితో భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం సేవ (తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం, తెలుగు భాష వారోత్సవాలు నిరహించారు. ముఖ్య అతిథిగా మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి కృష్ణ, బిక్కి కృష్ణ, ఏనుగు నరసింహారెడ్డితో పాటు పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

తెలుగును కాపాడండి – చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ

తెలుగు సినిమా పరిశ్రమ (టాలీవుడ్) నుంచి వారం వారం సినిమాలు విడుదలవుతూనే ఉన్నాయి. అవి పేరుకు తెలుగు సినిమాలు అయినప్పటికీ అందులో మాత్రం సొంత భాష కనిపించడం లేదు. ఇందులో నటించే వారే సరైన తెలుగును స్పష్టంగా మాట్లాడలేకపోవడం విశేషం. వీరిని అనుసరించి చాలా మంది వారికి వచ్చిన తెలుగును మరిచిపోతున్నారు. తెలుగు పండితులు, మేధావులు, తెలుగు భాషను కాపాడాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు తెలుగు మహాసభలు నిర్వహించి ఇది చేస్తాం.. అది చేస్తామని ప్రకటించడమే తప్ప తెలుగు భాషాభివృద్ధికి ప్రయత్నించడమే లేదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొనడం గమనార్హం. ప్రధానంగా తెలుగు సినిమా హీరోలు తెలుగు భాషను నేర్చుకోవాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ తెలుగు గాయకుడు ఘంటసాల శతజయంతి కార్యక్రమానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ హాజరై మాట్లాడారు. తెలుగును సరిగా ఉచ్చరిస్తే బాగుంటుంది. అప్పట్లో ఎన్టీర్, ఏఎన్నార్ తెలుగు పలకడంలో శిక్షణ పొందేవారు. డ్యాన్స్ రాకపోయినా ప్రత్యేకంగా శిక్షణ పొందారు. తెలుగు రాకపోతే అవమానకరంగా భావించవద్దు, నేర్చుకొని మరీ మాట్లాడాలని తెలుసుకోండి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇంట్లో తెలుగు నేర్పాలని సూచించారు.

ఎగతాళి పాలౌతున్న మంచు లక్ష్మి తెలుగుమాటలు!

నటి మంచు లక్ష్మి అమెరికన్ ఆంగ్లాన్ని కలిపి మాట్లాడే తెలుగు తీరుపై వలగూడువాసులు ఎలా ట్రోలింగ్స్ చేస్తుంటారో మనందరికీ తెలిసిందే. తరచూ ఈమె ఏదో ఒక విషయంలో ట్రోలింగ్స్‌ని ఎదుర్కొంటూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా చెప్పాలి అంటే ఆమె మాట్లాడే తెలుగు భాష పై భయంకరమైన మీమ్స్ వస్తూనే ఉంటాయి.

తెలుగు సినీ సినిమాల్లో నటించే ఇతర భాషల నటులు తెలుగు భాషను నేర్చుకుంటుంటే ఇక్కడి తెలుగు నటులు మాత్రం తెలుగుభాష తమకు రాదంటూ విమర్శలకు గురవుతున్నారు. అలా మంచు లక్ష్మి కూడా తనకు తెలుగు రాదు అని చెప్పి విమర్శలపాలు అవుతున్నారు. ('తెలుగు స్టాప్' వలగూడు పత్రిక)

డోగ్రీ, కాశ్మీరీ భాషల్లో శాస్త్ర, సాంకేతిక శాఖవారి పత్రిక


కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ డోగ్రి భాషలో ప్రచురించిన జాతీయ సైన్స్ మాసపత్రిక ''విజ్ఞాన్ జత్తారా''ను జమ్మూ విశ్వవిద్యాలయం బ్రిగేడియర్ రాజిందర్ సింగ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక సహాయ (స్వతంత్ర బాధ్యత), మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆవిష్కరించారు. కాశ్మీరీ భాషలో కూడా పత్రిక త్వరలో అందుబాటులోకి వస్తుందని డాక్టర్ సింగ్ ప్రకటించారు. (ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో వలగూడు నుండి)

చదువు తొలినాళ్ళలో మాతృభాషలోనే జరగాలి-- యూజిసి



యూజీసీ చెయిర్‌మన్ యమ్. జగదీశ్ కుమార్

చదువు తొలినాళ్ళలో మాతృభాష చాలా ముఖ్యం అని యూజీసీ చెయిర్‌మన్ జగదీశ్ కుమార్ అన్నారు. ది హిందూ పత్రికకు ఇచ్చిన విశేష ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పిల్లల్లో చాలా చిన్న వయసులోనే చదువులు మాతృభాషలో మొదలు పెట్టడం ఆ పిల్లల సృజనాత్మక ఆలోచనలకు ముఖ్యమని, ఇంగ్లిష్‌ని ఆ తరువాత జీవితంలో ఎప్పుడైనా ఒక సంభాషణా నైపుణ్యంగా నేర్చుకోవచ్చని అన్నారు. అదే సమయంలో ప్రపంచీకరణలో మునిగిన మన ఆర్థిక వ్యవస్థల్లో చదువులు ప్రాంతీయ భాషల్లో మాత్రమే జరిగితే అది ఒక విధంగా వెనకబాటుకు దారి తీయవచ్చని అన్నారు. “మాతృభాషా మాధ్యమాల్లో చదువులంటే ఇంగ్లిష్‌ని వెనక్కి నెట్టడమే అని మనలో చాలా మందికి అపోహ ఉంది. కానీ నిజమది కాదు. ఇంగ్లిష్‌ను ఎప్పుడైనా నేర్చుకోవచ్చు. సృజనాత్మకతను, విషయపరిజ్ఞానాన్ని అలవరుచుకోవడం కష్టమైన పని. మాతృభాషలో చదువులుంటే సృజనాత్మకతకు, విషయ అవగాహనకు ఎక్కువ సమయం వెచ్చించక్కరలేదు.” అని అన్నారు.



సంపుటి : 8 సంచిక : 6
అమ్మనుడి
సెప్టెంబరు 2022

సంపాదకీయం

ప్రాధికార సంస్థ ఏర్పాటు అధికారభాషా సంఘానికి ఊపిరి పోయడం కోసమేనా?

తెలుగు మంత్రిత్వశాఖనూ దానితో పాటు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ(ఆథారిటీ)నీ ఏర్పాటు చేయాలని కోరుతూ తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏళ్ల తరబడీ చేసిన ఉద్యమాల ఫలితంగా, కిరణ్‌కుమార్‌రెడ్డి గారి ప్రభుత్వం 4వ ప్రపంచ తెలుగు మహాసభల్లో తీర్మానం చేసి మరీ ఆ కోరికను ఆమోదించింది. తర్వాత సరిగ్గా సంవత్సరానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాని ప్రాధికార సంస్థ పట్ల మౌనం వహించింది. తర్వాత రాష్ట్రవిభజన జరిగి, కొత్త ఆంధ్రప్రదేశ్ ఏర్పడి చంద్రబాబు గారి ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రిత్వ శాఖను ఒక తోకగా సాంస్కృతిక శాఖకు తగిలించి, ప్రత్యేక బడ్జెట్టును ఇవ్వకుండా తెలివిగా వ్యవహరించింది. ప్రాధికార సంస్థ ఏర్పాటు కోసం మళ్లీ తె.భా.సమాఖ్య ఉద్యమించిన తర్వాత 2018 జూలై 10న ఒక జి.ఒ.ద్వారా సంస్థ ఏర్పాటును ప్రకటించింది. ఒక పటిష్టమైన చట్టం ద్వారా సంస్థను ఏర్పాటు చేస్తామన్న మాటను పక్కన బెట్టి చంద్రబాబుగారు అర్ధమనస్కంగా ఆ జి.ఒ.ను విడుదల చేశారన్న సంగతి సుస్పష్టం. దీన్ని అమలులోకి తేవడానికి జరిపిన ప్రయత్నాలు ఒక కొలిక్కివచ్చేసరికి మళ్లీ ఎన్నికలు జరిగి జగన్మోహనరెడ్డి గారి ప్రభుత్వం వచ్చింది. తెలుగు పట్ల ఆయన ప్రభుత్వ విధానం అందరికీ తెలిసిందే. అయినా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారి కోరిక మేరకు ఆయనను అధ్యక్షుడుగా నియమిస్తూ అధికార భాషా సంఘానికి ఊపిరి పోశారు. ఏళ్లు గడుస్తున్నా ఆ సంఘం పని ఏమీ తెలియకుండా ఉండడంతో, తెలుగు అమలు పట్ల పట్టుదల కలిగివున్న డా॥గుంటుపల్లి శ్రీనివాస్ గారు హైకోర్టులో ప్రజాప్రయోజనవ్యాజ్యం వేశారు. కోర్టుకు ఏమీ సమాధానం చెప్పలేని స్థితిలో- ఎవరు సూచించారో ఏమో గానీ, ప్రాధికార సంస్థ జి.ఒ.లో 7వ భాగాన్ని ఉపయోగించుకోవాలని తలపెట్టి, ప్రాధికార సంస్థకు కూడా లక్ష్మీప్రసాద్ గారినే అధ్యక్షులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చేసింది. ఆయనేమో ఉత్సాహంగా 'నేరాలు, నిబంధనలు' అనే 7వ భాగాన్ని ఆసరాగా తీసుకొని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినీ, గవర్నరుగారినీ కలిసి వారి సహకారాన్ని అర్థించారు. ప్రతికూల పరిస్థితిలో కూడా ఎంతో ఆరాటంతో ముందడుగు వేస్తున్న లక్ష్మీప్రసాద్ గారు ఏదో సాధించేస్తారని ఎవరూ అనుకోవడం లేదు. తెలుగు పట్ల ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం వైఖరేమిటో తెలియని వారు మాత్రమే అంతటి ఆశలు పెట్టుకుంటారు. లక్ష్మీప్రసాద్ గారు తన అపార రాజకీయ అనుభవంతో తెలుగు ప్రజలకు మేలు చేద్దామని శ్రమిస్తున్నారేమోగానీ, అందుకై ఆయన కొన్ని ముఖ్యమైన అంశాలపట్ల శ్రద్ధ వహించక తప్పదు.

1. తెలుగు మాధ్యమంతో తెలుగు భాషాభివృద్ధికి సంబంధంలేదనే మాట శుద్ధతప్పు. ఎందుకో తెలుసుకోవాలన్న చిత్తశుద్ధి ఉంటే, తాను నవ్వులపాలు కాకూడదనుకుంటే ఆయన ఈ అంశాన్ని ఆధ్యయనం చెయ్యాలి. భాషోద్యమకారులు ఈ అంశంపై రాజీ పడరు.

2. ప్రాధికార సంస్థ ఏర్పాటుకై జారీ అయిన జి.ఒ. నెం: 40/ 10-07-2018ని శ్రద్ధగా చదివితే దాని అధ్యక్షుడి బాధ్యతలేమిటో ఆయనకు అర్థమవుతాయి. ఆ జి.ఒ. రూపకల్పనలో కొన్ని లోపాలున్నాయి. వాటిని కూడా సరిదిద్దేందుకు తగిన వారితో ఆయన సంప్రదించవచ్చు.

3. విశాఖపట్నం నుంచి అన్ని పనులు సాధ్యంకావు. విజయవాడలో ప్రాధికార సంస్థ ప్రధాన కార్యాలయాన్ని పెట్టుకొని, ఆ జి.ఒ.లో సూచించిన విధంగా కమిటీలను ఏర్పాటు చేసి, పనిచేయించుకోవాలి. ఈ కమిటీల నియామకంలోనూ, వాటి పనిలోనూ రాజకీయాలకూ అభిమాన దురభిమానాలకూ తావునివ్వకుండా ఆయన పనిచేయగలిగితేనే ఈ ప్రాధికార సంస్థ ఆశించిన లక్ష్యాలను సాధించగలుగుతుంది.

ప్రాథమిక విద్యలో మాతృభాషామాధ్యమం విషయంలో డా॥ గుంటుపల్లి శ్రీనివాస్ వ్యాజ్యం విషయం- చివరకు సుప్రీం కోర్టుదాకా ప్రభుత్వమే తీసుకుపోయినట్లు తెలుస్తున్నది. అది ఇప్పుడు ఏ దశలో ఉందో తెలియదు. దాని విషయంలో ప్రభుత్వం ఏమీ సాధించలేకపోయినా, విద్యార్థులూ, తెలుగు సమాజమూ ఎంతో నష్టపోయారు. భవిష్యత్తులో మాతృభాషామాధ్యమంలో పాఠశాల విద్య అనే అంశం భారత రాజకీయాల్లో ఒక ముఖ్యాంశం కాక తప్పదు.

అధికారభాషగా తెలుగు అమలు విషయం మాత్రం హైకోర్టులోనే పరిష్కారం కావలసి ఉంది. ప్రభుత్వం మొట్టికాయలతోనే తప్పించుకొంటుందా, జరిమానాలు పడేదాకా సాగుతుందా అనేది క్రమంగా తెలుస్తుంది. తాత్కాలిక రక్షణ కోసం ప్రాధికార సంస్థలో నేరాలూ, జరిమానాల అంశాన్ని అడ్డుగా పెట్టుకోవడం అనేక పరిణామాలకు దారితీయవచ్చు.

ఇంతకూ- ప్రాధికార సంస్థ ఏర్పాటు కేవలం అధికారభాషా సంఘానికి ఊపిరి పొయ్యడానికా? మాధ్యమంతో సహా అన్ని రంగాల్లో తెలుగు భాషాభివృద్ధి కోసమా?

29-08-2022
'గిడుగు' జయంతి
తెలుగుభాషా దినోత్సవం

దయచేసి 8,9,10,11
పుటలను కూడా చూడండి.

సామల రమేష్‌బాబు

అమ్మనుడి ఆగస్టు 2018 సంచికలోని 'సంపాదక హృదయం'

తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్వాగతిద్దాం

ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకు ఉత్తర్వు వచ్చేసింది – జి.ఒ. ఎం.ఎస్. సంఖ్య 40 / 10.7.18. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వ్యవస్థను ఏర్పర్చుతున్నారు గనుక దానిని మనం స్వాగతించాలి.

పదిహేనేళ్ల నుండీ భాషోద్యమకారుల కోరిక ఇది. క్రమక్రమంగా 2009 నుండి ఇది బలవత్తరమయింది. 1966 నుండీ వున్న ఆం.ప్ర. అధికార భాషా చట్టం ప్రకారం ఒక 'అధికార భాషా సంఘం' అప్పుడప్పుడు నియమితమవుతూ రెండేళ్లకొకసారి అదృశ్యమవుతూ ఉండేది. ఒక తాత్కాలిక సలహా సంఘం అది. దానికొక నిరంతర వ్యవస్థగాని, చిరునామా, తలా తోకా ఏమీ లేని విచిత్రం అది. దానికి అధ్యక్షులుగా వచ్చిన కొందరూ, వారితో పనిచేసిన సభ్యులూ ఎంతో కొంత కృషి చేశారు. కాని అదంతా ఏలినవారి పట్టనితనం వల్ల బూడిదలో పోసిన పన్నీరయింది. ఎటువంటి అధికారాలు, ప్రభుత్వ సహకారమూలేని పనికిమాలిన సంఘం అది. అందువల్ల దానిని నిరసించి, దాని స్థానంలో ఒక ప్రాధికార సంస్థ (అథారిటీ) ని ఏర్పరచాలని తెలుగుభాషోద్యమ సమాఖ్య, మిత్ర సంఘాలూ ఒక బలమైన 'డిమాండు' ను ముందుకు తెచ్చాయి. తెలుగుకు ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖనూ, దానితోపాటు ఒక ప్రాధికార సంస్థను ఏర్పరచాలనే నిక్కచ్చు (డిమాండు) తో పాటు తొమ్మిది తీర్మానాలను 2009 నుండీ సమాఖ్య ప్రభుత్వం ముందుపెట్టి, నాలుగేళ్లపాటూ నిరసన కార్యక్రమాలను చేసింది. చివరకు గిడుగు 150వ జన్మదినోత్సవ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని బలవత్తరం చేసింది. 2012లో ప్రభుత్వం తిరుపతిలో నడుప తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సమాఖ్య ఈ డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించింది. సమాఖ్య అధ్యక్షుడు రెండుసార్లు ముఖ్యమంత్రిని కలిసి వివరించినా ఫలితం లేకపోయింది. అదంతా ఒక చరిత్ర. మొత్తంమీద ఉద్యమ ప్రభావంతో కొన్ని కోరికలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలుపుతూ మహాసభల తొలి రోజున ప్రకటన చేశారు. మూడవ రోజున తీర్మానాలను ప్రకటించారు. మొత్తం మీద సరిగ్గా ఒక ఏడాదికి 31 – 12 – 2013న జి.ఒ. 909 ద్వారా తెలుగు భాషా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. అయితే యువజనాభివృద్ధి, పర్యాటకంతో చేరివున్న సాంస్కృతిక శాఖను వేరుపరచి భాషాశాఖను దానిని జోడించి, 'తెలుగుభాష, సాంస్కృతిక శాఖను ఏర్పాటు చేస్తున్నట్లు జి.ఒను ఇచ్చారు.

ఆ తర్వాత కొద్ది నెలలకే రెండు రాష్ట్రాలుగా విభజనై, ఎన్నికలు జరిగిన తర్వాత కొత్త ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన వరుస బడ్జెట్లలో భాషా మంత్రిత్వ శాఖకోసం కేటాయింపులేనాడూ లేవు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చినా, ఏమీ పట్టించుకోలేదు. సరే. భాషా మంత్రిత్వశాఖను ఇచ్చారేగాని, దానికి ప్రాణావసరమైన 'తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ' కోరికను ప్రపంచ మహాసభలప్పుడే విస్మరించింది ప్రభుత్వం. పెద్దలు అధికార భాషా సంఘం అనే బూచిని ఇంకా వదులుకోలేదు. ఆత్మహనన రాజకీయ మేధావులు ఏం చేశారో గాని ప్రాధికార సంస్థ డిమాండును పక్కన పెట్టేశారు. తర్వాత – మళ్లీ ఈ డిమాండును ప్రజల దృష్టికీ, ప్రభుత్వ దృష్టికీ, తేవడానికి తెలుగు భాషోద్యమ సమాఖ్య తన కృషిని కొనసాగించింది. ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు వ్రాసి, రాష్ట్రవ్యాప్తంగా సభల్లో ఈ అంశానికి ప్రచారం తెచ్చింది. ప్రభుత్వంలోని కొందరి పెద్దలకు వివరించి వారి సమర్ధనను పొందింది. మొత్తం మీద 2016 తెలుగు భాషాదినోత్సవం నాడు ముఖ్యమంత్రిగారి బహిరంగ ప్రకటనను పొందగలిగాం. మళ్ళీ 2017 లో ఇదే రోజున ముఖ్యమంత్రిగారు బహిరంగ సభలో మాట్లాడుతూ, రానున్న శాసనసభ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి పటిష్టంగా చట్టాన్ని తేనున్నామని ప్రకటించారు. అయితే – ఏ సాంకేతిక, రాజకీయ కారణాల వల్లనో ఇప్పుడు జి.ఒ.గా తెచ్చారు. గమనించండి – ఈ జి.ఒ. నెం. 40ను 'యువజనాభ్యుదయం, పర్యాటక మరియు భాషా సాంస్కృతిక (వైఎంయు) శాఖ' వెలువరించింది! దీనిలో రెండు సూచికల్ని (రిఫరెన్సు) ఇచ్చారు.

1. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాచట్టం నెం. 9/1566.

2. ఆంధ్రప్రదేశ్ పర్యాటకం సంస్కృతి మరియు వారసత్వ మండలి చట్టం (2017 ఆం.ప్ర. చట్టం నెం.4) ఆంధ్రప్రదేశ్ గెజిట్ (పార్ట్ 4 – బి. అసాధారణ సంచిక) నెం.4 తేదీ 26.4.2017. ఈ రెండు సూచికల ఆధారంగా ఇప్పుడీ జి.ఒ. 40 ను

వెలువరిస్తున్నట్లూ, ఇది ది. 18-07-2018 నుండి అమలులోకి వస్తుందని గెజిట్‌లో ప్రకటించారు.

మరి – కొత్త సంగతి కాదుగాని, తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు జి.ఒ కూడా సంప్రదాయం చెడకుండా ఇంగ్లీషులోనే వచ్చింది! గతంలో తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలపై ఇచ్చిన జి.ఒగాని, మంత్రిత్వశాఖ ఏర్పాటు జి.ఒ.గాని అన్నీ ఇంగ్లీషులోనే వచ్చాయని మనం మరిచిపోరాదు. అయితే నిబద్ధత కలిగిన అధికారులు కొందరైనా ఇంకా ఉన్నారు గదా! సృజనాత్మకత సంస్కృతి కమిషన్ సి.ఇ.ఒ.గారు 24 గంటలలోనే తెలుగు అనువాదాన్ని స్వయంగా తయారుచేసి, పరువు దక్కించారు. ప్రభుత్వంలో 'రాజకీయ సంకల్పం' (మామూలుగా దీన్నే ఇంగ్లీషులో 'పొలిటికల్ విల్' అంటారు) ఉందా అనేది ప్రధాన సమస్య. ఈ జి.ఒ. వచ్చిన తర్వాత ప్రభుత్వం తరఫున ఒకటో రెండో శిలాఫలకాలు కూడా ఇంగ్లీషులోనే ఆవిష్కృతమైనట్లూ సచివాలయ పాలన అంతా ఇంగ్లీషులోనే నడుస్తున్నట్లూ – తెలిసినవారు చెప్తున్నారు. అందుకు బాధ్యులైన వారికి ఈ జి.ఒ. ప్రకారం శిక్షలు పడతాయా?!

ఇక ఈ జి.ఒ. లో మనం గమనించాల్సిన ముఖ్యమైన సంగతులు : **భాగం -2 లో 2వ అంశం :** ప్రాధికార సంస్థకు ఒక ఛైర్మన్ (అధ్యక్షుడు) ; సాధారణ పరిపాలన, న్యాయ, కార్మిక, పర్యాటక, సాంస్కృతిక మరియు విద్యాశాఖలు నిర్వహించే వివిధ స్థాయి కార్యదర్శులు, రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ సిఇఒ తోపాటు – "తెలుగు సాహిత్యం, పరిపాలన మరియు న్యాయ వ్యవహారాలలో విశిష్ట అనుభవం కలిగిన పలువురు నిపుణులు"ంటారని పేర్కొన్నారు. దీనిలో కావలసింది సాహితీ వేత్తలు కాదు. ఆ వాక్యం ఇలా ఉండాలి : 'తెలుగు భాష, బోధన, పరిపాలన మరియు న్యాయ వ్యవహారాలలో విశిష్ట అనుభవం కలిగిన నలుగురు నిపుణులు' అని ఉండాలి.

అదేభాగంలో 3వ అంశం : 'ప్రభుత్వం నియమించిన తెలుగుభాష, సాహిత్యం, పరిపాలనా రంగాలలో విశిష్ట అనుభవం కలిగిన ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చికమిటీ ఎంపిక చేసినవారిని అధ్యక్షులు మరియు సభ్యులుగా ఆం.ప్ర. ప్రభుత్వం నియమిస్తుంది'. ఇందులోకూడ 'సాహిత్యం' బదులు విద్య అని ఉండాలి. సాహితీ వేత్తలకు ఇందులో పనిలేదు. సాహితీ వేత్తల సేవలు పొందడానికి సాహిత్య అకాడమీ, వివిధ స్థాయి సాహితీ సంస్థలు, సంఘాలు ఉన్నాయి.

ఈ రెండు విషయాలను స్పష్టం చేస్తూ ఈ జి.ఒ.కు వెంటనే సవరణలు తేవాలి. ఈ అంశాన్ని సి.ఇ.ఒ. గారి దృష్టికి తీసుకు వెళ్ళగా, వారూ మా అభిప్రాయంతో ఏకీభవించారు. దీన్ని అత్యవసర అంశంగా భావించాలని వారి ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తున్నాము.

ఆధునిక అవసరాలన్నిటినీ తీర్చగల భాషగా తెలుగుకు శక్తి వుంది. దాన్ని ఉపయోగించే కొద్దీ అది అభివృద్ధి చెందుతుంది. అంటే అన్ని రంగాలలో తెలుగునే సాధనంగా చేసుకోవాలి. అందుకు తగ్గట్టుగా ఆ రంగాల్ని నియంత్రించడం, మార్గదర్శనం చెయ్యడం కోసమే ఈ సంస్థ. భాష అంటే కేవలం సాహిత్యం కాదు. భాషా వ్యవహర్తలు పెరిగితేనే, భాషా వినియోగం పెరిగితేనే సాహిత్యాన్ని చదివే వాళ్ళుంటారు; లేకపోతే సాహిత్యానికి ఆదరణ కృశించిపోతుంది. భాషలేకపోతే సాహిత్యం లేదు. సాహిత్య వికాసంతో భాషా వికాసమూ జరుగుతుంది కాని, ఈ రోజుల్లో భాష కేవలం సాహిత్యం కోసం కాదు. ఈ ఆధునిక యుగంలో ప్రజల భాష ప్రజాస్వామ్య సాధనం. ప్రజల హక్కు. జనులందరి ఊపిరిగా, వారి నిత్య చైతన్యానికి, అన్ని రంగాలలో అభివృద్ధికి వారి భాష వారికి ఆధారం కావాలి. అందుకోసం ప్రజలభాషలో చదువూ పరిపాలనా కావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ఈ స్పష్టమైన ఆశయాన్ని దృష్టిలో పెట్టుకొని జి.ఒల నిర్మాతలూ, రాష్ట్ర నేతలూ భాషాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకొని పనిచెయ్యాలి.

పై రెండు దోషాల సవరణతోపాటు, మరేమైనా మార్పులు, చేర్పులు కావాలేమో ఆలోచించండి. చట్టాన్ని రూపొందించకుండా, దానికి తగిన 'నియమాలు' (రూల్సు) ఏర్పరచకుండా – ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయా? **భాగం - 7 అంశం 10 :** 'నేరాలు మరియు జరిమానాలు' లో విధించిన జరిమానాల విధింపుకు, వసూళ్ళకు ఈ జి.ఒ. సరిపోతుందా? ఇంతవరకు ఈ జి.ఒ.ను పరిశీలించిన ఇద్దరు న్యాయ నిపుణులు – ఇందులో చాలా లొసుగులున్నాయంటున్నారు. అధికారులు పరిశీలించాలని విన్నవిస్తున్నాము.

ఏది ఏమైనా ప్రాధికార సంస్థ ఏర్పడుతున్నందుకు మనం సంతసించాలి. స్వాగతించాలి. లోటుపాట్ల సవరణను కోరాలి. ఆచరణలో పూర్తిగా జి.ఒ.ను విజయవంతం చేసేందుకు తోడ్పడాలి. పోరాడాలి కూడా.

తేదీ : 27-07-2018

సామల రమేష్‌బాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, అధికారభాషా సంఘం అధ్యక్షులు డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నుండి ఈ క్రింది ప్రకటన మా కార్యాలయానికి వచ్చింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తూ, దానికి అధ్యక్షులుగా బాధ్యతలను డా॥లక్ష్మీప్రసాద్ గారికి అప్పగిస్తూ జారీ చేసిన జి.ఓ.ఎమ్.ఎస్.సంఖ్య 13/05.07.2022 ను కూడా ఈ క్రింద ప్రచురించాము. –సంపాదకుడు.

ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ

తెలుగు భాషోద్యమ సమాఖ్య, రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు భాషాభిమానుల చిరకాల వాంఛ అయిన "ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ"ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో జరగనటువంటి ఎన్నో కార్యక్రమాలను శ్రీ వై.యస్. జగన్మోహన్ రెడ్డిగారి ప్రభుత్వ హయాంలో ఈ మూడు సంవత్సరకాలంలో చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో మూసివేసిన తెలుగు అకాడమీ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘాన్ని ఏర్పాటు చేసింది. మైసూర్‌లో ఉన్న తెలుగు భాష ప్రాచీన అధ్యయన కేంద్రాన్ని మన రాష్ట్రంలోని నెల్లూరుకు తరలించడంలో సఫలీకృతం అయ్యింది. ఆ సంస్థ కోసం నెల్లూరులో 5 ఎకరాల భూమిని కూడా కేటాయించింది.

ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ద్వారా చేపట్టేటువంటి ముఖ్య కార్యక్రమాలు :

1. తెలుగు అధికార భాషగా అమలు జరుగుతున్న తీరును డివిజనల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రమం తప్పక అన్ని స్థాయిల్లోనూ సమీక్షలు జరిగేటట్లు చర్యలు తీసుకొనుట. శాస్త్ర, సాంకేతిక, న్యాయ పరిపాలనా రంగాలలో ఇతర భాషలలో వస్తున్న పారిభాషిక పదాలను తెలుగులో ప్రత్యామ్నాయ పదాలను తయారు చేసుకోవటానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి దానిని అమలు చేసి 'పదనిధి'(పద బ్యాంకు)ని ఏర్పాటు చేయటం. వివిధ ప్రభుత్వ శాఖల ఉపయోగార్థం పరిపాలనా పదకోశాలను తయారుచేసి ముద్రించుట.

2. నామ ఫలకాలు, బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు మరియు ఇతర ప్రచార సామాగ్రి తెలుగు భాషలో ఉండేటట్లు ఉత్తర్వులు ఇచ్చి,వాటిని ఉల్లంఘించే వారిని దండించేందుకు అవసరమగు చర్యలు చేపట్టుట.

3. ప్రభుత్వ కార్యాలయాల నామ ఫలకాలు. పునాది మరియు ప్రారంభోత్సవ శిలా ఫలకాలు తెలుగు భాషలోనే – స్పష్టంగా వ్రాసి పెట్టేటట్లు చర్యలు తీసుకోవాలి. ఉల్లంఘన దారులను దండించేందుకు చర్యలు చేపట్టుట.

4. యువత తెలుగు భాష పట్ల మక్కువ పెంచుకొని ఆ భాషను వినియోగించే విధంగా వారిని ప్రోత్సహించడానికి అవసరమైన చర్చాగోష్ఠులు, కార్యాశాలలు, వివిధ రకాల పోటీలు నిర్వహించుట.

5. వివిధ శాఖలకు తెలుగు భాష వినియోగంపై ఆదేశాలు ఇస్తూ వాటి అమలుపై కాలపరిమితితో కూడిన పద్ధతిలో సాంకేతిక, ఆర్థిక మరియు సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని సమీక్షించవచ్చు. తెలుగు భాష అమలుకు సంబంధించిన సమాచారం ఏ ప్రభుత్వాధికారి నుండి, శాసన పరిషత్తు నుండి లేదా హైకోర్టు నుండి పొందవచ్చును. ఆయా అధికారులు ప్రాధికార సంస్థ కోరిన సమాచారం అందజేయడం తప్పనిసరి విధి.

6. ఇంటర్మీడియట్ (మాధ్యమిక విద్య) లేక తత్సమానమైన తరగతుల వరకు తెలుగును మొదటి భాషగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయవలెను. ఇంటర్మీడియట్ లేదా తత్సమానమైన తరగతి విద్యార్థుల అధ్యయన స్థాయిని పరీక్షించవలెను.

7. డిగ్రీ స్థాయి వరకు అన్ని సెమిస్టర్లలో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్య తీసుకొనవలెను. వైద్యం, ఇంజనీరింగ్ మరియు లా వంటి అన్ని సాంకేతిక కోర్సులలో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్యలు తీసుకొనవలెను.

8. అన్ని ఆంగ్ల మాధ్యమ విద్యా సంస్థలలో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్యలు తీసుకొనవలెను. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలో జరిగేటట్లు చర్యలు తీసుకొనవలెను. భారత ప్రభుత్వ ప్రాచీన తెలుగు భాషా కేంద్రం (సెంటర్ ఫర్ తెలుగు క్లాసికల్ లాంగ్వేజ్) నిర్వహించే ప్రాజెక్టు వర్కులను సమన్వయం చేసుకొనవలెను.

9. ప్రభుత్వ ఆదేశాలకు లోబడి తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అజమాయిషి మరియు పాలనా వినియోగం కొరకు 25 కోట్ల రూపాయల మూలధనం (సీడ్ క్యాపిటల్)తో ఏర్పాటు చేసిన నిధి "తెలుగు భాషాభివృద్ధినిధి" గా వ్యవహరించబడుతుంది.

10. నేరాలు మరియు జరిమానాలు:

1) ఏదైనా సంస్థ యజమాని తన సంస్థ పేరును తెలిపే నామ ఫలకాన్ని తెలుగులో ప్రదర్శించక పోతే, ఆ యజమాని రూ.50,000/– ల వరకు విధించే జరిమానాతో శిక్షార్హుడు. ఆ యజమాని రెండు సార్లు అదే నేరానికి పాల్పడినట్లయితే జరిమానాతోపాటు మూడు నెలలకు మించకుండా జైలు శిక్ష విధించవచ్చును.

2) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా శంకుస్థాపన లేదా ప్రారంభోత్సవ సమయాలలో బాధ్యులైన ప్రభుత్వ శాఖాధిపతి లేదా సంస్థాధిపతి తెలుగులో శిలాఫలకాల తయారీలో విఫలమైతే,

రూ. 10,000/-ల వరకు జరిమానా విధించవచ్చును.

3) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇతర శాఖలతో గాని, ప్రజలతో గాని తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపని శాఖాధిపతి లేదా సంస్థాధిపతికి రూ. 5,000/-ల వరకు జరిమానా విధించవచ్చును.

4) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అధికార భాషగా తెలుగు అమలును సమీక్షించని శాఖాధిపతికి రూ. 5,000/ల వరకు జరిమానా విధించవచ్చును.

5) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ప్రజలతో జరిపే కార్యకలాపాలలో తెలుగు భాషను ఉపయోగించని యెడల రూ. 10,000/- ల వరకు జరిమానా విధించవచ్చును.

6) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తెలుగును పాఠ్యాంశంగా గాని, బోధనా మాధ్యమంగా గాని అమలు చేయని ఏదైనా విద్యా సంస్థాధిపతికి రూ. 50,000/-లు లేదా 6 నెలలకు మించకుండా జైలు శిక్షను విధించవచ్చును.

ఇంతవరకు అధికార భాషాసంఘానికి లేనటువంటి విశేషమైన అధికారాలను ఈసంస్థ ద్వారా తీసుకోవడానికి నిర్ణయించడమైనది

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సంక్షిప్తి

యువజన అభ్యుదయం పర్యాటక మరియు సాంస్కృతిక (సి & ఒఎల్) శాఖ- 2017 వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ 4వ చట్టం - ఆంధ్రప్రదేశ్ తెలుగు భాష అభివృధి ప్రాధికార సంస్థ (ఏర్పాటు) నియమములు, 2018- తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులను నియమించడం - ఉత్తర్వులు జారీ.

యువజనాభ్యుదయం, పర్యాటక మరియు సాంస్కృతిక (సి & ఒఎల్) శాఖ

జి. ఓ. ఎమ్.ఎస్.సంఖ్య.13

తేదీ: 05.07.2022

కింది వాటిని పరిశీలించండి:

1. ఆంధ్రప్రదేశ్ పర్యాటకం, సంస్కృతి మరియు వారసత్వ చట్టం, 2017 (2017 ఆంధ్రప్రదేశ్ చట్టంనెం.4), తేదీ: 26.04.2017.
2. జి.ఓ.ఎమ్.ఎస్.సంఖ్య. 40, యువజనాభ్యుదయం, పర్యాటక మరియు సాంస్కృతిక (పియంయు) శాఖ, తేదీ: 10.07.2018.

ఉత్తర్వు:

సూచిక 1 నందు, పర్యాటక అభివృద్ధి, కళలు మరియు సంస్కృతి అభివృద్ధి మరియు తెలుగు భాష యొక్క పరిరక్షణ, ప్రచారం కోసం అలాగే స్వయంప్రతిపత్తి గల బోర్డు మరియు అథారిటీ స్థాపించే విషయమును, పైన పేర్కొన్న లక్ష్యం సాధించడం కొరకు సంబంధించిన విషయాలను ఆంధ్రప్రదేశ్ పర్యాటకం, సంస్కృతి మరియు వారసత్వ చట్టం, 2017 (2017 ఆంధ్రప్రదేశ్ చట్టం నెం 4) అందించడం జరిగింది.

2. ఆంధ్రప్రదేశ్ పర్యాటకం, సంస్కృతి మరియు వారసత్వ చట్టం, 2017 (2017 ఆంధ్రప్రదేశ్ చట్టం నెం.4) లోని 6 విభాగములో అందించబడిన అధికారాలను ఉపయోగించడం ద్వారా, ప్రభుత్వం ఇప్పటికే తెలుగు భాషా అభివృద్ధి అథారిటీని పైన చదివిన 2వ సూచన ద్వారా ఏర్పాటు చేసింది.

3. పై అంశములను జాగ్రత్తగా పరిశీలించిన తరువాత ప్రభుత్వం శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం వారిని అదనంగా తెలుగు భాషా అభివృద్ధి అథారిటీ అధ్యక్షులుగా నియమించడం జరిగింది.

4. సంచాలకులు, భాషా మరియు సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ విజయవాడ తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటారు.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గారి ఉత్తర్వులు మేరకు వారిపేరు మీదుగా జారి చేయడమైనది)

రజత్ భార్గవ

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

టు

కమీషనర్ ఆఫ్ ప్రింటింగ్ మరియు స్టేషనరీ, స్టోర్స్ అండ్ పర్చేజ్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ

(పై ఆర్డర్‌ను ఆంధ్రప్రదేశ్ గెజిట్లో ప్రచురించమని అభ్యర్థనతో).

శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం.

సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్, విజయవాడ.

సచివాలయంలో అన్ని శాఖలు.

రంగనాయకమ్మ రచనలు

నవలలు-16:
1) కృష్ణవేణి - 80 రూపాయలు
2) పేక మేడలు
3) చదువుకున్న కమల - 60 (2వ, 3వ పుస్తకాలు ఒకే సంపుటంగా)
4) బలిపీఠం - 60
5) కూలిన గోడలు - 50
6) స్త్రీ - 40
7) రచయిత్రి - 80
8) ఇదే, నా న్యాయం! - 60
9) కళ ఎందుకు? - 50
10) స్వీట్ హోమ్ - 180
11) అంధకారంలో - 50
12) జానకి విముక్తి - 140
13) కళ్ళు తెరిచిన సీత - 140
14) దొంగ తల్లిదండ్రులుంటారు జాగ్రత్త! - 150
15) వాళ్ళిద్దరూ అంతేనా? - 150
16) కళ్యాణి కథ - 100

నవలా పరిచయాలు-3:
1) స్పార్టకస్ (హోవర్డ్ ఫాస్ట్ నవల)
2) టామ్ మామ ఇల్లు (హారియట్ బీషర్‌స్టోవే నవల)
3) స్వేచ్ఛాపథం (హోవర్డ్ ఫాస్ట్ నవల)
(ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా)-- 80

నవలికలు-7:
1) ప్రేమ కన్నా మధురమైనది
2) ఆండాళమ్మగారు!
3) చుట్టాలు
4) పల్లెటూరు
5) నా డైరీలో ఒక పేజీ (కొంత భాగం)
(ఈ 5 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) -70
6) రత్నమ్మ గారి కోడలు.
7) సుబ్బమ్మ గారి అల్లుళ్ళు
(6వ, 7వ నవలికలు ఒకే సంపుటంగా) - 80

నవలికలూ, వ్యాసాలూ కలిసిన సంపుటాలు-2:
1) పల్లవి లేని పాట - 100
2) చంద్రుడు ఉండడు, తారలూ ఉండవు,
నేను ఎప్పటికీ నీ దాన్నిగా ఉంటాను ! - 80

కథల సంపుటం-1:
1)అమ్మకి ఆదివారం లేదా?
(50 కథలు ఒకే సంపుటంగా) - 180

కథలూ, వ్యాసాలూ కలిసిన సంపుటాలు-3:
1) శ్రామిక కోణం - 120
2) అభ్యుదయ ప్రేమలు! - 80
3) 'ప్రేమ'కి ముగింపు ఎప్పుడు? - 80

పెద్ద వ్యాసాలు-17:
1) నిశిత పరిశీలనా, దగాకోరు పరిశీలనా?
2) జనసాహితితో మా విభేదాలు
3) తీగలాగారు, డొంకంతా కదిలింది!
(ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) - 90
4) నీడతో యుద్ధం! 50
(నాస్తిక, హేతు, నవ్యమానవ వాదాలపై 3 పుస్తకాలు కలిసిన సంపుటం)
5) చలం సాహిత్యం
(చలంగారి నవలల మీద సమీక్షలు కూడా కలిసి) - 40
6) 'అసమానత్వం'లో నించి 'అసమానత్వం'లోకే!
7) తులసి దళం కాదు, గంజాయి దమ్ము!
8) 'యజ్ఞం' కథ మీద 2 వ్యాసాలు
9) ఈ 'చక్కని పాడియావు' ఎవరిది?
(6 నించీ 9 వరకూ, ఒకే సంపుటంగా) - 90
10) వాడుక భాషే రాస్తున్నామా? - 50
11) తెలుగు నేర్పడం ఎలా? - .70
12) ఇంటి పనీ - బైటి పనీ - .40
13) దళిత సమస్య పరిష్కారానికి, బుద్ధుడు చాలడు,
అంబేద్కరూ చాలడు, మార్క్సు కావాలి - 70
14) ఇంగ్లీషు కీకారణ్యంలోకి ప్రవేశించండి!
(తెలుగు విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామరు పాఠాలు) - 150
15) కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు? - 60
16) కమ్యూనిస్టులు, బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల్లో
పాల్గొనవచ్చునా, లేదా? - 40
17) మార్క్సిజం మీద విమర్శలకు జవాబులు - 40

వ్యాసాల సంపుటాలు-6:
1) మానవ సమాజం (నిన్నా, నేడూ, రేపూ) - 100
2) మార్క్సిజమే తెలియకపోతే, పుట్టినవాళ్ళం పుట్టినట్టే వుంటాం! -100
3) మార్క్సే నా టీచరు! - 50
4) ఇది, మానవ సమాజమేనా? - 50
5) '' మహానటి '' సినిమా, ఆ 'నటి ' కి న్యాయం చేయదు - 70
6) 'సంపద సృష్టి కర్తలు'' ఎవరు ? - 40

ప్రశ్నలూ, జవాబులూ-2:
1. శాస్త్రీయ దృక్పథం
2. పాఠకుల ప్రశ్నలూ, రంగనాయకమ్మ జవాబులూ
(ఈ 2 పుస్తకాలూ ఒకే సంపుటంగా) - 60

అనువాదాలు-2:
1. చైనాలో ఏం జరుగుతోంది? - 50
2. చైనాలో సాంస్కృతిక విప్లవమూ, పరిశ్రమల నిర్వహణా! %-- 50

ఇతర రచనలు-18:
1) రామాయణ విషవృక్షం (ఒకే సంపుటంగా) - 250
2) మార్క్స్ ''కాపిటల్'' పరిచయం. - 330 (2 సంపుటాలుగా)
3) ఒకటవ తరగతి తెలుగు వాచకము - 20
4) పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం
(మార్క్సు 'కాపిటల్' ఆధారంగా రాసిన 95 పాఠాలు)- 120
5) శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి! - 50
6) ఆత్మ కథాంశాల ఉత్తరాలు - .40
7) తత్వశాస్త్రం-చిన్న పరిచయం. - .80
8) ఇదండీ మహా భారతం! - 170
9) ఒక సంఘ సంస్కర్త భార్య ఆత్మ కథ!
ఒక పాటల కవి భార్య మనోవేదన! - 40
10) పాఠకులు నాకు రాసిన ఉత్తరాలు - 50
11) వేదాలు! వేదాలు! వేదాలు! వేదాలు! ఏం చెప్పాయి వేదాలు? - 90
12) 1917 అక్టోబరు విప్లవం ఎందుకు పోయింది?
సోవియట్ రష్యాలో ఏం జరిగింది? - 100
13) మార్క్సు రాసిన 'కాపిటల్' పుస్తకం ఏం చెప్పింది? - 100
14) 'కమ్యూనిస్టు ప్రణాళిక' పరిచయం - 40
15) 'పారిస్ కమ్యూన్' పరిచయం - 50
16) మార్క్సు-ఎంగెల్సులు వర్గాలగురించి ఏం చెప్పారు ? - 50
17) ఒక వస్తువు 'ధర'కీ, ఆ వస్తువు కోసం జరిగిన 'శ్రమ'కీ,
సంబంధం ఎలా ఉంటుంది ? - 50
18) కమ్యూనిస్టు సమాజాన్ని చూద్దాం ! - 50

ప్రతులకు:**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002
(ఫోన్: 9440630378)

కరణం కళ్యాణ కృష్ణకుమార్
98484 28978

తెలుగుజాతి గుండె చప్పుడు 'ప్రకాశం'



"ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు శ్రీ ప్రకాశం గారి కృషి చిరస్మరణీయం. అతని జీవితం, ఆయన చేపట్టిన కార్యక్రమాలు నిజానికి ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా మొత్తం దేశ పురోగతికి, శ్రేయస్సుకు కొత్త శకాన్ని లిఖించాయి" -మాజీ రాష్ట్రపతి, ఆర్ కె నారాయణ్(పార్లమెంటు భవనంలో ఆంధ్రకేసరి విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా)

ఆంధ్రా ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా టంగుటూరి ప్రకాశం తన సొంత మొదటి రాజకీయ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఆ సమయంలో తెలుగువారిలో సున్నితమైన సమస్యగా ఉన్న భాషారాష్ట్రాల ప్రశ్నపై, అవి ఏర్పడకుండా, అవసరమైన స్థానిక భాషలలో పరిపాలన చేయడం సాధ్యం కాదని ప్రకాశం తేల్చిచెప్పిన దూరదృష్టి గల నాయకుడు ప్రకాశం.

ఆ సందర్భంగా, ఆ మేనిఫెస్టోలో భాషా ప్రాతిపదికన ప్రావిన్సులను పునర్వ్యవస్థీకరించాలని స్పష్టంగా పేర్కొన్నారు. దేశంలోని వాడుక భాషల్లో పరిపాలన సాగినప్పుడే సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని ఆయన స్పష్టంచేశారు. జాతీయ సమైక్యతను, జాతీయ విముక్తిని దెబ్బతీసేందుకు భాషాభావాలను దోపిడీ చేస్తున్న అన్ని శక్తులను నిర్మూలించడం ద్వారా జాతీయ ఐక్యతను బలోపేతం చేయగలమని ఆయన నొక్కిచెప్పారు. ప్రముఖ విద్యావేత్త సి.ఆర్.రెడ్డి వ్యాఖ్యానించినట్లుగా, ప్రకాశం పంతులు, పార్టీ రాజకీయాలకు అతీతంగా ఎదిగి, భారతదేశానికి గాంధీజీ ఎలా జీవించారో, ప్రకాశం ఆంధ్రాకు అలా ఎదిగి వారి విశ్వాసాలకు అండగా ఉన్నారన్నది కాదనలేని సత్యం.

భాషాప్రయుక్త రాష్ట్రాలపై ఆయన పట్టుదల భారత స్వాతంత్ర్య పోరాటంతో విభేదించలేదు. "పోరాటంలో విజయం సాధించే వరకు మనం మన విభేదాలన్నింటినీ మరచిపోవలసి ఉంటుంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల పై తన ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, "మేము విభజనను డిమాండ్ చేసినప్పుడు మేము మా సోదరుల నుండి పూర్తిగా దూరమవుతున్నామని అర్థం కాదు. విడిపోవడం అనేది ప్రతి ప్రాంతపు పరిపాలనా సౌలభ్యంతో పాటు అభివృద్ధి కోసమే. వ్యాపారం, స్నేహం మరియు ఇతర సంబంధాలు చెక్కుచెదరకుండా ఉంటాయి" అని పేర్కొని తన స్పష్టమైన అవగాహనను వ్యక్తపరచారు.


1921లో పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా మారకముందే, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుపై ఆయన ఆందోళన స్పష్టంగా కనిపించింది. అయితే, స్వాతంత్ర్యానంతరం, ప్రత్యేక రాష్ట్రం కోసం ఆంధ్రుల డిమాండ్‌ను సాధించడానికి ప్రకాశం తన ప్రయత్నాలను పునరుద్ధరించారు. ఆయన ఈ విషయాన్ని రాజ్యాంగ సభ లోపలా, బయటా కదిలించారు.

దేశంలోని వివిధ భాషా సమూహాల నుండి నిరంతర డిమాండ్లను అనుసరించి, కేంద్ర నాయకత్వం 1947-1948లో ధార్ కమిషన్‌ను మరియు 1948-1949లో జెవిపి కమిటీని ఏర్పాటు చేసింది.

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ డిమాండ్‌ను అమలు చేయడంలో జాప్యం జరగడం పట్ల అసంతృప్తితో ఆంధ్రా ప్రజలు గాంధేయ పద్ధతిలో ఆందోళనకు దిగారు. స్వాతంత్ర్యానంతరం 1952లో హైదరాబాద్ స్టేట్ ప్రజాపార్టీని స్థాపించిన ప్రకాశం పంతులు భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు విస్తృత కృషి ప్రారంభించారు మరోవైపు పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలుగువారి కోసం ప్రాణాలర్పించారు. భాషా ప్రావిన్సుల ఏర్పాటును వ్యతిరేకించిన ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తెలుగు వారి డిమాండ్‌ను చివరకు అంగీకరించి, డిసెంబర్ 16, 1952న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ తరువాత ఏర్పడిన అనేక పరిణామాల అనంతరం ప్రకాశం ముఖ్యమంత్రిగా, కర్నూలు రాజధానిగా 1953అక్టోబర్1న కొత్త రాష్ట్రం ఉనికిలోకి వచ్చింది. నవంబర్1,1956న ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఏర్పడ్డాయి, ఆ తర్వాత 1960లో గుజరాత్, మహారాష్ట్రలు ఏర్పడ్డాయి. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు దక్షిణ భారతదేశంలోని భాషా సమూహాల చరిత్రలో ఒక ముఖ్యమైన ఘటన.

'మద్రాస్ మనదే' ఉద్యమం

భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రం. అందులో టంగుటూరి ప్రకాశం పంతులు పాత్ర అనన్య సామాన్యం అనడంలో సందేహం లేదు. తెలుగు భాషా రాష్ట్రం మద్రాసుతో సహా ఏర్పడాలన్ని తపన పడ్డ నాయకులలో ముందున్న తెలుగు నాయకుడు ప్రకాశం. గొల్లపూడి సీతారామశాస్త్రి మొదలెట్టి విఫలమైన నిరసన దీక్షను భుజానికెత్తుకుని అసువులు బాసిన కీర్తి పొట్టి శ్రీరాములుగారికి దక్కింది. మద్రాసును వదులుకుంటే వెంటనే ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటిస్తామని పొట్టి శ్రీరాములుగారి ఆత్మబలిదానానికి కొన్ని రోజులకు



ముందే ప్రధాని నెహ్రూ ప్రకటించారు. అయితే శ్రీరాములుగారి పట్టుదల అంతా మద్రాసుతో కూడిన తెలుగురాష్ట్రం కోసమే. నిజానికి 1921 నుండే ప్రకాశంగారు ఈ డిమాండుతో ముందుకు సాగారు. చివరిదాకా పోరాడుతూనే ఉన్నారు. మద్రాసు తెలుగు నగరమే అని నిరూపించడానికి అన్ని సాక్ష్యాధారాలతో ఆయన నివేదికను బహిరంగంగా ప్రచురించారు. తెలుగు ప్రజలకు వ్యతిరేకంగా మన పార్టీలు, నాయకులే, స్వార్థంతో చేసిన కుట్రలను ప్రతికక్షులు ఉపయోగించుకున్నారు. అ పరిణామాలను ఆయన ఆపలేక పోయారు. మద్రాసులేని ఆంధ్రరాష్ట్రమే మనకు దక్కింది. అధికారం కోసం ఆవురావురుమంటున్న నాయకులను లొంగతీసుకుని కేంద్రం వ్యవహరించింది. టంగుటూరి ప్రకాశం పంతులు గారికి రావలసిన ఖ్యాతి దక్కకుండా పోయింది. మద్రాసు నగరమూ దక్కలేదు, పొట్టి శ్రీరాములు గారినీ కోల్పోయాము.

నేటికి సుమారు 79 సంవత్సరాల క్రితం, తెలుగు మాట్లాడే పౌరులు మద్రాసు నగరాన్ని తమదని,తమ భవిష్యత్తు రాష్ట్రానికి రాజధానిగా ఉండాలని కోరుకున్నప్పుడు ఆందోళనలు మొదలైనాయి.

మద్రాస్ ఒక ప్రెసిడెన్సీ పట్టణం - దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద వలస నగరం. తెలుగువారు, తమిళులు, కన్నడిగులు మరియు మలయాళీలు అందరూ ఇక్కడ నివసిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటం తీవ్రరూపం దాల్చడంతో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు డిమాండు అధికమైంది. ప్రత్యేక ప్రావిన్స్ కావాలనే డిమాండ్‌ను లేవనెత్తిన వారిలో తెలుగువారు మొదటివారు. ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్ 1912 నుంచి ఉన్నప్పటికీ, ఇది 1940-50 మధ్య 1950లలో ఊపందుకుంది. నిరంతర ప్రదర్శనలు, సమ్మెలు మొదలైనాయి.

అందులో భాగంగా టంగుటూరి ప్రకాశం ఆధ్వర్యంలోనే 'మద్రాసు మనదే' అనే నినాదం ఊపందుకుంది. తెన్నేటి విశ్వనాథం, బులుసు సాంబమూర్తి, బెజవాడ గోపాల రెడ్డి, నీలం సంజీవ రెడ్డి, వీరేశలింగం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి వారు ఆందోళనలో ప్రకాశంతో కలిసి నడిచారు. ఇది ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం మొదలైన బలమైన ఉద్యమ అడుగుగా భావించవచ్చు. అయితే దానికి వ్యతిరేకంగా 'మద్రాసు మనదే' అంటూ తమిళ అరసు కళగం నాయకుడు ఎం. పి. శివజ్ఞానం ఆధ్వర్యంలో తమిళులు ఉద్యమం చేపట్టారు. అంతేగాక తిరుపతి కూడా వదిలేది లేదంటూ ఉద్యమాన్ని కొత్త దారిపట్టించారు

ఈ పరిణామాల నేపథ్యంలో మద్రాస్ నగరం కూమ్ నది వెంట రెండుగా చీలిపోయింది - ఉత్తర భాగం ఆంధ్రాకూ దక్షిణాన తమిళనాడుకీ కేటాయించబడింది. అయితే, అనంతరం అనేక పరిణామాలు తమిళనాడుకు అనుకూలంగా సమస్య పరిష్కారానికి దారితీసింది.

కూమ్ నదికి ఉత్తరాన ఉన్న ప్రాంతాలను ఆంధ్రాకు మరియు నదికి దక్షిణాన ఉన్న ప్రాంతాలను మద్రాసు రాష్ట్రాలకు అనుమతించడం తమిళులతో పాటూ, కేంద్ర నాయకులుకూడా వ్యతిరేకించారు. అప్పటి మద్రాసు ప్రావిన్స్ ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారి మద్రాసు ఆంధ్రా రాష్ట్రానికి వెళ్లడాన్ని సమర్థించలేదు.

నవంబర్ 1941లో ఒక అనుకోని సంఘటన మద్రాసు నగర విభజనను ప్రధాన వేదికపైకి తెచ్చింది. ఆంధ్రా ప్రావిన్స్ ఏర్పాటుపై చర్చించేందుకు మద్రాసు ప్రావిన్స్ మంత్రివర్గం కొన్ని నెలల క్రితం సమావేశమైందని విశాఖపట్నంలో జరిగిన కాంగ్రెస్ మహాసభ సమావేశంలో ప్రకాశం తెలిపిన ప్రకాశం , ఆ సభకు హాజరవ్వాల్సిందిగా వారు గవర్నర్ లార్డ్ ఎర్కిన్‌సన్ను ఆహ్వానించామని, రెండు ప్రావిన్సులు - ఆంధ్ర మరియు మద్రాసు - నగరంలోనే ఉండాలని ఎర్కిన్‌సన్ సూచించారని తెలిపారు. ఈ ఆలోచనకు తమిళ మంత్రులతో సహా అందరూ అంగీకరించారని ప్రకాశం పేర్కొన్నారు. అయితే ఆ తర్వాత 'కేబినెట్‌లోని దుర్మార్గపు మేధావి' ఎర్స్కిన్ మనస్సులో విషం నింపారని, దీంతో మద్రాస్ ఉమ్మడి రాజధాని చర్యకు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యదర్శికి ఎర్కిన్సన్ ఒక లేఖ రాసేలా చేశారని ప్రకాశం ఆరోపించారు. దీంతో ఆంధ్రా ఏర్పడితే 'మద్రాసు వీధుల్లో రక్తం ప్రవహిస్తుంది'అని ఎర్కిన్‌సన్ బ్రిటిష్ ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు సభకు చెప్పారు. 'దుష్ట మేధావి' పేరును వెల్లడించడానికి నిరాకరించిన ప్రకాశం. సమస్య పరిష్కారానికి అప్పుడు ఏర్పాటైన జె.వి.పి. కమిటీ సభ్యులు జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్ మరియు భోగరాజు పట్టాభి సీతారామయ్యలు భాషా ప్రావిన్సుల ఏర్పాటును వాయిదా వేయాలని సిఫార్సు చేశారు. అయితే, ఆంధ్రులు మద్రాసు నగరంపై తమ హక్కును వదులుకుంటే, ఆంధ్రా ప్రావిన్స్‌ను ఏర్పాటు చేయవచ్చని సదరు కమిటీ సూచించింది. తమ వాదనలో భాగంగా **ఉమ్మడి రాజధానిగా చేయడం లేదా నగరాన్ని విభజించాల్సిందే అని టంగుటూరి ప్రకాశం పట్టుబట్టారు.**

జెవిపి వైఖరి తమిళ నాయకులను సంతోషపెట్టగా, తెలుగువారు ఆందోళనకు దిగారు. ప్రకాశం ఆగ్రహానికి గురికాకూడదనే ఉద్దేశ్యంతో, నివేదికపై సంతకం చేసిన పట్టాభి సీతారామయ్య, జెవిపి నివేదికలో మద్రాసు ఆంధ్రలో భాగం కాకూడదని పేర్కొన్నప్పటికీ, అది తమిళ ప్రావిన్స్‌లో భాగంగా ఉండాలని పేర్కొనలేదని చెప్పి ఒప్పించడానికి విఫల యత్నం చేశారు. అంతేగాక నగరం కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

అనంతరం జరిగిన పరిణామాలలో పొట్టి శ్రీరాములు మృతితో

ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో హింసాత్మక నిరసనలు చెలరేగాయి. శాంతించాలని నెహ్రూ విజ్ఞప్తి చేశారు, సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీనిని అనుసరించి, జనవరి 1953లో, ఆంధ్రా ప్రావిన్స్ ఏర్పాటును పరిశీలించడానికి ప్రభుత్వం జస్టిస్ వాంచూను నియమించింది. వాంచూ కమిటీ కొత్త రాష్ట్రం యొక్క సరిహద్దులను గుర్తించింది, అయితే మద్రాస్ మూడు నుండి ఐదు సంవత్సరాల వరకు తాత్కాలిక రాజధానిగా ఉంటుందని నిర్ధారించింది. అది సాధ్యం కాకపోతే శాశ్వత నగరాన్ని కనుగొనే వరకు గుంటూరు లేదా విశాఖపట్నం తాత్కాలిక రాజధానిగా ఉండవచ్చని కమిటీ సూచించింది.

ఇది రాజగోపాలాచారి మరియు ఇతర తమిళ నాయకులకు ఆమోదయోగ్యం కాదు. చివరగా, 1953 మార్చిలో, మద్రాసు తాత్కాలిక రాజధాని కాదని నెహ్రూ ప్రకటించారు. అక్టోబరు 1953లో కర్నూలు తాత్కాలిక రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు వి.కాళేశ్వరరావు రాష్ట్ర విభజనకు కర్ణాటక సోదరులతో కలిసి మరింతగా కృషి చేయాలని', తెలుగు మాట్లాడే ప్రాంతాలను ఆంధ్రతో కలపాలని ఇతర తెలుగు నేతలకు సూచించారు. ఈ విధంగా, ఆంధ్ర తన శాశ్వత రాజధానిగా హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ జంట నగరాలను పొందవచ్చనేది ఆయన దూరదృష్టి. ఆ ఆలోచనే నిజమవుతూ రెండేళ్ల తర్వాత హైదరాబాద్ రాజధానిగా విశాల ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. మద్రాసు తమిళనాడులోనే ఉండిపోయింది. ఆ తర్వాత తొలి భాషా ప్రయుక్తరాష్ట్రం కూడా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ అనే రెండు తెలుగు రాష్ట్రాలుగా 2014లో చీలిపోయింది.

అనవరతం తెలుగు వారి కోసం

ఆనాడు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి ఎన్నికైన శాసనసభ్యుల మధ్య భాషా, కుల విభేదాలు తెరపైకి వచ్చాయి. మెరీనా ఉప్పు యాత్ర ఫలించబోతున్న సందర్భంలో భాషాప్రయుక్త రాష్ట్రాల విభజనకు బీజం పడింది. అదే సమయంలో తెలుగు మాట్లాడే శాసనసభ్యులు మిగిలిన వారి కంటే ఎక్కువ సంఖ్యలో ఉండటంతో మద్రాస్ ప్రావిన్స్ ప్రధానమంత్రిగా ప్రకాశం ఎంపిక ఖరారైంది. ఆయన ఎన్నికయ్యారు. రాజాజీ ప్రధాని కావాలని ఆశించిన పలువురు కాంగ్రెస్ పెద్దలకు ఈ మార్పు ఆగ్రహం తెప్పించింది. గాంధీజీతో సహా!

అతని మంత్రిత్వ శాఖ ఎలా పని చేస్తుందని మేధావుల మస్తిష్కాలలో ప్రశ్న ఉదయించినప్పుడు అందుకు సమాధానంగా ప్రకాశం తన తక్షణ బాధ్యతగా, జైలులో మగ్గుతున్న రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం వ్యక్తులపై, పట్టణాలపై విధించిన శిక్షార్హమైన జరిమానాలను తిరిగి చెల్లించారు.

భారతి పద్యాలపై నిషేధం, త్రివర్ణ పతాకం ఎగురవేయడంపై విధించిన నిషేధాన్ని రద్దు చేశారు. అసభ్యత పేరుతో నిషేధించబడిన మొదటి పుస్తకం రాధికాసాంత్వనం పై నిషేధాన్ని ఎత్తివేశారు. ఈ సందర్భంలో ప్రకాశం మాట్లాడుతూ "నేను తెలుగు సాహిత్యం యొక్క హారానికి కొన్ని ముత్యాలను పునరుద్ధరిస్తున్నాను" అని గర్వంగా ప్రకటించడం తెలుగు పట్ల, తెలుగు వారి పట్ల ప్రకాశంకి ఎంత ప్రేమ, నిబద్ధత ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది.

ఒక దశలో– మద్రాస్‌లోనే పుట్టిన పొట్టి శ్రీరాములు, మద్రాసుతో సహా తెలుగు రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కొనసాగుతున్న హింసాత్మక ఆందోళనలు పదకొండు తెలుగు మెజారిటీ జిల్లాలు మరియు బళ్లారి జిల్లాలోని మూడు తాలూకాలతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది. మద్రాసు నగరంపై తెలుగు నాయకులు తమ హక్కును వదులుకోవాలని భావించి కర్నూలును రాజధానిగా చేశారు. టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా కొత్త రాష్ట్రం 1 అక్టోబర్ 1953న ఉనికిలోకి వచ్చింది.

తెలుగు రాష్ట్రం ఏర్పాటు కోసం అహరహం శ్రమించిన ఎందరో నాయకులను విస్మరించిన మన పాలక వర్గాలు వారి సరసన ఆంధ్రకేసరి ప్రకాశం పంతులును కూడా చేర్చడం దురదృష్టం. సంపూర్ణ గాంధేయవాదైన ప్రకాశం మద్రాస్ నగరంలోని చైనా బజార్‌లో జరిగిన హర్తాళ్ సందర్భంగా బ్రిటిషర్లు ఒక యోధుడిని కాల్చి చంపి, తుపాకులు ఎక్కుపెట్టి ముందుకు రావద్దని హెచ్చరించినా లెక్కచేయక ఆ యోధుని మృతదేహం దగ్గరకి వెళ్ళేందుకు గుండె చూపి 'కాల్చండిరా!' అంటూ ఆగ్రహావేశాలకు లోనైన ధీరోధాత్తుడు. ఒక్క రూపాయి టోకెన్ బడ్జెట్‌తో కృష్ణానదిపై ఆనకట్టకు శంకుస్థాపన చేసి కృష్ణాడెల్టాలోని లక్షలాది ఎకరాలకు నీరందించిన రెండవ కాటన్ ఆంధ్ర కేసరి ప్రకాశంని రెండు రాష్ట్రాల నాయకులూ మరచిపోయారనడంలో సందేహం లేదు. ఆ మహానాయకుడు ఈ నేలపై జన్మించి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కేవలం ఓ అధికారిక సంబరంగా ప్రకటించి ఏ ప్రత్యేక కార్యక్రమం లేకుండా కేవలం ఓ తులం పూలుజల్లి నివాళి అర్పించి ఏదో చేశామని జబ్బలు చరుచుకోవడం తెలుగుజాతికే అవమానం.

ఇప్పటికైనా తప్పును దిద్దుకుంటూ మన రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 23 నుండి 2023 ఆగస్టు 23 వరకు టంగుటూరి ప్రకాశం పంతులుగారి 150వ జయంతి సంవత్సరంగా ప్రకటించాలని కోరుతున్నాము. ఈ సంవత్సరమంతా తెలుగుజాతి భాష, చరిత్ర, సంస్కృతి అనే అంశాలపై సభలు, సమావేశాల ఏర్పాటును, పరిశోధకులకు ప్రోత్సాహాన్ని ప్రజల్లో భాషాస్వాభిమాన చైతన్యాన్ని పెంపొందించేందుకు తగిన కార్యక్రమాలను నిర్వహించాలని, నిర్వహించే వారిని ప్రోత్సహించాలని కోరుతున్నాము.


వ్యాస రచయిత జర్నలిస్టు, కథల కవితల రచయిత

భాష నశిస్తే జాతి నశిస్తుంది.

తాపీ జయంతి ప్రత్యేకం
19 సెప్టెంబరు

ఏటుకూరి ప్రసాద్
93910 07780

గురువుకు తగ్గ శిష్యుడు



తాపీ ధర్మారావు
కనువెలుగు: 1887 సెప్టెంబరు 19
కనుమరుగు: 1973 మే8

"1757లో ప్లాసీయుద్ధం వల్ల దేశానికెంత అరిష్టం వచ్చిందో 1857లో చిన్నయసూరి ఆచార్యుడు కావడంవల్ల తెలుగుభాషకంత నష్టం వచ్చింది''

"విద్యాప్రణాళికలో విద్యార్థులకు మార్గ దర్శకంగా వ్యావహారిక భాషకు అవకాశం కల్పించమని పండితుల్నీ, ఆచార్యవర్గాన్నీ నేను కోరుతున్నాను. ఇరవై సంవత్సరాల అనంతరం లేదా 50 సంవత్సరాల అనంతరం నేటి దుస్థితి కంటె అన్నివిధాలా బాగుపడుతుందని నేను పండితులకూ, ఆచార్యవర్గానికీ హామీ ఇస్తున్నాను.

(19-04-1965 శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన భాషాసదస్సులో)

"ముఖానికి బొట్టు లేదేం?" అన్న పిడుగులాంటి ప్రశ్నకు ఎలా సమాధానం చెప్పాలో తోచలేదు ఓ విద్యార్థికి. ఎలాగోలా సంబాళించుకొంటూ లేచి నిలబడి, "నేను నాన్ బ్రాహ్మిన్నండీ అన్నాడు", "ఏం, అయితే బొట్టక్కర్లేదూ?" మరో గర్జన. తుళ్ళిపడ్డం విద్యార్థి వంతైంది. అలా మొదలైందో గురుశిష్యుల అనుబంధం.

ఈ సంభాషణ నిన్నా మొన్నటిదికాదు. 1905 నాటి ముచ్చట. జరిగింది పర్లాకిమిడి కాలేజీలో. గర్జించింది గిడుగు రామమూర్తి. తుళ్ళిపడ్డది బండారు ధర్మారావు, అదే తాపీ ధర్మారావు. ధర్మారావుగారి అసలింటిపేరు బండారువారు. వీరి తాతలు తాపీ మేస్త్రీలుగా ఉండేవారు. అదే క్రమంగా వీరింటిపేరైంది.

తగాదాతో ప్రారంభమైన వీరి అనుబంధం మధ్యలో శత్రుత్వంగామారి చివరికి గిడుగు ఉద్యమానికి సరైన వారసుడు దొరికాడన్న తృప్తితో గిడుగు కన్నుమూసేలా పరిణమించింది.

ధర్మారావుగారు విజయనగరంలో మెట్రిక్ ఫస్టు క్లాసులో పాసయి, ఎఫ్.ఏ.లో జేరటానికి పర్లాకిమిడి వెళ్ళక తప్పిందికాదు. అప్పుడక్కడ చరిత్ర అధ్యాపకులుగా గిడుగు ఉండేవారు. ఆ కాలేజికి వీరు వైస్ ప్రిన్సిపాల్‌కూడాను. ప్రిన్సిపాల్ మంగు శ్రీనివాసరావుగారు. వైస్ ప్రిన్సిపాల్ అంటే కాలేజి అంతా గడగళ్ళాడేది. ధర్మారావుగారికి వీరు గ్రీసు, రోము చరిత్రలు చెప్పేవారు. తాపీవారి జ్ఞాపకాలపొరలు తిరగేస్తే "ఆ చరిత్రలు అలా చెప్పేవారు మద్రాసు రాజధానిలో మరెవ్వరూ లేరని ప్రతీతి. చరిత్ర చెప్తూంటే ఆయా పాత్రలు ప్రత్యక్షమైనట్టు చెప్పేవారు. వారి లెక్చర్లు వింటే చాలు. పుస్తకాలు చదవనక్కర్లేకుండానే పరీక్షలు పాసవుతారని నమ్మకం." అందుకే తాపీ అక్కడ చదువుకోటానికెళ్ళారు. అప్పుడక్కడ బంకుమల్లి మల్లయ్యశాస్త్రిగారు తెలుగు చెప్తూండేవారు.

బొట్టుతో ఆరంభమైన తగాదావల్ల తాపీవారు బొట్టెట్టుకొని క్లాసు కొచ్చేవరకు గిడుగు తాపీవారి మొఖం కనపడకుండా ఉండాలని వీరివైపు వీపుబెట్టే పాఠం చెప్తుండేవారు. అలా రెండుమూడు నెలలు గడిచాయి. ఇద్దరూ ఇద్దరే. ఇంతలో ధర్మారావుగారి పాండిత్యం "అటు లెక్కల్లోనూ, ఇటు ఇంగ్లీషులోనూ అందరికీ తెలిసింది. లెక్చరర్లు కూడా వీరిచేత విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తూండేవారు.

గిడుగువారు పాఠం చెప్పే పద్ధతి చాలా గమ్మత్తుగా ఉండేది. చరిత్రను అనేక రకాల పటాలతో, రిఫరెన్సు పుస్తకాలతో గుప్పించేవారు. అదంతా లెక్చరింగ్ పద్ధతిగా అనిపిస్తూనే ఓ కావ్యం చెప్తున్నారా?! ఓ నాటకం ఆడిస్తున్నారా?! అనే అనుమానం వస్తూండేది క్లాసులోవాళ్ళకి. దాన్ని ధర్మారావుగారు గమనించారు. గిడుగు క్లాసులో సూచించే పుస్తకాలన్నీ చదువుతూండేవారు. ఇతర్లనడిగే ప్రశ్నలకు కూడా తానే కల్పించుకొని సమాధానం చెప్పటం ఆరంభించారు. అలాగైనా గిడుగుకు తనమీదొచ్చిన చిరుకోపం ఉపశమిస్తుందేమోనన్న ఆశే తాపీవారికుండేది.

పిల్లలచేత పనిచేయిస్తూ పాఠం చెప్పే వ్యక్తి గిడుగు. ఇదిప్పుడు అత్యంత ఆధునికమైన పాఠం చెప్పే పద్ధతిగా గుర్తించారు. బోధనా పద్ధతుల్లో, చరిత్రలో భాగం మేప్ డ్రాయింగ్.

ఓనాడు గిడుగు పిల్లలవైపు వీపు పెట్టి బోర్డుకు తగిలించిన మేప్‌లో స్పార్టా చూపించమని విద్యార్థుల్నడుగుతున్నారు. అందరూ బిక్కమొగాలేసుకున్నారు. ఒకడు మాత్రం స్పార్టా చూపాడు. "ఎవడ్రా వీడు" అంటూ వెనక్కి తిరిగారు గిడుగు. ఇంకెవరు! తాపీవారే. దాంతో ధర్మారావంటే గిడుగుకు ఉన్న కోపం పోయింది.

లైబ్రరీకి ధర్మారావుగారిని తీసికెళ్ళి "ఇతనికేం పుస్తకం కావాలన్నా ఇవ్వండి" అంటూ ఓ ఆర్డరు జారీ చేశారు గిడుగు.

క్లాసులోని విద్యార్థులు ఏమేం పుస్తకాలు గ్రంథాలయం నుండి చదువుతున్నారో ప్రతివాడూ పుస్తకంలో రాయాలన్న రూలొకటి పెట్టారు, గిడుగు. ఓనాడు ధర్మారావుగారి పేజీలో 'తారాశశాంక విజయం' రాసుండటం గిడుగు గమనించి తాపీవారి నడిగారు. అందులో పద్యాలతో సహా

వివరించారు ధర్మారావు. ఆశ్చర్యపోవడం గిడుగు వంతైంది.

దాంతో ధర్మారావుగారికి తన సొంత గ్రంథాలయంలో పుస్తకాలు చదవమని ఇస్తూండేవారు. ఆ పుస్తకాల్లో గిడుగు చేసిన క్రీగీతలూ, రాసిన కామెంట్సూ చూస్తే అసలు పుస్తకాన్నెలా చదవాలో తెలిసిందని ధర్మారావుగారన్నారు. విజయవిలాసాన్ని అంతటి ప్రతిభా పాండిత్యాలతో అధ్యయనం చేయగలసత్తా, దృష్టీ గిడుగువారు ప్రసాదించిన వరమే అనాలి తాపీవారికి. ప్రాచీన ప్రబంధాలను చదవటం తనకు అలవాటు చేసిన వ్యక్తి గిడుగేనంటారు తాపీ, పిల్లలకు ఎలా విద్యాబోధన చెయ్యాలో వారితో ఎలా మెలిగి సరైన మార్గానికి తిప్పాలో ధర్మారావుగారు గిడుగు శిష్యరికంలోనే నేర్చుకున్నారు. తాను న్యూయింగ్‌టన్ కాలేజిలో పనిచేసినా, జమీందార్లకు ట్యూటర్‌గా ఉన్నా, విజయనగరంలో ట్యుటోరియల్ కాలేజి నడిపినా, నాడు తనకు గిడుగు చూపించిన మార్గమే ఇన్ని చోట్లా ఆసరాగా నిల్చిందన్నది వారి అభిప్రాయం.

మన ప్రాచీన పరీక్షా విధానంలో 'శలాకా' పద్ధతని ఒకటుండేది. అలాగే గిడుగువారి పద్ధతీనూ. ఉన్నట్లుండి ఓ టాపిక్‌ను క్లాసులో చెప్పి ప్రశ్నల పరంపర కురిపించేవారు. అలాగే ఓనాడు తాపీవారి క్లాసులో 'ఈ వేళ రాజ్యాంగాన్ని గురించి మాట్లాడుకుందాం' అంటూ మొదలెట్టారు గిడుగు. ఓ ప్రశ్న విసిరారు. క్లాసంతా తెల్లమొగం వేసింది. తాపీవారి బెంచీ మీదకొచ్చి కూచొని "ఊ నువ్వు" అన్నారు. ఆయనా మెజారిటీలో కల్సిపోయారు. గిడుగు తన చెవికున్న ట్రంపెట్ తీసి బల్లమీద విసిరేసి ఇక ఈ క్లాసుకు తాను రాననీ, ఎవ్వరూ రానక్కరలేదనీ కబురెట్టి వెళ్ళిపోయారు. వారి కోపమంతా తాపీ మీదనే. తన అభిమాన విద్యార్థికూడా ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడే అన్న కోపం. ఓ కుర్రాణ్ణి "ధర్మారావు దగ్గరున్న నా పుస్తకాలన్నీ ఈడ్చుకు రండి" అని పంపించారు. తాపీ తక్కువ తిన్నాడా! ఇవ్వను పొమ్మన్నాడు. ప్రిన్సిపాల్ కలుగచేసుకొని ఇద్దరికీ సామరస్యం కుదర్చడంతో ధర్మారావుగారు గిడుగువారింటికెళ్ళి పుస్తకాలు అప్పగింత పెట్టిరావడంతో ఆ సమస్య తేలిపోయింది.

అలా ధర్మారావుగారి గిడుగు శిష్యరికం కోపంతో ఆరంభమై మిత్రత్వంతో ముగిసింది. ఎప్పుడైతే గిడుగు వ్యావహారిక భాషా ఉద్యమాన్ని తలకెత్తుకున్నాడో అప్పటి నుండీ వారికి వ్యతిరేకంగా తాపీ గ్రాంథిక భాషా ఉద్యమాన్ని నిర్వహించడం ఆరంభించారు.

గిడుగువారి కార్యదీక్ష, వారిజ్ఞానం, వాదనాపటిమా, క్షుణ్ణంగా దగ్గరుండి గమనించిన వ్యక్తి తాపీ గనుక అలాగే వారి వాదాన్ని ప్రతిఘటించాలని తలపెట్టారు. గిడుగు కృషి తెలుగునాట ఇంకా ఉద్యమస్థాయికి చేరుకోకముందే వారి వాదాన్ని మొగ్గలోనే తుంచాలన్న అభిప్రాయంతో 1908-1909 మధ్య తాపీవారు 'గ్రాంథిక భాషావాదము' అనే చంపక మాలికను రాశారు. ప్రతి సభలోను దాన్ని చదివేవారు. దీన్ని ఖండిస్తూ ఆ రోజుల్లోనే సెట్టి లక్ష్మీనరసింహంగారు ఓ శార్దూల మాలికను రాశారు.

ధర్మారావుగారి దృష్టిలో మొదటి రోజుల్లో బ్రాహ్మణుల మీద రవంత కోపం ఉండేది. దానికి చాలా కారణాలున్నాయి. వాళ్ళ నెదిరించాలంటే, వాళ్ళు ప్రయోగించే సంప్రదాయ పద్ధతిలోనే భాషను అభిమానిస్తూపోయి వాళ్ళకన్నా గొప్పవాడనిపించుకోవాలనుకున్నారు. అప్పుడే వాళ్ళ కంటిని వాళ్ళ వేలితోనే పొడిచినట్టవుతుందని భావించారు. దానికి తోడు, నాటికి బాగా ప్రచారంలో ఉంది గ్రాంథిక భాష. ఆ గాలిలోనే కొట్టుకెళ్ళారు.

ఎప్పుడైతే జమీందార్ల దగ్గర పన్జేస్తూ వారి గ్రంథాలయాల్లో ప్రపంచ సాహిత్యాన్ని, సామాజిక చరిత్రలను అధ్యయనం చెయ్యడం ఆరంభించారో భాష ఒక వర్ణం చేతిలోది కాదన్న అంశం బోధపడింది. **తాను ఎదుర్కోవలసింది బ్రాహ్మణులను కాదనీ, బ్రాహ్మణ తత్వాన్ననీ; వారి పెత్తందారీ తత్వాన్ననీ తెలుసుకున్నారు. కనుక బ్రాహ్మణులు నిర్వహిస్తున్నారని వారు నడిపే ఉద్యమాన్ని ద్వేషించకూడదనీ, సామాజిక పరిణామంలో భాషాపరిణామం ఓ భాగం అవుతుందనీ నమ్మటం ఆరంభించారు. ఆ పరిణామం తెలుగునాట వ్యావహారిక భాషా ఉద్యమమేనని నమ్మారు.** అయినా తాపీవారు ఈ అంశాన్ని దృఢంగా నమ్మటానికి 1936 వరకూ పట్టింది. గిడుగువారి ప్రతి భాషావాదం అధ్యయనం చేశారు. అనేక కవి పండిత సభల్లో పాల్గొన్నారు. గిడుగువారితో ఆయా సాహిత్యసభల ద్వారా మరింత సాన్నిహిత్యం సంపాదించారు. బరంపురంలో జరిగిన అఖిలాంధ్ర కవిపండితుల సభల కెళ్ళారు. గిడుగు వాదాన్ని ప్రతిఘటిస్తున్న కుండలాలవారి వాదంలో బలహీనతలను, డొల్లతనాన్ని గమనించారు. గురజాడ గిడుగుకు అందించిన సహకారాన్నీ, కందుకూరి తాను చనిపోయే దశలో గిడుగు వాదాన్ని సమర్ధించి, ఓ సంఘాన్ని స్థాపించిన పరిస్థితిని అంతా తాపీ శ్రద్ధగా చూశారు.

అంతే. అంతవరకూ తానేవాదాన్ని మోస్తూ వచ్చారో, ఎవరికి ప్రతిద్వంద్విగా నిలిచారో దాన్ని విడిచేశారు.

1936లో తాను వ్యావహారిక భాషా ఉద్యమంలో చేరుతున్నట్లు గిడుగు మేష్టారికో లేఖ రాశారు. ఈ ఉద్యమాన్ని ఓ "మిషనరీజీల్"తో సాగించాలని చెప్పారు. ఈ ఉత్తరం చదివి గిడుగు **"ఇక మన వ్యావహారిక భాషోద్యమానికి ఎలాంటి ఢోకాలేదు. మంచి సాంప్రదాయ పునాదులమీద పైకొచ్చిన ఓ పండితుడు, ఆధునికవాది మనతో చేతులు కల్పుతున్నాడు. ఆయనే తాపీ ధర్మారావు" అని గిడుగు సీతాపతిగారితో అన్నారు.** తన బరువు కొంతన్నా మోసేవాడొచ్చాడని చాలా సంతోషించారు. ఈ అంశాన్ని గిడుగు సీతాపతిగారే ధర్మారావుగారికి మద్రాసులో జరిగిన ఓ సన్మాన సభలో స్వయానా ప్రకటించారు. అయితే దురదృష్టవశాత్తూ ధర్మారావుగారు రాసిన ఆ ఉత్తరం ఎక్కడా దొరకలేదు. ఈ విషయం తాపీవారు అక్కడక్కడా ప్రస్తావించారు.

గిడుగుకు మనసుకెక్కిన శిష్యుడిగా ఉండి, మధ్యలో నిరంతరం తనతో పోరాడిన తాపీ నిజాయితీని, చివరకు ఆ తాపీయే సామాజిక పరిణామంలో భాషల మార్పిడి ఆవశ్యకతను గుర్తించి తనకు లొంగిపోయిన ఘట్టం గిడుగు మనస్సును కదిల్చి ఉండాలి. తనంతటి శిష్యుడు తనకు దొరికాడని పొంగిపోయి ఉండాలి. అలాంటి గురువుకు తాపీ ఇచ్చిన శ్రద్ధాంజలి; పత్రికల్లో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టడం, సినిమాల్లో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టడం, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టడానికి తీవ్ర కృషి చెయ్యడం; తనకుతాను ఆ ఉద్యమంలో ముందు పీటీని ఉండడం. ఇంతకు మించి ఏ శిష్యుడు ఏ గురువు కేం ఇవ్వగలడు. పాత పాళీని విసిరేసి కొత్త పాళీ కట్టి సరికొత్త సిరాతో రచనలు సాగించడం తప్పు! సరిగ్గా అలాగే చేశారు తాపీ. గిడుగు అందించిన వారసత్వం అందుకున్నారు.

రచయిత డా॥ ఏటుకూరి ప్రసాద్ గారి గ్రంథం
'తాపీధర్మారావు జీవితం, రచనలు' నుండి

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

భాషకు, లిపికి ఉన్న బంధం ఏమిటి?-2

భారతీయ లిపి పరిణామక్రమం

గత సంచికలో "భాషకు, లిపికి ఉన్న బంధం" గురించిన నా ఆలోచనలను కొన్నిటిని పంచుకున్నాను. తెలుగు భాష అంటే తెలుగు లిపిలోనే అన్న భావం ఆ వ్యాసంలో ప్రకటించానేమోనన్న భయంతో మళ్ళీ నా అభిప్రాయాలను మరింత స్పష్టం చేద్దామని ఈ వ్యాసం రాస్తున్నాను. నా అభిప్రాయం ప్రకారం భాషకు ఎన్నో రూపాలు, రూపాంతరాలు కలవు. మౌఖికంగా మనిషి నోటి నుండి చేసే శబ్దాల ద్వారా ప్రకటితమయ్యేది భాషే, శబ్దాలు లేకుండా కేవలం హావభావాలతో మనిషి చేసే భావప్రకటనా భాషే, ఈ హావభావాలలో చేతి సైగలూ ఉన్నాయి, ముఖంలోని భాగాలను వివిధ ఆకారాల్లోకి మార్చి ప్రకటించే భావాలూ ఉన్నాయి. తలను అడ్డంగా ఊపితే కాదని, నిలువుగా ఊపితే ఔనని, తలను కుడివైపుకి, ఎడమవైపుకి వెంటవెంటనే ఊపితే ఒప్పని అర్థం వస్తుంది మన భాషలో. రెండు చేతులను అడ్డంగా పరస్పర విరుద్ధంగా ఇరువైపులా ఆడిస్తే కాదనీ, ఒకే చేతిని అలానే ఆడిస్తే వీడ్కోలు అని అర్థం వస్తుంది మన ప్రస్తుత సంస్కృతిలో. ఇవే హావభావాలకు వేరే ప్రాంతాల్లో వేరే అర్థాలుండవచ్చు. అప్రయత్నంగా నోటితో స్స్ అని బాధను వ్యక్తపరిచే శబ్దం కావచ్చు. ఇవన్నీ కూడా భాషలో భాగమే. మరి లిపి? లిపి భాష మనకు ప్రకటితమయ్యే పలు రూపాల్లో ఒక రూపం మాత్రమే. లిపి రెండు సందర్భాల్లో ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. మన భావాలను మన ముందు లేని, వేరే చోట ఉన్న వ్యక్తులకు తెలిపేందుకు. మనం కాలంలో మన తరువాత వచ్చే వారికి మన అనుపస్థితిలో మన గురించిన విషయాలు తెలిపేందుకు.

అయితే మరెందుకనో భాషకున్న ఎన్నో రూపాల్లో ఒకటైన లిపి నేడు ఆ భాషకే ప్రాతినిధ్యం వహిస్తోంది.

కొన్ని తరాలు, కొన్ని సంవత్సరాలు, కొన్ని శతాబ్దాలు వెనక్కు వెళ్ళి చూస్తే మనకు లిపి లేకుండానే భాష మనుగడ ఉండేది. నేడు లిపి నేర్వకపోతే భాషకు ప్రమాదం అని మనం భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. భాష పరిణామక్రమంలో చాలా తరువాత కాలంలో వచ్చి చేరిన లిపికి అంత ప్రాముఖ్యత ఎలా వచ్చేసింది?

మనుషుల మధ్య భావప్రకటనకు సంభాషణలు ముఖ్యం, అంటే ఒకరితో ఒకరు మాట్లాడుకొని ఒకరి సంగతులు మరొకరు తెలుసుకోవటం. సమాజం పెద్దదయ్యే కొద్దీ, మనుషుల మధ్య దూరాలు పెరిగిపోయి, ఈ సంభాషణలు రాత మాధ్యమంగా చోటు చేసుకున్నాయి. ఉత్తరాలతో మొదలై, పుస్తకాలు, పత్రికలు, ప్రకటనలు, ఇలా వివిధ రూపాల్లో లిపిబద్ధమైన భాష భావప్రకటనకున్న అత్యంత ముఖ్యమైన మాధ్యమంగా మారిపోయింది.

మనం గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, సాంకేతిక మార్పుల వలన మనిషి తిరిగి మౌఖిక భాషా మాధ్యమానికి మెల్లిగా మారుతున్నాడు. అంటే రాబోయే రోజుల్లో ప్రస్తుతమున్న స్థితికన్నా లిపికున్న ప్రాముఖ్యత కొంచెం తగ్గి, మౌఖిక భాషకు తిరిగి ప్రాముఖ్యత పెరుగుతుంది. కాలంలో మరికొంత ముందుకు వెళితే భవిష్యత్తులో వీడియో సంభాషణల ద్వారా సైగల భాషలకు కూడా ప్రాముఖ్యత పెరుగుతుంది. మన భావాలకు సరిపోయే సైగలను మన మన భాషల్లో మెల్లిగా చేర్చుకుంటాం.

అందువలన లిపి కేవలం భాషను ప్రసరించే ఒక మాధ్యమమే అని గుర్తిద్దాం. భాషను ప్రసరించేందుకున్న వివిధ కొత్త మార్గాల్లో కూడా తెలుగుకు ముందుగానే వనరులు తయారు చేసుకుందాం.

భాష నిర్వచనం భావప్రకటనకు వాడే ఒక పద్ధతి అని అనుకుంటే, మాట్లాడబడే ప్రతి నుడిని మనం భాషగా గుర్తించాలి. ఇందులో లిపి ఉన్న భాషలూ ఉంటాయి, లిపిలేని భాషలూ ఉంటాయి. కొన్ని చిహ్నాల(అక్షరాల) ద్వారా ఒక భాషను లేదా పలు భాషలను రాసే పద్ధతిని లిపి నిర్వచనం అని అనుకుందాం.

మన దేశంలో లిపి పరిణామక్రమం చాలా ఆసక్తికరమైంది. బొమ్మల ద్వారా, గీతల ద్వారా ఆదిమానవుడు రాసుకున్న బొమ్మలను(లిపిని) మనం కర్నూలు జిల్లా సంజమల, కునుకుంట్ల, రాచర్ల, కేతవరంలలో, కడప జిల్లా రాణీబావి, చింతకుంటలలో చూడవచ్చు. ఇలాంటి ఆదిమానవులు చిత్రించిన బొమ్మలు తమిళనాడులోనో, పాశ్చాత్య దేశాల్లోనో బయలుపడితే ఆ వార్త విశ్వవ్యాప్తంగా మారుమోగేది, ఆ ప్రాంతాలను కీళడి లాగా పర్యాటకంగా మార్చి వేలల్లో ప్రజలు దర్శించుకునే వారు. అవి ఆంధ్రప్రదేశ్‌లో బయటపడ్డాయి కనుక ఎవరమూ పట్టించుకోము.

సింధులోయ నాగరికత లిపిని భారతదేశంలో దొరికిన లిపి పద్ధతిలో మొదటిదిగా చెబుతారు. ఆ సింధులోయ నాగరికత కాలానికి అటూ ఇటుగా తుంగభద్ర-కృష్ణ లోయలో కూడా ఒక లిపి దొరికింది, అది కూడా ఎలాంటి వార్తా లేకుండా మాయమైపోయింది. మన దేశంలో ఇప్పటి వరకూ దొరికిన అతి ప్రాచీన లిపి కుండ పెంకులపై ఉన్న కొన్ని గుర్తులు. ఇవి సింధులోయ నాగరికతలోని అక్షరాలను పోలిఉన్నాయి కనుక సింధులోయ నాగరికత లిపి తొలిలిపి అనుకోవచ్చు. హరప్పాలో దొరికిన లిపిలో ఐదు చిహ్నాలు మాత్రమే కనిపిస్తాయి. ఇవి ఒక లిపికి సంబంధించినవా కాదా అన్నది ఋజువు కాలేదు. గుజరాత్‌లోని ధోలవీరలో దొరికిన నామఫలకాల లాంటి వాటిపై 24 నుంచి 34 చిహ్నాలున్నాయి. ఈ చిహ్నాలలో చాలా వరకూ బొమ్మలే కానీ కొన్ని అర్థం కాని గుర్తులూ ఉన్నాయి. సింధులోయ నాగరికత నాటి ఈ లిపిని ఇంకా మనం పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాము. కానీ ఈ లిపిని కుడి నుంచి ఎడమకు రాసేవాళ్ళని తెలుస్తోంది(ఎడమవైపుకు అక్షరాలను కుచించి రాసిన విధానాన్ని బట్టి ఇది నిర్ధారించవచ్చు.) మొత్తం కలిపి ఈ లిపిలో 400 గుర్తులను కనుగొన్నారు. మరి ఈ లిపిలో ప్రస్తుత భారత భాషల్లాగా(నోటి ద్వారా చేసే చప్పుడుకొక అక్షరం/గుర్తు) శబ్దానుసార

లిపియా లేక పదానుసార(చైనాలిపిలో లాగా పదానుసార లిపులలో ఒక అక్షరం శబ్దాన్ని కాక, మొత్తం పదాన్ని సూచిస్తుంది) లిపియా అన్నది ఇంకా తెలియలేదు.

కొందరు భాషావేత్తలు సింధులోయలో దొరికిన లిపి భాషా సంబంధ లిపి కాదని, ఆ గుర్తులు కుంటుంబాలను, తెగలను, దేవుళ్ళను, లేదా మత సంబంధ విషయాలను సూచిస్తాయని, ఈరోజుల్లో ఉత్సవాలలో కనిపించే ప్రభలకు ఆ గుర్తులు సూచకాలని అభిప్రాయపడుతున్నారు. ఇలా అనుకోవటానికి ముఖ్య కారణం సింధులోయ లిపిలో కనిపించే అక్షరాలు పునరావృతం కాలేదు. మరీ ఎక్కువ చిహ్నాలున్నాయి.

కానీ మరికొందరు భాషావేత్తల ప్రకారం సింధులోయ లిపి బ్రాహ్మీ లిపికి గానీ, ద్రావిడలిపికి గానీ మాతృక లిపి అయి ఉండవచ్చు. ఐరావతం మహదేవన్ సింధులిపి ద్రావిడ భాషలకు మూలమని, సింధులోయ వాసులు ద్రావిడులని వాదించారు.

సింధులోయ లిపి మరికొందరు భాషావేత్తల ప్రకారం కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి రెండు విధాలా రాయబడేదని, అందుకని ఇది సర్వలేఖన పద్ధతిలో రెండు వైపులా రాయబడే లిపి అని.

బ్రాహ్మీ లిపి: నేటి ఆధునిక హిందీ, తెలుగు, తమిళం, మొదలగు భారతీయ భాషలన్నిటికీ లిపి పరంగా మూలలిపి బ్రాహ్మీ. ఈ బ్రాహ్మీ లిపి కాలక్రమంలో ఉత్తర భారతంలో ఎక్కువ గీతలతో, దక్షిణ భారతంలో ఎక్కువ గుండ్రంగా అభివృద్ధి చెందింది. 1838 లో జేమ్స్ ప్రిన్సెప్ ఈ లిపిని విశదీకరించాడు. అశోకుని ధర్మశాసనాలు బ్రాహ్మీ లిపిలోనే ఉన్నాయి. బ్రాహ్మీ లిపికి అరామిక్‌లిపి మూలాలున్నాయని కొందరు భాషావేత్తలంటే, ఇంతకు ముందు చెప్పుకున్నట్టు సింధులోయ లిపి బ్రాహ్మీలిపికి మాతృక అని కొందరి అభిప్రాయం. బ్రాహ్మీలిపి అక్షరాధారిత లిపి, ఈ లిపిలోని అక్షరాలు జతపడి భాషలోని చప్పుళ్ళను సూచిస్తాయి. ఈ లిపిని మొదట్లో ప్రాకృత భాషను రాసేందుకు, ఆపై సంస్కృత భాషను రాసేందుకు వాడారని తెలుస్తోంది. పురాశాసనవేత్తల ప్రకారం బ్రాహ్మీ లిపి ఉత్తర భారత-దక్షిణ భారత లిపుల కుటుంబాలకు అనువుగా రెండుగా చీలి అభివృద్ధి చెందింది.

ఖరోష్ఠి లిపి : ఇది బ్రాహ్మీ లిపికి సమకాలీన లిపి. ఈ లిపిని కుడి నుంచి ఎడమకు రాసేవారు. ప్రస్తుత అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల్లో లభించే శాసనాల్లో ఈ లిపి కనపడుతుంది. ఈ లిపిని గాంధారిలిపి అని కూడా అంటారు.

గుప్త లిపి : ఈ లిపినే అనంతర బ్రాహ్మీ లిపి అని, గుప్తబ్రాహ్మీ అని కూడా అంటారు. ఈ లిపిని గుప్త రాజుల కాలంలో సంస్కృత భాషను రాసేందుకు వాడేవారు. ఈ లిపి నుంచే నాగరి, శారద, సిద్ధమాతృక లిపులు అభివృద్ధి చెందాయి. ఈ లిపుల నుంచి నేటి దేవనాగరి, బెంగాలీ లిపులు వచ్చాయి.

నాగరి లిపి: గుప్త లిపికి తూర్పు రూపాంతరమే నాగర లిపి. ఇది ప్రస్తుత దేవనాగరికి మునుపటి రూపం. ఈ లిపిలో ప్రాకృతం, సంస్కృతం రెండు భాషలను రాసేవారు. ఈ లిపిని ఎడమ నుంచి కుడికి రాస్తారు. ఈ లిపిలో అక్షరాలు చతురస్రాకారాలుగా, గీతలుగా, వృత్తాలుగా ఉంటాయి. పైన ఒక గీతకు ఆధారంగా అక్షరాలుంటాయి. ఈ లిపి అట్టే చూస్తే బెంగాలీ, గురుముఖి, ఒడియా లిపులకు వేరుగా



ఉన్నా, క్షుణ్ణంగా పరిశీలిస్తే సామ్యత కనిపిస్తుంది.

శారద లిపి: శారద లేదా షారద లిపి బ్రాహ్మీ లిపి కుటుంబానికి చెందిన లిపి, 8వ శతాబ్దంలో అభివృద్ధి చెందింది. ఇది సంస్కృతం మరియు కాశ్మీరీ రాయడానికి ఉపయోగించబడింది. వాస్తవానికి మరింత విస్తృతంగా వ్యాపించింది, దీని ఉపయోగం తర్వాత కాశ్మీర్‌కు పరిమితం చేయబడింది. ఇది ఇప్పుడు కాశ్మీరీ పండిత కుటుంబాల్లో ఆచార వ్యవహారాల కోసం మినహా చాలా అరుదుగా ఉపయోగించబడుతుంది.

సిద్ధమాత్రికలిపి (కుటిల): ఈ లిపి 6వ శతాబ్దం (సామాన్య శకం) లో తూర్పు భారతదేశంలో ప్రముఖంగా ఉంది, ఇది గౌడి లిపిగా తరువాతి కాలంలో మారింది. ఈ తూర్పు నాగరి లిపి కొద్ది మార్పులతో బెంగాలీ, అస్సామీ లిపులకు వాడబడుతోంది.

లాండాలిపి : లాండలిపి (అంటే "తోకలేని లిపి") ఉత్తర భారతదేశంలోని లిపులను సూచించడానికి ఉపయోగించే పంజాబీపదం. లాండ అనేది 10వ శతాబ్దంలో శారదలిపి నుంచి అభివృద్ధి చెందిన లిపి. ఈ లిపిని పంజాబీ, హిందీ, సింధీ, సరైకి, బలూచి, కాశ్మీరీ, పష్తో మొ॥ భాషలను, వివిధ పంజాబీ మాండలికాలను వ్రాయడానికి ఉపయోగించారు.

గురుముఖిలిపి : గురుముఖి అనేది లాండాలిపి నుండి అభివృద్ధి చేయబడిన లిపి. 16వ శతాబ్దంలో సిక్కుమతపు రెండవ గురువైన గురు అంగద్ చేత ప్రమాణీకరించబడింది. గురు గ్రంథ్ సాహిబ్ మొత్తం ఈ లిపిలో రాయబడింది. ఇది పంజాబీ భాష రాయడానికి సిక్కులు మరియు హిందువులు ఎక్కువగా ఉపయోగించే లిపి.

మోడీలిపి : మోడీ మరాఠీ భాషను రాయడానికి ఉపయోగించే లిపి.

20వ శతాబ్దంలో దేవనాగరి లిపిలోని బల్బోధ్ శైలి మరాఠీకి ప్రామాణిక రచనా విధానంగా ప్రచారం చేయబడే వరకు మోడీ లిపిని అధికారిక లిపిగా మరాఠీని రాయడానికి ఉపయోగించారు.

గుజరాతీలిపి : గుజరాతీలిపి నాగరి లిపులలో ఒకటి. గుజరాతీ మరియు కచ్ఛీ భాషలను రాయడానికి ఉపయోగిస్తారు. ఇది దేవనాగరిలిపికి రూపాంతరం, అక్షరాల పైన ఉన్న గీతను తీసేసి, అక్షరాలలో చిన్న మార్పులు చేసి వేరు చేయబడింది. గుజరాతీలిపిని సంస్కృతం మరియు హిందీని రాయడానికి కూడా ఉపయోగిస్తారు.

గ్రంథలిపి : ఇది బ్రాహ్మీ నుండి ఉద్భవించిన తొలి దక్షిణాది లిపులలో ఒకటి. ఇది తమిళం మరియు మలయాళ లిపులలోకి విడిపోయింది, అవి ఇప్పటికీ ఆ భాషలను రాయడానికి ఉపయోగించబడుతున్నాయి. ఇది శ్రీలంకలో ఉపయోగించే సింహళ లిపికి పూర్వరూపం కూడా. పల్లవలిపి అనే గ్రంథలిపి యొక్క రూపాంతరం ఇండోనేషియాలోని భారతీయ వ్యాపారులచే వాడబడింది, ఇది అనేక ఆగ్నేయాసియా లిపుల అభివృద్ధికి దారితీసింది. ఇది తమిళనాడులో సంస్కృత గ్రంథాలను వ్రాయడానికి ఉపయోగించబడింది కాబట్టి దీనికి గ్రంథ లిపి అని పేరు పెట్టారు. ఆరవ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం మధ్య కాలంలో దక్షిణ భారతదేశంలోని తమిళం మాట్లాడేవారు వారి సాహిత్యాన్ని ఈ లిపిలో రాసుకునేవారు. ప్రత్యేకించి తమిళనాడులో, కేరళలో సంస్కృతాన్ని రాయడానికి గ్రంథ లిపిని విస్తృతంగా ఉపయోగించారు. తమిళనాట సాంప్రదాయ వేద పాఠశాలల్లో ఇప్పటికీ పరిమిత ఉపయోగంలో గ్రంథ లిపి ఉనికిలో ఉంది. ఇది తమిళనాడులోని బ్రాహ్మీ లిపి నుండి ఉద్భవించిన బ్రాహ్మీ కుటుంబ లిపి. మలయాళ లిపి గ్రంథ లిపి నుండి ప్రత్యక్షంగా అభివృద్ధి చెందింది.

వట్టెళుత్తులిపి : ఈ లిపి బ్రాహ్మీ నుండి తీసుకోబడిన లిపి. భారతదేశపు దక్షిణ భాగంలో ఉపయోగించబడింది. ఇది తమిళం మరియు మలయాళం వ్రాయడానికి ఉపయోగించబడింది. దక్షిణాది భాషలను రాయడానికి అవసరం లేని బ్రాహ్మీ నుండి ఆ సంకేతాలను తొలగించింది. ప్రస్తుతం, తమిళం మరియు మలయాళం భాషలు రెండూ గ్రంథ లిపి నుంచి వచ్చిన లిపులకు మారాయి. ప్రాచీన గ్రంథ లేదా పల్లవ వర్ణమాల మరియు తమిళ లిపితో పాటుగా ప్రోటో-తమిళ భాషను వ్రాయడానికి తమిళ ప్రజలు అభివృద్ధి చేసిన మూడు ప్రధాన వర్ణమాల వ్యవస్థలలో వట్టెళుత్తు ఒకటి. వట్టము అనగా గుండ్రము అని అర్థము, ఎళుత్తు అనగా అక్షరం. గుండ్రంగా ఉండే అక్షరాలే వట్టెళుత్తులు.

కదంబలిపి: ఈ లిపి బ్రాహ్మీ వంశానికి చెందినది. ఈ లిపి నుండి ప్రస్తుత కన్నడలిపి పుట్టింది. ఇది ఆధునిక కన్నడ, తెలుగులిపుల అభివృద్ధికి దారితీసింది. ఈ లిపితో సంస్కృతం, కొంకణి, కన్నడ, మరాఠీ భాషలను రాసేవారు. 4-6 శతాబ్దాలలో కదంబ రాజవంశం పాలనలో కదంబలిపి అభివృద్ధి చేయబడింది. కదంబలిపిని పూర్వ-పాత-కన్నడ లిపి అని కూడా అంటారు. ఈ లిపి తరువాత నేటి గోవా రాష్ట్రంలో ప్రజాదరణ పొందింది. సంస్కృతం, కన్నడ, కొంకణి మరియు మరాఠీలను రాయడానికి ఉపయోగించబడింది.

తమిళలిపి : ఈ లిపి భారతదేశంలో, శ్రీలంకలో, సింగపూర్ లో తమిళ భాషను రాయడానికి ఉపయోగించే లిపి. ఇది బ్రాహ్మీ లిపికి ఉన్న దక్షిణ రూపమైన గ్రంథ లిపి నుండి వచ్చింది. ఎడమ నుండి కుడికి రాస్తారు.

కన్నడలిపి : కర్నాటక రాష్ట్రంలో కన్నడ భాషకే కాక సంస్కృత గ్రంథాలను రాయడానికి కూడా కన్నడలిపిని విస్తృతంగా ఉపయోగిస్తారు. తుళు, కొంకణి, కొడవ, సంకేతి మరియు బ్యారీ వంటి అనేక చిన్న భాషలు కూడా కన్నడలిపి ఆధారంగా రాస్తారు. కన్నడ, తెలుగులిపులు చాలా పోలిక కలిగి ఉంటాయి. తరచుగా ఒకే లిపి యొక్క ప్రాంతీయ రూపాంతరాలుగా పరిగణించబడతాయి.

తెలుగులిపి : మౌర్య రాజులు ఉపయోగించిన బ్రాహ్మీలిపి చివరికి కృష్ణా నది డెల్టాకు చేరుకుని, బుద్ధ భగవానుడి అవశేషాలను కలిగి ఉన్న ఒక ధాతుపేటికపై కనుగొనబడిన భట్టిప్రోలులిపికి దారితీసింది. భట్టిప్రోలు బ్రాహ్మీలిపి 5వ శతాబ్దం నాటికి తెలుగు లిపిగా పరిణామం చెందింది.

మలయాళలిపి : మలయాళ లిపిని కైరళీ లిపి అని కూడా పిలుస్తారు. ఇది కేరళలో మాట్లాడే ప్రధాన భాష మలయాళాన్ని రాయడానికి సాధారణంగా ఉపయోగించే బ్రాహ్మీ కుటుంబపు లిపి. కేరళలో సంస్కృత గ్రంథాలను రాయడానికి కూడా మలయాళ లిపి విస్తృతంగా ఉపయోగించబడుతుంది.

ఉర్దూలిపి : ఉర్దూలిపి ఉర్దూ భాష కోసం ఉపయోగించే కుడి-నుండి-ఎడమకు రాసేలిపి. ఇది పర్షియన్‌లిపికి రూపాంతరం. ఈ లిపి మరొక విధంగా అరబిక్‌లిపి నుండి వచ్చిందని అనుకోవచ్చు. ప్రామాణిక ఉర్దూలిపి పర్సో-అరబిక్ లిపికి సవరించిన సంస్కరణ. 13వ శతాబ్దపు ఇరాన్‌లో ఈ లిపికి మూలాలున్నాయి. ఈ లిపికి, ఇరాన్‌లో వాడే పర్సోలిపికి నశ్తలీఖ్‌లిపి అని కూడా పేరుంది. ఉర్దూలిపినే కాస్త మార్పులు చేసి షాముఖిలిపి అని పిలుస్తారు. ఈ షాముఖిలిపిని పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రాంతంలో మాట్లాడే పంజాబీ, సరైకి భాషలను రాసేందుకు వాడతారు.

సంతాలిలిపి: సంతాలి అనేది ఆస్ట్రోఏషియాటిక్ భాషల ముండా ఉపకుటుంబంలోని ఒక భాష, ఇది హో మరియు ముండారికి సంబంధించినది. పంతొమ్మిదవ శతాబ్దం వరకు సంతాలి మౌఖిక భాషగా ఉంది. ఆ తరువాత ఇంగ్లిష్‌కు వాడే రోమన్ లిపిని చాలా యేళ్ళు వాడారు. గత యాభై ఏళ్ళలో సంతాలీ భాషకు ఓల్-చికి అనే లిపిని కనిపెట్టి వాడుకలోకి తెచ్చారు.

ఇది ప్రస్తుతం, పురాతన కాలంలో మన దేశంలో భాషలను రాయడానికి వాడిన లిపుల కథ. అర్థమయ్యేది ఏమిటంటే లిపి అవసరం మతపరమైన విషయాలకు, రాచరికపు శాసనాలు, మొదలగు విషయాలకు పరిమితమైన అంశంగానే పెరిగింది. సామాన్య ప్రజ మాట్లాడే భాషలోని అన్ని శబ్దాలకు ఈ లిపులలో అక్షరాలు ఉండకపోవచ్చు.

తెలుగు సంగతీ అంతే. మనం రోజూ పలికే చాలా మాటలకు తెలుగులో అక్షరాలు లేవు. క్రియలను సూచించే చాలా పదాలకు ఈ ఇబ్బంది ఉంది. చేసాడు లేదా చేశాడు అని రాస్తామే కానీ పలికేటప్పుడు అది చేశేడు/చేసేడు కి చేశాడు/చేసాడు కి మధ్యస్థంగా ఉండే ఒక శబ్దం. ఆ శబ్దానికి మన భాషలో అక్షరం లేదు. ప్రపంచీకరణలో మన తెలుగులోకి ఎన్నో కొత్త పదాలు వచ్చి చేరుతున్నాయి. అవి మన భాషలో అంతర్భాగమవుతున్నాయి. ఇంగ్లిష్‌లో ఇజ్ అని ఎక్కువ వాడుక. ఈ శబ్దం ఇటు స కాదు, అటు జ కాదు. ఇలా పరాయి మాటలు

మనవయ్యాక, ఆ మాటలను సూచించే అక్షరాల అవసరమూ మనకు కలుగుతుంది.

ప్రపంచవ్యాప్తంగా రోమన్ ఆధారిత ఫోనెటిక్ లిపిలో మనిషి చేయగల అన్ని శబ్దాలను పరిగణించి, ప్రతి శబ్దానికి అక్షరం ఉండేలా ఆ ఫోనెటిక్ లిపిని రూపొందించారు.

సహజంగా మనకు అబ్బనిలిపి ప్రస్తుతం మనం వాడుతున్న తెలుగులిపి. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి వలన ప్రస్తుతం ఒక లిపిని మరొక లిపికి లిప్యంతరణ చేయటం చాలా సులభం. అందువలన పెద్ద ఇబ్బందితో తెలుగు లిపినైనా లేదా వేరే ఏ ప్రపంచ లిపినైనా అర్థం చేసుకునేందుకు ఒక అంతరవర్తిని(ఇంటర్ఫేస్/దుబాసీ)గా ఫోనెటిక్ లిపిని వాడితే సరిపోతుంది.

ఇంగ్లిష్ వారు స్పెల్లింగులతో తికమక పడకుండా ఉచ్చారణ నేర్పే సమయంలో ఈ ఫోనెటిక్ లిపినే వాడతారు.



తెలుగులిపి తెలియకపోయినా, తెలుగు మాట్లాడటం, విని అర్థం చేసుకోవటం – ఈ రెండు నైపుణ్యాలను మనం మన ప్రస్తుత, రాబోయే తరాలకు నేర్పుకుంటే కంప్యూటర్ ఆధారిత సేవల ద్వారా వారు ఇంగ్లిష్(రోమన్)లిపి ద్వారానే తెలుగులో చక్కగా రాసుకుని చదువుకోగలరు. తెలుగులో లిప్యంతరణ ద్వారా ఇబ్బంది లేకుండా తమ చెప్పాలనుకున్నది తెలుగులిపిలో రాసి ఇవ్వగలరు.



వీవెన్ గారు రూపొందించిన లేఖిని(lekhini.org) తరచుగా తెలుగు వారందరూ వాడతారు. లేఖినిలో ఎడమ వైపు పెట్టెలో ఇంగ్లిష్ స్పెల్లింగులతో తెలుగు భాషలో పదాలను చొప్పిస్తే, కుడి వైపున అవి తెలుగు లిపిలోకి మారి కనిపిస్తాయి.

ఇదే లేఖినికి జతగా నిఖిలే కూడా ఉంది. లేఖిని చేసే పనికి విపరీతంగా అంటే తెలుగులో ఇచ్చిన పాఠ్యాన్ని రోమన్ లో పాఠ్యంగా లిప్యంతరణ చేసి ఇస్తుంది.

ఇంతకూ భాషకూ లిపికి ఉన్న బంధం ఏమిటి? మరికొన్ని అంశాలు వచ్చే సంచికలో...

మన లిపి పుట్టు పూర్వోత్తరాలు పుస్తకంలో ఆచార్య తిరుమల రామచంద్ర గారు ఒక చిన్న పరిచ్ఛేదంలో లిపుల జాబితా ఒకటి ఇచ్చారు. ఆ జాబితా చూద్దాం...

“బుద్ధుడు పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రి శుద్ధోదనుడు ఆయనను బడికి పంపాడు. బుద్ధుడు లిపిశాలకు – బడికి – వెళ్ళాడు పలక, బలపం తీసుకుని. మామూలు పలకకాదు, ఉరగసార చందన మయమైన లిపి ఫలకం. మామూలు బలపం కాదు, మణిరత్న ప్రత్యుప్తమైన దివ్య సువర్ణతిరకం. ఆచార్యుడైన విశ్వామిత్రుడు అక్షరాలు దిద్దుకోమన్నాడట. “ఏ లిపిని నాకు చెప్పదలచారు? బ్రాహ్మి, ఖరోష్ఠి, పుష్కరసారి, అంగలిపి, వంగలిపి, మగధలిపి, మంగల్యలిపి, అంగులీయలిపి, సకారిలిపి, బ్రహ్మవలిలిపి, పారుష్యలిపి, ద్రావిడలిపి, కిరాతలిపి, దాక్షిణ్యలిపి, ఉగ్రలిపి, సంఖ్యాలిపి, అనులోమలిపి, అవమూర్ధలిపి, దరదలిపి, భాష్యలిపి, చీనలిపి, లూనలిపి, హూనలిపి, మధ్యాక్షర విస్తర లిపి, పుష్పలిపి, దేవలిపి, నాగలిపి, యక్షలిపి, గంధర్వలిపి, కిన్నరలిపి, మహోరగలిపి, అసురలిపి, గరుడలిపి, మృగచక్రలిపి, వాయసరుతలిపి, భౌమదేవలిపి, అంతరిక్షదేవలిపి, ఉత్తరకురుద్వీపలిపి, అపరగోదానీలిపి, పూర్వవిదేహలిపి, ఉత్క్షేపలిపి, నిక్షేపలిపి, విక్షేపలిపి, ప్రక్షేపలిపి, సాగరలిపి, వజ్రలిపి, లేఖప్రతిలేఖలిపి, అనుద్రుతలిపి, శాస్త్రావర్తలిపి, గణనావర్తలిపి, ఉత్క్షేపావర్తలిపి, నిక్షేపావర్తలిపి, పాదలిఖితలిపి, ద్విరుత్తర పదసంధిలిపి, యావద్దశోత్తరపద సంధిలిపి, మధ్యాహారిణలిపి, సర్వరుత సంగ్రహిణీలిపి, విద్యానులోమావిమిశ్రితలిపి, ఋషి తపస్తప్తలిపి, రోచమానలిపి, ధరణీప్రేక్షిణీలిపి, గగనప్రేక్షిణీలిపి, సర్వౌషధి నిష్యందలిపి, సర్వసార సంగ్రహణీలిపి, సర్వభూతరుత గ్రహణీలిపి : ఈ అరవై నాలిగింటిలోను, ఉపాధ్యాయులవారూ, ఏ లిపిని నేర్పదలచారండీ?” అని బుద్ధుడు ఆచార్య విశ్వామిత్రుని ప్రశ్నించాడట.”

కొట్టు శేఖర్
80153 92816

ఒరిస్సా రాష్ట్ర ఆవిర్భావం-తెలుగువారి ప్రతిస్పందన: ఒక విశ్లేషణ

ఆధునిక భారత చరిత్రలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం ఒక ముఖ్య ప్రకరణం. ప్రప్రథమ భాషా ప్రయుక్త రాష్ట్రమైన ఒరిస్సా ఆవిర్భావానికి (1936) సంబంధించి పలు రకాల అభిప్రాయాలు, అపోహలు నేటికీ అప్పుడప్పుడు వ్యక్తమవుతూ ఉంటాయి. వాటిలో తెలుగు నాయకుల కార్యశూన్యత వల్లనే గంజాం, వైజాగ్ పటమ్ (విశాఖపట్నం) జిల్లాలో విశాలమైన భూభాగాన్ని మనం కోల్పోయామన్న అభిప్రాయం సత్యదూరమూ, వివాదాస్పమైనది. ఈ వ్యాసం ఒరిస్సా రాష్ట్ర ఆవిర్భావం, తెలుగు వారి ప్రతిస్పందనను చర్చిస్తుంది.

1936కు పూర్వం నేటి ఒడిశా రాష్ట్రంలో ఉత్తర, పశ్చిమ, మధ్య జిల్లాలతో కలిపి బిహార్ – ఒరిస్సా సంయుక్త రాష్ట్రంగా (ఒకే గవర్నర్ పాలనలో) 1912 నుండి కొనసాగుతూ వచ్చింది. దక్షిణ ప్రాంతమైన అవిభక్త గంజాం, అవిభక్త కోరాపుట్ జిల్లాలు (1992 వరకు) మద్రాస్ రాష్ట్రంలో భాగమై ఉండేవి. నేడు ఒడిశాలో నున్న జయపూర్, కోరాపుట్, మల్కన్గిరి, నౌరంగపూర్, పొట్టంగి, రాయగడ, బిసంకటక్, గుణుపూర్, పాడువా తాలూకాలు నాటి విశాఖ జిల్లాలో ఏజెన్సీ (మన్యం) ప్రాంత తాలూకాలుగా పరిగణించబడేవి. అదే విధం గా నేడు ఆంధ్ర ప్రదేశ్ లో నున్న సోంపేట, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, టెక్కలి అప్పటి గంజాం లో మైదాన ప్రాంత తాలూకాలు. ఆ రెండు జిల్లాల్లో మన్యం మరియు మైదాన ప్రాంత తాలూకాల వివరాలు – గంజాం (మన్యం- 5 + మైదాన ప్రాంత -11 = 16) , విశాఖ (మన్యం -16 + మైదాన -14 = 26). రెండు జిల్లాల్లో తాలూకాల సంఖ్య 46 .

ఒరియా మాట్లాడే ప్రాంతాలన్నీ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలన్న డిమాండ్ పంతొమ్మిదవ శతాబ్దం చివరి నుండీ వినిపించేది. ఉత్కళ జాతీయత పితామహుడు, ప్రముఖ కవి ఫకీర్ మోహన్ సేనాపతి నుండి ప్రఖ్యాత న్యాయవాది మధుసూదన్ దాస్ వరకు, కల్లికోట్ జమీందార్ నుండి ఉత్కళ మణి గోపబంధు దాస్ వరకు, కవులు, సంఘ సేవకులు, సంస్కర్తలు, జాతీయ ఉద్యమకారులు, పాత్రికేయులు, సుమారు ఏభై ఏళ్ల పాటు ఐకమత్యంతో శ్రమించి, తమ వెనుకబాటుకు పరాయి భాషల (హిందీ, బెంగాలీ, తెలుగు) ఆధిపత్యమే కారణమని, ఉజ్జ్వలమైన చరిత్ర గల తాము ఇంకెన్నాళ్లో ద్వితీయ శ్రేణి పౌరులుగా మనలేమని, ప్రత్యేక రాష్ట్రం చారిత్రక అవసరమని గణాంకాలతో సహా నిరూపించి తమ కోరిక పట్ల సానుకూలతను సృష్టించుకోగలిగారు. నాటి తెలుగు నాయకులు ఒరియా వారి డిమాండ్ పై దృష్టి పెట్టలేదని విమర్శ ఉన్నది. ఆ విమర్శ సహేతుకమైనది కాదు.

నాటి తెలుగు నాయకులు జాతీయోద్యమ, జస్టిస్ పార్టీ, ఉపప్రాంత శిబిరాలుగా చీలిపోయి ఉండేవారు. అయినప్పటికీ 1903 లో మద్రాసు లో జరిగిన పంతొమ్మిదవ భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో ఆరుగురితో ఏర్పాటైన బెంగాల్ ప్రాంత పునర్వ్యవస్థీకరణ సంఘం లో తెలుగు సభ్యులైన జీ రాఘవరావు ప్రత్యేక ఒరిస్సా రాష్ట్రం అవసరం లేదని, అది గంజాం, విశాఖ జిల్లాల్లో లో తెలుగు వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని వాదించారు. వారిని ఇతర తెలుగు సభ్యులైన ఏ సి పార్థసారథి నాయుడు, న్యాయపతి సుబ్బారావు పంతులు సమర్ధించగా తమిళుడైన వీ కృష్ణ స్వామి అయ్యర్ ఒరియా వారి కోరికను తీసి పారెయ్యలేమని అన్నారు. ఒరియా వారి డిమాండ్ ను తెలుగు ప్రముఖులు వ్యతిరేకించడానికి శాస్త్రీయమైన ప్రాతిపదిక లేదు. అప్పటికి తెలుగు రాష్ట్రం లేదు. కానీ ఒరిస్సా రాష్ట్రం ఎదో ఒక రూపంలో ఉపఖండపు చిత్రపటంలో చోటు చేసుకుంది. ఒరియా వారు కోరింది గంజాం మరియు విశాఖ జిల్లాలో ఒరియా ప్రాంతాలను మాత్రమే. నాడు మద్రాసు రాష్ట్రాన్ని ఏలుతున్న జస్టిస్ పార్టీ అజెండాలో ప్రతిపాదిత ఒరిస్సా రాష్ట్రంలో గంజాం జిల్లా, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల విలీనం ఏనాడూ కానరాలేదు. మద్రాసుకు ఐదుగురు తెలుగు వారు /తెలుగు మూలాలు కలిగిన వారు ముఖ్య మంత్రులుగా పనిచేసినా వారెన్నడూ ఈ మూలనున్న ప్రాంతాల గురించి పట్టించుకోలేదు. వారిలో బొబ్బిలి సంస్థానాధీశుడు రంగ రావు వైజాగ్ పటం జిల్లాకు చెందినవారైనా జస్టిస్ పార్టీ వ్యవహారాలూ, బ్రాహ్మణాధిపత్యాన్ని కట్టడి చేసే కార్యక్రమాలపై దృష్టి సారించారు తప్ప ఒరిస్సా రాష్ట్ర ఏర్పాటు పట్ల ఏమాత్రం ఆసక్తి చూపలేదు.

అప్పటికీ ఇచ్ఛాపురం లో రాబోయే ఒరియా రాష్ట్రంలో గంజాం జిల్లా విలీనాన్ని వ్యతిరేకిస్తూ పీ వెంకటరామయ్య అనే తెలుగు ప్రముఖుడు బృందావన్ పాత్రో అనబడే ఒరియా ప్రముఖునితో కలసి ఉద్యమించారు. అలాగే గంజాం లో మైదాన ప్రాంత తాలూకాలైన ఘుమసూర్ , బగుడలలో విలీన వ్యతిరేకులు (ఒరియా వారు కూడా) రోడ్డెక్కారు. 1924 లో బరంపురంలో సీత రామ విలాస్ హాలులో జరిగిన విలీన వ్యతిరేక సభలో మద్రాసు న్యాయవాది , 1913 లో బాపట్లలో జరిగిన ఆంధ్ర మహా సభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి తీర్మానం ప్రవేశపెట్టిన వేమవరపు రామదాసు పంతులు ప్రసంగించారు. పట్టాభి సీతారామయ్య 'జన్మభూమి' పత్రికలో రాబోయే ఒరిస్సాలో గంజాం, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల విలీన ప్రతిపాదనను వ్యతిరేకించారు. విలీన వ్యతిరేకోద్యమానికి తొలి రోజుల్లో విజయనగరం బొబ్బిలి జమీందార్లు కొంత ఆర్థిక సహాయమందించి తరువాత కాలంలో నిలిపి వేశారు. గిడుగు రామ్మూర్తి పంతులు పర్లాకిమిడి పైనే కేంద్రీకరించి గంజాం విలీనాన్ని ఆపాలని ప్రయత్నించారు. 1924 లో విజయనగరం లో సూర్య నారాయణ్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన విలీన మద్దతు సభ ఒరియాకు ద్రావిడ భాషలకు ఏ మాత్రం

పొంతన లేదని ప్రకటించింది. ఈ నిజాన్ని సెన్సస్ నివేదికలు కూడా అంగీకరించాయి. ఒరియా నాయకుల పట్టుదల, వారి వెనుకబాటుతనం దృష్ట్యా వారి కోరికలో మహాత్మా గాంధీకి సైతం కొంత న్యాయం గోచరించింది.

1928 లో రాజేంద్ర నారాయణ్ భంజ్ దేవ్ , లక్ష్మీధర మహంతిలు సైమన్ కమిషన్ కు కలకత్తా లో ఘన స్వాగతం పలికి తమ డిమాండ్ ను ఆధారాలతో విశదీకరించారు. అప్పుడే అతి పెద్ద సంస్థానాల్లో ఒకటైన జయపూర్ పాలకుడు విక్రమ్ దేవ్ వర్మ, టెక్కలి జమీందార్లు ఒరియా రాష్ట్రం వైపే మొగ్గు చూపారు. ఒరిస్సాలో గంజాం జిల్లాను విలీనం చేయడంలో పర్లాకిమిడి జమీందార్ కృష్ణ చంద్ర గజపతి పాత్ర వెల కట్టలేనిది. ఆయన 1931లో ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశం లో పాల్గొని ప్రత్యేక ఒరిస్సా గళాన్ని వినిపించారు. అదే ఏడాది ప్రభుత్వం ప్రతిపాదిత ఒరిస్సా రాష్ట్రంలో ఒరియా మాట్లాడే ప్రాంతాల విలీనం యొక్క సాధ్యా సాధ్యాలను బేరీజు వేయడానికి ఒరిస్సా బౌండరీ కమిటీని నియమించింది. ఈ కమిటీకి నిష్పక్షపాత నివేదికను ఇవ్వడానికి 1931 మద్రాస్ జనాభా లెక్కల సేకరణలో నాటి మద్రాస్ సెన్సస్ ఆపరేషన్స్ సూపరింటెండెంట్ అయినా ఎమ్. డబ్లయూ. ఎమ్ . ఈట్స్ (ఐ. సి. ఎస్) ఎంతో శ్రమించాల్సి వచ్చింది. 1901 నుండి జరుగుతున్న జనాభా వివరాల సేకరణలో ఒరియా ఎన్యూమరేటర్ల నిర్వాకంపై పై విమర్శలు వెల్లువెత్తుతూనే వున్నాయి. జయపూర్ తాలూకాలో ఎక్కువ జనాభా కలిగిన దేశీయ తెగ భాషను ఒరియా యొక్క మాండలికం గా చూపించారు. అలాగే ఇతర ఆదివాసీ భాషలైన సవర, ధ్రువ, పొరజ లను ఒరియాకు దగ్గరగా ఉన్న భాషలుగానే సెన్సస్ లో చేర్చారు. ఈ వివాదాలను అధిగమించడానికి ఈట్స్ ఆర్. సి. ఎస్. బెల్ అనే ఆంగ్ల ఐ. సి. ఎస్ అధికారికి గంజాం జిల్లా గణాంకాలకు బాధ్యుడ్ని చేసి హైద్రాబాద్ కు చెందిన ఖాన్ సాహిబ్ మొహిద్దీన్ (డిప్యూటీ కలెక్టర్)కు బరంపురం కార్యాలయ బాధ్యతను అప్పగించారు. జనాభా లెక్కల సేకరణ నిష్పక్షపాతం గా జరగడం వలన 1901 లో గంజాంలో 75 శాతం ఉన్న ఒరియా జనాభా 1931 కల్లా 53 శాతానికి పడిపోవడం గమనార్హం.

1931 జనాభా లెక్కల ఆధారంగా గంజాంలో మన్య ప్రాంత ఐదింట ఐదు తాలూకాలను, మైదాన ప్రాంత పదకొండు తాలూకాలో ఏడింటిని, వైజాగ్ పటం జిల్లాలో పదహారు మన్య ప్రాంత తాలూకాల్లో తొమ్మిదింటిని బౌండరీ కమిటీ ఒరిస్సాలో విలీనం చేయగా 1936 ఏప్రిల్ ఒకటవ తేదీన ఒరిస్సా రాష్ట్రం ఆవిర్భవించింది. విశాఖ జిల్లాలో నున్న పద్నాలుగు మైదాన ప్రాంత తాలూకాలను మద్రాసు రాష్ట్రంలోనే ఉంచారు. గంజాం విశాఖ జిల్లాలోనున్న 46 తాలూకాలో 21 తాలూకాలు ఒరిస్సాలో విలీనం కాగా 25 తాలూకాలు మద్రాసు రాష్ట్రంలోనే కొనసాగాయి. అక్కడక్కడా హెచ్చుతగ్గులున్నా తెలుగు ఒరియా జనాభా నిష్పత్తిని సెన్సస్ ఖచ్చితంగానే తేల్చి చెప్పింది. ఒరియా వారికి దక్కిన గంజాం మద్రాసు లో కొనసాగి అటు తరువాత ఆంధ్రాలో ఉన్నా తెలుగు వారికి ఒరిగేది ఏమీ ఉండేది కాదు. ఎలాగూ సరిహద్దుల్లోనున్న ముఖ్య పట్టణాలైన సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, శ్రీకాకుళం, సోంపేట, టెక్కలి, ఇచ్ఛాపురం , శృంగవరపుకోట చివరకు ఆంధ్ర కే చెందాయి. ఒక వేళ వారేదైనా కోల్పోయి ఉంటే అవి అపారమైన వనరులు కల విశాఖ ఏజెన్సీ ప్రాంత తాలూకాలైన జయపూర్,కోరాపుట్, రాయగడ, బిసంకటక్, నౌరంగపూర్, మల్కన్గిరి, గుణుపూర్, పొట్టంగి మొదలైనవి. ఒరిస్సా రాష్ట్ర ఏర్పాటు విషయమై తెలుగు నాయకులు అప్రమత్తతతో మెలగలేదనేది ఎంత సత్య దూరమో, ఒరిస్సాకు గంజాం, కోరాపుట్ ఏజెన్సీలు చెందరాదనేది కూడా అంతే అసహేతుకం.

రచయిత– ప్రాంతీయ నిర్దేశకుడు, రాజీవ్ గాంధీ జాతీయ యువజనాభివృద్ధి సంస్థ, ఈశాన్య ప్రాంత కేంద్రం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ, దోయిముఖ్, అరుణాచల్‌ప్రదేశ్.

జనవాణి

నిరుపేద బిడ్డలను విద్యకు దూరంచేసే ప్రమాదం

విద్యలో ప్రాథమిక, మాధ్యమిక స్థాయి వరకు, మాతృభాష మాధ్యమంలో మాత్రమే విద్యాబోధన అమలు చేయటం అవగాహన కలిగి చేసే నిర్ణయం. ఆలోచన అవగాహన ప్రశ్నించడం సృజనాత్మక శక్తిలాంటి సామర్థ్యాలు, కొత్త తరాల బిడ్డలు సంతరించుకోవాలంటే, తల్లి కడుపులో జీవిగా బిడ్డ ఆవిర్భవించిన నాటి నుంచి, మనము, మన పరిసరాలు వినియోగిస్తున్న భాషను తప్పనిసరిగా విద్యా మాధ్యమంగా అమలు చేయాలి. అదే మాతృభాష. అప్పుడే బిడ్డలలో పాఠ్యాంశాలను సులువుగా అర్థం చేసుకుని, అవగాహన పొందగలిగే సామర్థ్యం ద్విగుణీకృతమవుతుంది. బాల్యం నుంచే మాతృభాషకు దూరం చేయబడిన బిడ్డలు, ఏ అంశానికి సంబంధించిన ఏ స్థాయి అకడమిక్ విద్యార్హతలు సాధించినా, ఆ అర్హతల సామర్థ్యం అంతా మార్కులు సాధించే యంత్రాలుగా మాత్రమే పొంది ఉంటారు. సంబంధిత అంశాలకు సంబంధించిన నైపుణ్యతా సామర్థ్యం శక్తివంతంగా పెంపొందే ఆస్కారం అత్యధికులలో చాలా తక్కువగా ఉంటుంది.


అలాంటి వారు ఏ వృత్తి నిర్వహణ విధులలో ఉన్నా, సాధించే ఫలితాలు నష్టదాయకమయ్యే దుస్థితి నెలకొనే ప్రమాదం ఉంటుంది. బిడ్డల వయస్సు అవగాహనా సామర్థ్యం సంతరించుకునే దాకా, విద్యావిధానం మాతృభాష మాధ్యమంలో మాత్రమే అమలు జరగటం వలన, నూతన తరాలను ఏ విధి నిర్వహణకైనా సమర్థవంతమైన శక్తులుగా నిర్మించగలిగే అవగాహననిస్తుంది. అంతేకాదు, ప్రాథమిక దశలో విద్య పట్ల బిడ్డలకు నేర్చుకోవటంలో ఉండే ఆనందాన్ని ఆహ్లాదాన్ని ఆస్వాదించే మానసిక స్థితిని ప్రేరేపించి, విద్య పట్ల విముఖత ఏర్పడకుండా ఆకర్షించి, విషయగ్రాహక సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. జాతి పురోభివృద్ధికి శక్తివంతమైన సమర్థులుగా తీర్చిదిద్దే పునాదిగా నిలుస్తుంది. ప్రాథమిక విద్య స్థాయిలో బిడ్డలను మాతృభాషకు దూరం చేయటం, పరభాషను విద్యామాధ్యమంగా అమలు చేయటం వల్ల, నిరాధారులైన నిరుపేద తల్లిదండ్రుల బిడ్డలు, విద్యకు దూరం ఆయ్యే ప్రమాదం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది.

–మావో సియాంగ్, 94915 82518.

కీ॥శే॥పోరంకి దక్షిణామూర్తి

గిడుగు మెమొరాండం:గురజాడ డిసెంట్ పత్రం





తెలుగు వాడుకభాష 'ప్రామాణికభాష'గా గుర్తింపుపొందడానికి అది అన్ని రంగాల్లోనూ వ్యాపించడానికి ప్రధాన కారకులు గిడుగు, గురజాడ. వీరిద్దరూ ఆధునిక భాషావాదులు కావటంవల్ల ఆకాలపు చాదస్తపు పండితులంతా ఒక్కటయి వీరి వాదానికి వ్యతిరేకంగా సభలు జరిపి, తీర్మానాలు ప్రకటించి, ప్రభుత్వానికి మహజర్లు పంపుకొని ప్రాచీన కావ్యభాషను బడిపిల్లల పుస్తకాల్లో కొనసాగించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. గిడుగు గురజాడల ఆధునిక భాషోద్యమం అంతకన్న తీవ్రంగా సాగింది. రామ్మూర్తి పంతులుగారు ప్రత్యేకంగా పనిగట్టుకొని మద్రాసు, నెల్లూరు, గుంటూరు, మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం పట్నాలకు వెళ్ళి అక్కడి విద్యావంతులతో చర్చించి తమ వాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. అప్పటికి ముప్పైఏళ్ళుగా ప్రాథమిక పాఠశాల స్థాయినించి కళాశాల స్థాయి వరకు బోధనానుభవం ఉన్నవారు ఆయన. అంతే కాకుండా ఇంగ్లండులో, ఫ్రాన్సులో, ఇతర నాగరకదేశాల్లో విద్యారంగం సాధించిన ప్రగతిని గురించి రాసిన పుస్తకాలు చదివారు. పర్లాకిమిడి మునిసిపల్ కౌన్సిల్ సభ్యులుగా, గ్రామీణ పాఠశాలల మేనేజరుగా, పురపాలకసంఘ పాఠశాలల సూపరింటెండెంటుగా, తదితర విద్యాసంస్థల సంబంధిగా పొందిన అనుభవం ఆయన వాదానికి ఎంతో బలమిచ్చింది. సునిశితమైన భాషాశాస్త్ర పరిజ్ఞానం, సహేతుకమైన లోకజ్ఞానం ఆయనలో చక్కగా మేళవించాయి. వీటికితోడు, తమ వాదం సరైనదన్న ఆత్మవిశ్వాసమూ, దాన్ని విద్యావంతులకు వివరించి వాళ్ళందరూ అంగీకరించేటట్టు చెయ్యాలన్న గట్టి పట్టుదలా ఆయనలో ఉన్నాయి.

గురజాడ ప్రధానంగా భావుకుడు, కవి, రచయిత, పరిశోధకుడు. గిడుగు ప్రధానంగా భాషాశాస్త్రవేత్త. వీరిద్దరూ ఒకే లక్ష్యంతో వేరువేరుగా రెండు పుస్తకాలు ప్రచురించారు. 'ఏ మెమొరాండం ఆన్ మోడర్న్ తెలుగు' (1913) గిడుగువారిది: 'మినిట్ ఆఫ్ డిసెంట్' (1914) అన్నది గురజాడ వారిది. ఆధునిక వ్యావహారికభాషను ప్రామాణికభాషగా గుర్తించడం వల్లా ప్రాథమిక పాఠశాలల్లోనూ సెకండరీ పాఠశాలల్లోనూ దీన్ని వాడటానికి అనుమతించడంవల్ల కలిగే లాభాలు వివరించడం వీరిద్దరి ప్రధానోద్దేశం. ప్రాచీన కావ్య భాషావాదులు వాదాల్ని సునిశితంగా, సహేతుకంగా, ఇద్దరూ ఖండించారు- శబ్దస్వరూప నిర్ణయంలో పండితులు పడే పొరపాట్లు బట్టబయలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రామాణిక భాషాశాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందినవారి అభిప్రాయాలు పరిశీలించి వాటిని తమ వాదానికి ఉపబలకంగా చేర్చుకొన్నారు. ఇద్దరూ శబ్దస్వరూపాల్ని వివరించే పట్టికలతో, విమర్శలతో అనుబంధాలు చేర్చారు. అయితే రెంటికి ఒక్కతేడా ఉంది. గురజాడ వారిది 'డిసెంట్ పత్రం'. ఇది, మద్రాసు విశ్వవిద్యాలయంవారు భాషా వివాద పరిష్కారం కోసం నియమించిన 'తెలుగు కాంపోజిషన్ సబ్ కమిటీ' మెజారిటీ సభ్యులు ఇచ్చిన నివేదికకు అనంగీకారం ప్రకటిస్తూ సమర్పించిన పత్రం. అందువల్ల కమిటీ సమావేశాల్లో ఆయా సందర్భాల్లో చర్చకు వచ్చిన అంశాలు ఆయా వ్యక్తుల ధోరణులూ స్పష్టంగా వెల్లడించడం జరిగింది. మొత్తంమీద ఈ రెండు పుస్తకాలూ తెలుగు వ్యావహారిక భాషోద్యమ చరిత్రలో నిలిచే తోరణస్తంభాలని చెప్పవచ్చు.

మెమొరాండం

ఈ పుస్తకం రాయటంలో రామ్మూర్తిగారు తమ ఉద్దేశాన్ని మొదటి పేరాలోనే చేశారు. మాతృభాషలో బోధించవలసిన ఉన్న బడిపిల్లల పుస్తకాల్లోనే కాకుండా ప్రభుత్వం కాని, ప్రభుత్వాధికారులు కాని తెలుగు

ప్రజలకు రాసే ఉత్తరాల్లో పంపే వర్తమానాల్లో, ప్రచురించే పుస్తకాల్లో, కరపత్రాల్లో, వ్యవసాయం, వాణిజ్యం, పారిశుద్ధ్యం మొ॥ విషయాలు జనసామాన్యానికి తెలియడానికి ప్రచురించే వాటన్నిటిలోనూ వాడుక భాష వాడడానికి అనుమతించాలని చెప్పారు. 1903 మార్చి 11నాడు గవర్నర్ జనరల్ కౌన్సిల్వారి తీర్మానంలో పేర్కొన్నట్టు దేశభాషల్ని ఉపేక్షించడం జరుగుతోందనీ, ఈ దుఃస్థితికి మూలకారణం ప్రజలు మాట్లాడే అసలు భాషను మాతృభాషను – ఉపేక్షించడమేనని చెప్పారు. పండితులనిపించుకున్న వాళ్ళంతా సంస్కృతం మీదే మోజు చూపిస్తున్నారనీ తెలుగును పెంపొందింప జెయ్యాలన్న ఆసక్తి వాళ్ళలో లేదనీ అన్నారు.

ప్రాచీన సాహిత్యంలో చెప్పుకోదగ్గ వచన రచన లేవీలేవు. బ్రిటిష్ ప్రభుత్వం సార్వజనిక విద్యావిధానం ప్రవేశపెట్టిన కొంత కాలానికి తెలుగులో వచనరచనలు చేసే ప్రయత్నం జరిగింది. కాని దురదృష్టవశాత్తు అది భాషాభేషజం ప్రదర్శించే పండితుల చేతుల్లో పడింది. అయితే పాశ్చాత్య సాహిత్య గ్రంథాల వల్ల ప్రభావితులైన రచయితలు కొందరు అప్పుడప్పుడు, ప్రాచీనమూ కృతకమూ అయిన కావ్యభాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా సరళీకరించడంలో, 'ఆధునికం చెయ్యడంలో కొన్ని ప్రయోగాలు చేసిన మాట వాస్తవం. వీరేశలింగం గారి వంటివారు కొద్దిమంది తప్ప తక్కిన వాళ్ళు దీన్ని సాధించలేకపోయారు. అయితే వీరేశలింగంగారుకూడా, భాషను ఎంత సులభం చేసినప్పటికీ వాక్యనిర్మాణమూ వ్యాకరణమూ పాత పండితుల కృతక పద్ధతిలోనే ఉండిపోయింది అన్నారు రామ్మూర్తి పంతులుగారు. ఈ సందర్భంలో జార్జిగ్రియర్సన్ భారతీయ భాషల్ని గురించి చేసిన వ్యాఖ్యలు ఉదాహరించారు. "The - veracular has been split into two sections the tougue which is understanded of the people, and the literary dialect, known only through the press and not intelligible to these who do not know Sanskrit. Literature has thus been divorced from the great masses of the population and to the literary classes". అలాగే, 'న్యూ ఇంగ్లీష్ గ్రామర్' రచయిత స్వీట్, వ్యాకరణ శాస్త్ర అధ్యయన లక్ష్యాన్ని గురించి చెప్పినవి కూడా ప్రస్తావించారు. సర్ థామస్‌మన్రో 1822లో, మద్రాస్ ప్రెసిడెన్సీలో అమలులో ఉన్న భాషోబోధన సామగ్రి గురించి చెప్పిన మాటలు ఇప్పటికీ వర్తిస్తాయనీ, అప్పటికీ ఇప్పటికీ దేశీయ భాషాబోధన ఏమీ మెరుగు కాలేదనీ అన్నారు. (1) విద్యార్థి తాను సులువుగానూ బలంగానూ సరిగానూ ఏదైనా చెప్పడానికీ రాయడానికీ భాషాబోధన తోడ్పడాలి. (2) మనస్సులో అనుకున్నది సొంతంగా చెప్పగలిగేలా చెయ్యాలి. (3) నిర్దిష్టశ్రోతలకు నిర్దిష్టలక్ష్యంతో చెప్పగలిగేటట్టు చెయ్యాలి. (4) క్రమబద్ధమైన ఆలోచనకు విద్యార్థి అలవాటుపడేటట్టు చెయ్యాలి. (5) వాస్తవ విషయాల గురించి ఊహించగల శక్తి, లోకజ్ఞానం విద్యార్థిలో పెరగాలి. (6) ఒక విషయం మీది నుంచి దృష్టి మళ్ళకుండా నిలకడగా కొనసాగే అలవాటు కావాలి (7) మనస్సుకు విషయ గ్రహణశక్తి బాగా అలవడాలి. ఈ విధంగా విద్యార్థిలో సమగ్ర వికాసం కలగడానికి భాషాబోధన తోడ్పడుతుందని ఆంగ్ల భాషావేత్త చెప్పిన అంశాలు తెలుగు పండితుల దృష్టికి తీసుకువచ్చారు రామ్మూర్తి పంతులుగారు.

"విద్యార్థులకు నిర్ణయించే పాఠ్యపుస్తకాలు సులువుగా అర్థమయ్యే భాషలో రాసినవే కావాలికాని పరిచయంలేని కావ్యభాషా శైలిలో రాసినవికాదు,' అంటూ 'ది ఇండియన్ ఎడ్యుకేషనల్ పాలసీ'లో స్పష్టం చెయ్యడం జరిగింది. సులువుగా అర్థమయ్యే భాష ప్రజలకు పరిచితమైన భాష వాడుకభాషేనని అంగీకరించినప్పటికీ దేశంలో వివిధ వర్గాలవారి పిల్లలు, వివిధ మాండలికాలు మాట్లాడుతుంటారు కాబట్టి ఏకరూపత, ప్రామాణికత కొరవడతాయని చెప్పి వాడుకభాషను నిరసించేవాళ్ళకి రామమూర్తి పంతులుగారు సహేతుకమైన సమాధానమిచ్చారు. ఇంగ్లాండులో కూడా కింది వర్గాల వాళ్ళ పిల్లలు తమతమ మాండలికాల్లో మాట్లాడుకుంటారు. కాని వాళ్ళందరికీ ప్రామాణిక భాష బోధిస్తున్నారు. అలాగే తెలుగుదేశంలో కూడా ఆ మాదిరి ప్రామాణికభాష – వాడుకభాష – బోధించవచ్చు. ఉన్నతవర్గాలవారి వాడుకలో ఏకరూపత లేదని కొందరివాదం. కాని కావ్యభాషలో ఉన్నంత రూపభేదం వాడుకభాషలో లేదని చెప్తూ గిడుగువారు 'ఒకర్తె' అన్న మాటకు 52 రూపాంతరాలూ, 'ఒకడు'కు కనీసం 16 రూపాంతరాలూ ఉన్నాయని ఉదాహరించారు. నిజం చెప్పాలంటే ప్రామాణికమైన తెలుగు వాడుక భాషలో ఉన్నపాటి వైవిధ్యం ప్రామాణికమైన ఇంగ్లీషుభాషలో కూడా ఉందన్నారు. "పండితుడి నిరంకుశత్వం వల్లనే తెలుగులోకి విజ్ఞానం రాకుండా పోయింది," అని బాధపడ్డారు.

చివరికి, తెలుగుబోధన సామాన్యమూ ఐచ్ఛికమూ అంటూ రెండు విధాలుగా ఉండాలనీ, 'ఐచ్ఛికం' కేవలం ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యదలుచుకున్న వాళ్ళకి బోధిస్తే చాలుననీ 'సామాన్యం' విద్యార్థులందరికీ నిర్బంధంగా బోధించాలనీ సూచించారు. 'సామాన్యం' ఆధునిక భాషలోనే ఉండాలి. చరిత్ర, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. ఈ శాస్త్రాలు నేర్పే ఉపాధ్యాయుడే వివిధ విషయాలమీద తెలుగులో కాంపోజిషన్ రాయిస్తాడు. ఆ విధంగా ఆధునికభాషకు అర్హమైన స్థానం ఇచ్చినవాళ్ళ మవుతామని రామమూర్తి పంతులుగారు తమ వాదం ముగిస్తూ చివర రెండు అనుబంధాలు చేర్చారు.

తెలుగువారి ఉచ్చారణలో వచ్చిన ధ్వని విపరిణామాల తీరుతెన్నులు, పద స్వరూప నిర్ణయంలో కావ్యభాషావాదుల్లో కనిపిస్తున్న గందరగోళం, కాలగతిలో ప్రాచీన, ఆధునిక రూపాల మధ్యా, అర్థాలమధ్యా ఏర్పడ్డ అంతరం ఉదాహరణలతో వివరించడం జరిగింది.

ఈ అనుబంధంలోనే, 'పడు' అనుయోగక్రియతో ఛాందస పండితులు ఒక్క పేజీలోనే డజనుకు పైగా కృతకమైన 'పాసివ్ ఫామ్స్' ఎలా ప్రయోగిస్తూ ఉంటారో గిడుగువారు చూపించారు. అవి నిజానికి 'పాసివ్ ఫామ్స్'కావు. పూర్వ కవులు అలాటివి చాలా అరుదుగానే ప్రయోగించారు. కేతన 'దశకుమార చరిత్రం' మొత్తంలో ఒకే ఒక్క రూపముంది. తెలుగు భారతంలో పర్వాని కొకటితప్ప ఉండదు. It is grammatically wrong to call such forms 'Passive'. Genuine Telugu has no passive voice. It does not require it. If em-

ploys other devices which serve the same purpose for which the passive is used in other languages, e.g. Sans, శ్రూయతాం; Tel. విను(ము); భగ్నం; Tel. విరిగినది, 'It is tom' అది చిరిగినది," అంటూ స్పష్టం చేశారు.

రెండో అనుబంధంలో, మద్రాసులో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశంలో పండితులు చేసిన తీర్మానాలు (1912లో కృష్ణా పత్రికలో అచ్చుయినవి) తీసుకొని ఒక్కొక్క తీర్మానాన్నే సహేతుకంగా ఖండిస్తూ వచ్చారు గిడుగువారు. ముఖ్యంగా విద్యార్థుల వాచక పుస్తకాల్లో శృంగారరసప్రధానమైన కావ్యభాగాలు ఎంపికచేసే విషయమై పండితులు వెల్లడించిన అభిప్రాయాన్ని గట్టిగా విమర్శించారు.

డిసెంట్ పత్రం

విద్యార్థుల వ్యాసరచనకు ఉపయోగకరమైన ప్రామాణిక శైలిని నిర్ధారణ చేసి చెప్పడానికి మద్రాసు విశ్వవిద్యాలయంవారు 1910 జూలైలో దక్షిణాది భాషలో ఒక్కొక్క భాషకు ఒక్కొక్క కమిటీ వేశారు. తెలుగు భాషకు సంబంధించిన కమిటీలో, ఎం. రంగాచార్యులుగారు (సమావేశకర్త), కందుకూరి వీరేశలింగంగారు, కొమర్రాజు లక్ష్మణరావుగారు, పి.టి. శ్రీనివాసయ్యంగారు పి. రామారాయణింగారు. రివరెండ్ జె.ఆర్.ఎ.స్టిల్‌వెల్ సభ్యులు. ఆ తరువాత గుమ్మడూరి వెంకట రంగారావు గారిని, గురజాడ అప్పారావుగారిని కూడా ఆ కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ కమిటీవారు చాలాసార్లు సమావేశాలు జరిపి, ఇంటర్మీడియట్ విద్యార్థులు శిష్ట వ్యావహారికంలో రాయడానికి అనుకూలించే విధంగా తీర్మానించారు. ప్రాచీన కావ్య భాషాభిమానులకు ఇది దుర్భరమైంది. వ్యావహారిక భాషావాదాన్ని ఎదుర్కోడానికి ఆంధ్ర సాహిత్య పరిషత్తు (Telugu Academy) స్థాపించారు. శిష్ట వ్యావహారికాన్ని గ్రామ్యమని నిరపించారు. ఊరూరా సభలు జరిపి, సంతకాలు సేకరించి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. అన్ని రంగాల్లో మాదిరిగానే విద్యారంగంలో కూడా రాజకీయ తంత్రం ప్రయోగించి, విశ్వవిద్యాలయం నియమించిన ఉపసంఘంలో రాయలసీమకు ప్రాతినిధ్యం కల్పించాలన్న కారణంతో వ్యావహారిక భాషా వ్యతిరేకులకు స్థానం కల్పించారు. కోలాచలం శ్రీనివాసరావుగారు, టి. శంకరలింగంపిళ్ళెగారు, నాగపూడి కుప్పుసామయ్యగారు, బారిస్టర్ కె. సుబ్బారెడ్డిగారు అలా వచ్చిన సభ్యులే. దాంతో త్రాసు మొగ్గ మారింది. ఆ మెజారిటీ సభ్యుల అభిప్రాయానికి గురజాడ అప్పారావుగారు అనంగీకారం ప్రకటించారు. ఆ అనంగీకార పత్రమే గురజాడ 'డిసెంట్ పత్రం.

వేదం వెంకట రాయశాస్త్రిగారూ, కొమర్రాజు లక్ష్మణరావుగారూ మొదలైన కమిటీ సభ్యులు ఆధునిక భాషావాదులతో అంగీకారానికి వచ్చే ప్రయత్నం ఏమీ చెయ్యలేదన్న విమర్శతోనే డిసెంట్ పత్రం మొదలయింది. శిష్టుల వాడుకలో ఉన్న 'వస్తాడు' వంటి రూపాలు స్వీకరించాలని ప్రొ॥ రంగాచార్య గారు ప్రతిపాదించిన సవరణను వారిద్దరూ పట్టించుకోకుండా వాడుకభాషకూ కావ్యభాషకూ సమానంగా ఉన్న రూపాలతోనే పదపట్టికలు తయారు చేశారని గురజాడ వారు ఎత్తిచూపించారు. సులభీకరణ పేరుతో ప్రసిద్ధ రచయితలు రాస్తున్న వ్యాకరణ విరుద్ధమైన రూపాల్ని గట్టిగా విమర్శించారు. 'వస్తాడు' మాదిరిగా 'స'కార, 'త'కార సంక్లిష్ట రూపాలు అనేకం విరివిగా వాడుకలో ఉన్నా పండితులు వాటిని స్వీకరించడం లేదని విమర్శిస్తూ వివిధ జిల్లాలలో ఉన్న ప్రజలు రాసుకొనే ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ గెజిట్ అనువాదాల్లోనూ క్రైస్తవసాహిత్య గ్రంథాల్లోనూ, కథల పుస్తకాల్లోనూ, వివేకవల్లి (శ్రీకాకుళం), దేశమాత (రాజమండ్రి), జ్ఞానోదయ, ఆంధ్రభారతి (మచిలీపట్నం), హిందూజనసంస్కారిణి వంటి పత్రికల్లోనూ జనరంజక గ్రంథాల్లోనూ, జానపద సాహిత్యంలోనూ, మెకంజీ కైఫియత్తులోనూ ఆ మాదిరి రూపాలు ఎంత విరివిగా వాడుకలో ఉన్నాయో తెలియడానికి సమృద్ధిగా ఉదాహరణలు ఇచ్చారు. అంతేకాకుండా శక సం॥ 1010 నుంచి వివిధ శాసనాల్లో ప్రయోగిస్తూ వచ్చిన రూపాలు చూపించారు.

అదే విధంగా అనుస్వారాంతంగా వాడుకలో ఉన్న రూపాలను కూడా కమిటీవారు పరిగణనలోకి తీసుకోకపోవడం తప్పని అప్పారావుగారు స్పష్టం చేశారు. "Whether or not the final mu (ము) Which Sanskritic neuter nouns take in the literary dialect correctly represented a speech - Sound which really existed in the past, the spoken form with an anuswara has claims to be considered at least as ancient as the form in mu (ము)" సముచ్చయార్థకాల గురించి చర్చిస్తూ వివిధ ద్రావిడ భాషల్లో వాటి స్వరూప పరిణామాలు ఎలా వచ్చాయో వివరించారు. ఆధునిక ప్రాచీన రూపాలు, ప్రామాణిక వ్యావహారిక భాష, ప్రామాణిక భాషలో ఏకరూపత అన్న అంశాల గురించి సుస్పష్టంగా చర్చచేశారు. నవ్యకావ్యభాష అనేది వట్టి మిథ్యావాదంగా నిరూపించడానికి ఆధారాలు చూపించారు. మహా మహా కొమ్ములు తిరిగిన పండితులు సైతం ఎంత అస్తవ్యస్తంగా, వ్యాకరణ విరుద్ధంగా రాస్తారో కళ్ళకి కట్టించారు. అసలైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నవారు ఆధునిక భాషా వాదులేనని నిరూపించారు. పత్రం చివర ఎనిమిది అనుబంధాలు చేర్చారు. మొదటి అనుబంధంలో, ప్రాచీన శాసనాల్లో అనుస్వారాంతంగా నామవాచకాలు (ఉదా॥ రక్తం, సుంకం, సగం, మొ॥) ఆధునిక సముచ్చయార్థకాలు (చేనున్ను, పుణ్యంగాను, తల్లికిన్ని మొ॥) ఉదాహరించారు. రెండో అనుబంధంలో ఆధునిక భాషా రూపాల గురించి పాశ్చాత్య భాషావేత్తలు వెల్లడించిన అభిప్రాయాలు అందించారు. కందుకూరివారు, చిలకమర్తివారు ప్రజలకు వాడుకలో లేని ప్రాచీన రూపాలు ఎలా ప్రయోగించారో చూపించారు. కందుకూరి, వేదం, చిలకమర్తి వంటి రచయితలు, వాడుకలో ఉన్న తత్సమాల్ని కాదని వాడుకలో లేని తద్భవాలు ఎలా ప్రయోగించారో నాలుగో అనుబంధం పట్టికల ద్వారా నిరూపించడం జరిగింది. పద మధ్యంలో అనుస్వారంలేని రూపాలు వాడుకలో ఉన్నప్పటికీ (ఉదా॥వెలుగు) కొందరు రచయితలు అనుస్వారంతో ఉన్న రూపాలే (ఉదా॥ వెలుంగు, అతండు, తొలంగు) వాడుతున్నారని ఐదో అనుబంధంలో పట్టిక ఇచ్చారు. ఆ తరువాతి

తరువాయి 28వ పుటలో....

చేగొండి రామజోగయ్య
93910 07780

మన తెలుగులో ‘పదనిసలు’

లిపి ఉన్న, లేని భాషలన్నీ కూడా సాధారణంగా ఒక నిర్దిష్టమైన అర్థం ఉండే పదాల సమాహారాలు. ఉదాహరణకి ‘వంకాయ’ ఒక కూరగాయ –ఈ పదానికి నిఘంటువులోనైనా, నిత్యవ్యవహారంలోనైనా అదొక్కటే అర్థం. అన్ని భాషలలోనూ, తొంభై శాతం పదాలు ఇదేవిధంగా ఒకే పదార్థన్నో, గుణాన్నో సూచిస్తాయి. ఉదా: కూర– కోపం అయితే, కొన్ని పదాలకి సందర్భానుసారంగా ఒకటికన్న ఎక్కువ అర్థాలుంటాయి. ఉదాహరణకి, ‘నవల’ అన్న పదానికి స్త్రీ అనే అర్థం కూడా ఉంది కదా. వీటినే నానార్థాలున్న పదాలంటాం. అదే విధంగా ఒక అర్థాన్ని సూచించే పలు పదాలుంటాయి. పర్యాయపదాలన్నమాట (నారికేళం–కొబ్బరికాయ)– నిఘంటువుల్లో, సాధారణ వ్యవహారంలో ఉన్న అర్థాలకు భిన్నమైన. కొండొక వ్యతిరేక అర్థాలను, కొన్ని పదాలు సంతరించుకుంటాయి. కాలక్రమేణా ఇది అన్ని భాషలలోనూ ఉన్న లక్షణమే గాని, మన మధురమైన తెలుగు భాషలో ప్రాంతాలకు యాసలకు అతీతంగా ఇతరభాషలలో కన్న మరింత శ్రేష్టంగా, హృదయరంజకంగా, హాస్యభరితంగా ఈ ‘పదనిసలు’ ఉంటాయి. ఉదాహరణభరితంగా సరదాగా చెప్పుకొందామా!

జననం– మరణం

ప్రసవం పుట్టింట్లో మంత్రసాని పర్యవేక్షణలో చౌకగా జరిగినా అధిక వ్యయంతో ఆసుపత్రిలో కత్తెర శస్త్ర చికిత్స సహితంగా జరిగినా, పుట్టిన బిడ్డ, నేలమీద దభీలుమని పడదు –పడడు. కాని భూమి మీద పడ్డాడు/ పడ్డది, అంటాం మాతృగర్భం నుండి ఈ భూప్రపంచంలోకి బిడ్డ వచ్చిన శుభసందర్భాన్ని సూచించటంకోసం హరి అంటే వైకుంఠంలో శేషతల్పవాసి ‘విష్ణువు’ అనే కదా సామాన్యార్థం – అయితే ఎవడైనా, ‘హరీ’ అన్నాడంటే ‘విష్ణు నామస్మరణ’ చేశాడని కాదు అర్థం– తుదిశ్వాస విడిచేశాడు ‘బాల్చీ తన్నేశాడని’(ఇది ఆంగ్లంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న వ్యవహారానికి అనువాదం!)కదా అర్థం! కొన్ని ప్రాంతాల్లో ‘పోయేడు’ అంటే వెళ్లిపోయాడని మాత్రమేకాదు, పరలోకానికి దయచేశాడని అర్థం అన్నట్టు ‘దయచేయండి’ అంటే మీరాక మాకెంతో ఆనందదాయకం అన్న భావం. ‘ఇక నిష్క్రమిస్తే సంతోషిస్తాం’ అనే రెండు పరస్పర విరుద్ధ అర్థాలు స్ఫురిస్తాయి సందర్భానుసారంగా!

సమకాలీనార్థాలు

కాలం కొన్ని పదాలకి అర్థాలని సంపూర్ణంగా మార్చేస్తుంది. దానికదేంపోయేకాలమో తెలియదు గాని! ప్రాచీన కాలంలో ‘కంపు’ అనే పదానికి ఇంపైన సువాసన అనే అర్థమే ఉండేది. ఇప్పుడైతే, దుర్భరమైన, ‘దుర్వాసన’ అనే కాదా! అలాగే ‘కళేబరం’ అంటే అసలు అర్థం ‘శరీరం అనే – నేడు శవానికి పర్యాయ పదం మాత్రమే – లేదా చచ్చిన జంతువు యొక్క శరీరానికే వాడుతున్నాం ఈ పదాన్ని. ‘చెయ్యిచ్చాడు’ అంటే ‘చేయూత’ లేదా అసరా ఇచ్చాడన్న అర్థం కన్న ద్రోహం చేశాడన్నదే మనకు స్ఫురిస్తుంది. ‘ముంచేశాడంటే’ ఏదో జలపాతంలోకో, నదిలోకో, సముద్రంలోకో తోసేశాడని కాదు. నమ్మక ద్రోహంచేశాడని అర్థం. ఉత్తరం – దక్షిణం; అంటే ‘లంచం’ అనే పదం ‘లాంఛనం’ అనే మర్యాదకరమైన పదానికి ప్రస్తుత వికృత రూపం అని తెలుసుకదా. ఇది ఎంత మామూలు అయిపోయిందంటే చిన్నపాటి లంచానికి ఇది పర్యాయపదమైపోయింది.

సుచ్యార్థాలు:

‘తిరుక్షవరం’ శఠగోపం– అనే పవిత్రమైన ఆధ్యాత్మిక పదాలకి నేడు వెంటనే స్ఫురించే అర్థాలు సర్వనాశనం చేయటం, మోసం చేయటం. విభీషణుడు ‘రామాయణం’లో ఒక ఉదాత్తమైన పాత్ర నేడు పార్టీ ఫిరాయింపు దారులని ‘విభీషణులంటున్నాం’. లేదా ‘ఆయా రామ్ గయారామ్’ అంటూ పురాణపురుషోత్తముని పేరు దుర్వినియోగం చేస్తున్నాం. ఇంకా దారుణం ఏమిటంటే వ్యసనపరుడిని ‘సకల గుణాభిరాముడని’, వ్యంగ్యంగానే అనుకోండి, అభివర్ణిస్తూన్నాం. పురుషులు దేవాలయంలో పూజారిచ్చిన పుష్పాన్ని భక్తి శ్రద్ధలతో ‘చెవిలో పెట్టుకుంటారు’ (ఎవరికోగాని కొప్పులుండవు కదా!) అయితే ‘చెవిలో పువ్వు పెట్టటం’ మనకు స్ఫురించే అర్థం ఏంటో వేరే చెప్పాలా? అలాగే ‘టోపీ పెట్టటం కూడా’ – ఇలా సూచ్యార్థాలున్న మరి కొన్ని పదాలు ‘మూడుముళ్లు’ పసుపు కుంకుమలు, పరమానందయ్య శిష్యులు, వేణ్ణీళ్లకు చన్నీళ్లు వగైరా, వగైరా – జంధ్యాల సృష్టించిన ‘సుత్తికొట్టటం’ కూడా ఇలాంటిదే. మాయాబజారు సినిమాలో పింగళి అన్నట్టు కొత్తపదాలు సృష్టించకపోతే ఎలా? ‘అస్మదీయులు– తస్మదీయులు’, ‘కంబళి– గింబళి’ – వంటి పదాలు మన తెలుగుభాషలో నిత్యం చేరుతూనే ఉన్నాయి. ఇందుకు ప్రసారమాధ్యమాలు చక్కగా కృషిచేస్తున్నాయి. ఉన్న పదాలతో ఆడుకుంటూ కొత్త పదాలను ప్రాచుర్యంలోనికి తెస్తున్నాయి. కొన్ని ఉదాహరణలు

1. తల్ల‘ఢిల్లి’ంది (ఢిల్లిలో మతకలహాలు జరిగినప్పుడు)
2. ‘అమ్మోరికా’ (అమెరికాలో భారతీయుల హత్యలు జరిగినప్పుడు)
3. బొంబోయ్ (‘ముంబై’లో బాంబుల దాడి జరిగినప్పుడు)
4. వహ్వాగ్ (సెహ్వాగ్ మూడువందల పరుగులు చేసినప్పుడు)
5. గోదావర్రీ (గోదావరి వరదలొచ్చినప్పుడు)

రూఢ్యార్థాలు:

సమకాలీన వ్యవహారంలో కొన్ని పదాలకి సాధారణంగా ఉండే అర్థాలకు భిన్నంగా వేరే అర్థాలు నిర్ధారించబడతున్నాయి. ‘కార్యం’ అన్నది శోభనానికి పర్యాయపదం, పాఠం అప్పజెప్పని విద్యార్థికి మాస్టారు ‘పెళ్లిచేసాడంటే’, బాల్యవివాహం చేస్తాడని కాదుకదా, అర్థం ‘బడితెపూజ’ చేస్తాడనేకదా – సరే బడితెపూజ అంటే బెత్తానికి పసుపు

కుంకుమలు పూస్తారని కాదు. పనిచేస్తాడని మాత్రమే....

సినిమాల ప్రభావం:

అలనాటి సినిమా నటి 'సూర్యకాంతం' నిత్య జీవితంలో చాలా సౌమ్యురాలు. కాని ఆవిడ ఎక్కువగా వేసిన వేషాల మూలంగా సూర్యకాంతం లాంటిదంటే 'గయ్యాళి' అన్న అర్థం స్థిరపడిపోయింది. ఓ సినిమాలో, బయట అరుగుమీద పడుకున్న ఓ ముసలి భర్త అర్ధరాత్రి తలుపులు తట్టి భార్యను లేపి 'తలుపులు తీయవే లోపలికొస్తా – ఇక్కడ దోమలు తెగ కుడుతున్నాయి' అంటూ సినిమాచూస్తున్న వాళ్లకి అతగాడిని కుట్టింది దోమలు కాదని, మన్మధుడని అర్థమై కడుపుబ్బ నవ్వుకున్నారు. ఇది మరీ బహిరంగంగా చెప్పుకునే విషయంకాదుగాని, దంపతులకి, ప్రేమ పక్షులకీ కూడా వివిధ సందర్భాలకి ప్రత్యేక సంకేతపదాలు (కోడ్ లాంగ్వేజీ) ఉంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే.

'ఇది'కెన్ని అర్థాలో!

'ఇది' అన్న పదం బహుళార్థకం– అసంఖ్యాక అర్థాలు! అంత ఇది వద్దు అంటే సందర్భానుసారంగా ఎన్ని అర్థాలైనా చెప్పుకోవచ్చు – కోపం, ప్రేమ, అసహ్యం, గర్వం, విధేయత, దుబారా, పొదుపు– ఇలా పరస్పర విరుద్ధభావాలను వ్యక్తపరచడానికి ఈ రెండు అక్షరాల 'ఇది' అన్న పదం విరివిగా వాడుతున్నాం. ఇంతగా ఆసంఖ్యాక విభిన్న పరస్పర విరుద్ధ అర్థాలున్న పదం ఇతర భాషలలో లేదని చెప్పడానికి మాతృభాషాభిమానిగా నాకు చాలా 'ఇది'గా ఉంది.

ఇంకా ఎన్నో:

చెవికోసుకోవటం, కడుపులో పెట్టుకోవటం చేతులు కాల్చుకోవటం లాంటి పదాలు అర్థవైచిత్రికి మరికొన్ని ఉదాహరణలు– కన్య 'కాలుజారితే' ఎముక విరగదు, కడుపొచ్చి పరువుపోతుంది. ఎవరైనా 'ఒళ్లెలా ఉంది' అని అడిగితే, మన క్షేమం, ఆరోగ్యం గురించి ఆరాతీస్తున్నాడో హెచ్చరిస్తున్నాడో సందర్భాన్ని బట్టి అతని గొంతును బట్టి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఫలానా వాడి చేతికి ఎముక లేదంటే ఏమిటి అర్థం? చెయ్యంటూ ఉంటే, ఎముకలేకుండా ఉంటుందా, అనుకోకూడదు. శిబిచక్రవర్తి లేదా దానకర్ణుడులాంటి వాడని' టీకా తాత్పర్యం చెప్పుకోవాలి. ఇలా ఎన్నో పదాలు, పదాల సమూహాలు, మన తెలుగు భాషలో నిత్య వ్యవహారంలో ప్రాచుర్యంలో ఉన్నాయి; ఇతర భాషల కన్న మనది శ్రేష్టమైనదిగా నిరూపిస్తూ. అ

26వ పుట తరువాయి...

గిడుగు మెమొరాండం:గురజాడ డిసెంట్ పత్రం

అనుబంధంలో వాడుకలో లేని రూపా లనేకం వివిధ రచనల్లోంచి సేకరించి అకారాదిగా ఒక పట్టిక తయారు చేశారు. ఆ తరువాత వాడుకలో లేని సాహిత్య రూపాలూ వాడుకలో ఉన్న సాహిత్యేతర రూపాలూ వివిధ రచయితల రచనల్లోంచి ఉదాహరించారు. చివరికి 1912 సెప్టెంబరు ఏషియాటిక్ క్వార్టర్లీ రివ్యూ పత్రికలో 'ఆరిఫ్' అనే ఆయన రాసిన The Arabic Language Question in Egypt అన్న వ్యాసాన్ని తెలుగు పండితుల పరిశీలనార్థం ఇందులో పునర్ముద్రించారు. ప్రాచీన భాషావాదులకూ, ఆధునిక భాషావాదులకూ కలిగే అభిప్రాయ భేదాల తీరుతెన్నులు తెలుసుకోడానికి ఈ అనుబంధం బాగా ఉపయోగపడుతుంది.

మొత్తం మీద, 'మెమొరాండం'లో గిడుగువారూ, 'డిసెంట్ పత్రం'లో గురజాడవారూ చెప్పదలచిన ప్రధాన విషయం ఒక్కటే. ఇద్దరి వాద సరళీ ఒక్కటే. ఇద్దరూ దేశవిదేశ భాషా సాహిత్యాల తీరుతెన్నులు అవగాహన చేసుకొన్నవారే. శాస్త్రసమ్మతంగా, సతార్కికంగా చర్చచేసేవారే. ఒకరు ఉదాహరణలు ఎక్కువ ఇవ్వవచ్చు. మరొకరు తక్కువ ఇవ్వవచ్చు. ఈ ఇద్దరిలోనూ విషయ విస్తృతి చూపించినవారు గురజాడవారు. మధ్యమధ్య కమిటీ సభ్యులతో జరిగిన వాద ప్రతివాదాలు కూడా ముచ్చటించడం జరిగింది.

తెలుగు భాషోద్యమ చరిత్ర అధ్యయనం చేసేవాళ్ళకు ఈ రెండూ బాగా ఉపకరిస్తాయి. విషయం ఒకటే అయినా, చర్చల తీరుతెన్నులు సమగ్రంగా గ్రహించడానికి రెండూ అవసరమే. ఇప్పటికి దాదాపు 70 ఏళ్ళకిందట వెలువడ్డ ఈ పుస్తకాలలో తేల్చిన విషయాలు పూర్తిగా బుర్రకెక్కించుకోనివాళ్ళు ఇప్పటికీ ఉన్నారంటే ఆశ్చర్యపోనక్కరలేదు. వాళ్ళ బుర్రలు మరమ్మతు అయినా కాకపోయినా, తెలుగువాడు వీటిని కళ్ళకద్దుకుంటాడు; వారిద్దరినీ వినమ్రంగా తలుచుకుంటాడు.

'మరోసారి గిడుగు రామమూర్తి' పుస్తకం నుండి
సంపాదకులు కీ॥శే॥ చేకూరి రామారావు,
ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గార్లకు కృతజ్ఞతలతో

కవిత

నవ్యాభరణం

వదలి వత్తలైన తెలుగు
నుదులకు జీవము పోసిన
గిడుగు రామమూర్తికి ఋణ
పడియున్నది మన తెనుగుగడ్డ

పైని పటారమ్ములతో భాషా
భేషజము చూపు పండి
తుల నదల్చిన ఉద్దండుడు
మన గిడుగు పిడుగు

నాల్కల మల్కల నలిగెడు
పల్కులనే తొలిపల్కుల
పంక్తియందు నిల్పిన శబ్దజగు
ద్బాంధవుడాతడు

దిక్కు మొక్కు లేని సవర
వాక్కున కొక అక్షరమౌ
గుడి గట్టిన విబుధవరుడు
మడి గట్టని మహీసురుడు!

బ్రతుకంతా తెలుగుదనం
ప్రతినిధిగా వెలుగొందిన
గిడుగుపండితుని స్మరణం
ఎదదకు నవ్యాభరణం

కీ॥శే॥ డా.సి.నారాయణరెడ్డి

సుధామల్ల స్రవంతి
9908336134

తెలంగాణ ఉద్యమ కథలు - సామాజిక విశ్లేషణ

భావజాలాలు, ఉద్యమాలు, సాహిత్యంలో వికసించిన తీరును మనం గమనిస్తూనే ఉన్నాం. అవి సాహిత్యంలో తెచ్చిన పరిణామాల తీరు జాతి, తమ ప్రాంత, తమ మనుగడ, తమ సంస్కృతి, సంప్రదాయాలు, తమ భాషారూపాలు(మాండలికము)ను గుర్తించడానికి, స్వయంపాలన కావాలనే డిమాండ్, వలసవాద వ్యతిరేక భావజాలమును ప్రసరిస్తూ అస్తిత్వ వాదనను వ్యక్తపరుస్తూ ఏర్పాటు ఉద్యమాలు ముందుకొస్తున్నాయి. కనుక తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదము ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంగా, ఏర్పాటు ఉద్యమంగా, స్వయంపాలన దిశగా ముందుకు సాగుతున్నది. అందులో గత పదేళ్ళ కాలంలో తెలంగాణ ప్రజలను, విద్యార్థులను, ఉద్యమ సంఘాలను, ఉద్యోగ సంఘాలను, రాజకీయ నాయకులను బాగా ప్రభావితం చేసింది. అందుకే 2000 - 2014 మధ్య గల దశాబ్దమున్న కాలమును తెలంగాణ ఉద్యమ సాధనదశ అనవచ్చు. ఎందుకంటే ఎన్నో ఏళ్ళసంది సాధించలేని ప్రత్యేక రాష్ట్రం, ఈ దశాబ్దంలో పెద్ద ఎత్తున జరిగిన ఆందోళనల నడుమ ప్రత్యేక రాష్ట్రమును సాధించుకున్నది తెలంగాణ ప్రాంతం.

తెలంగాణ భూపోరాటం అనేక కథలకు భూమిక అయ్యింది. అలా వచ్చిన కథలో ముప్పాళ లక్ష్మణరావు రాసిన "ఎత్తుండ్రి పిడికిల్లు" ఒకటి. ఇందులో బతుకమ్మ పోరాట వాహికయింది. ఊరంతా బతుకమ్మలు పేర్చి దొర ఇంటి ముందు ఆడడం అనేది రివాజు. సంఘం సూచన మేరకు ఎవరి వాడలో వాళ్ళు బతుకమ్మ ఆడడం జరుగుతుంది ఒకరకంగా ఇది దొరను ధిక్కరించడం. అలా బతుకమ్మ కూడా పోరాటానికి ఆయుధమైన సంఘటనను చిత్రీకరించారు. అలానే తొలి, మలిదశల్లో సాగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, మొదటి దశలో భర్తను, రెండవదశలో కొడుకును కోల్పోయిన స్త్రీగా స్వాతి శ్రీపాద రాసిన "బతుకమ్మ" కథలోని అమంద కనబడుతుంది. "బతుకు అన్యాయపు అక్రమాలకోసం బతుకు, నిన్ను నమ్ముకున్న మాకోసం కాదు.., పదవుల కోసం ప్రాణాలు పణంగా పెట్టేవారి కోసం బతుకు! పిడికెడు జీవితానికి పరితపించే వారికోసం కాదు.. అనుకుంటూ నడి చెరువులోకి నడిచి తనువు చాలిస్తుంది. ఈ నడక నేటి రుతువుకు అద్దం పట్టింది.

తెలంగాణ ఉద్యమం సాగుతున్న కాలంలో సమ్మెట ఉమాదేవి 'బతుకమ్మ' కథ రాశారు. ఇందులో ఒక మహిళ తన పాపను మరో మహిళ చేతిలో పెట్టి కనిపించకుండా పోయిన వైనము చిత్రీకరించింది. ఉద్యమ సమయంలో ఎంతో మంది ఉద్యమంలో అశువులు బాసిన వాళ్ళ ప్రతీకగా బతుకమ్మను చిత్రీకరించారు. అలానే తెలంగాణలో గల నీటి కరువును "నీల్లేలేకపోయే, బుతకమ్మనుదేండ్ల ఏసుడు" అనే సందేహంలో నడిపించిన కథ 'కుంపటి' బి.వి.ఎన్. స్వామి రాసిన కథ బతుకమ్మ నేపథ్యంలో నదీజలాల వ్యవహారాన్ని విశ్లేషించింది. అలా చాలా కథలు బతుకమ్మను ముందు పెట్టుకొని జన జీవితాన్ని, సమస్యలను వివరించాయి. ఈవిధంగా బతుకమ్మ తెలంగాణకు పెద్దదిక్కుగా నిలిచింది. 'తెలంగాణ ప్రాంతం వలసవాదం క్రింద ఏమేమి కోల్పోయిందో కొన్ని కథల ద్వారా చిత్రించిన కథలు అక్షర సత్యాలుగా రూపమునిస్తాయి. తాయమ్మ - కరుణ "నీళ్ళకోసం" అనే కథలో చీఫ్ ఇంజనీర్ కె.యల్.రావు సీమాంధ్ర పాలకుల కుమ్మక్కులు కుట్రల వలన సాగర్ కాలువ లోతు పెంచి నీళ్ళు దోచుకుపోయిన తీరులో నీరు పల్ల మెరుగన్నది నిజం' అని రత్నమాల పాత్ర ద్వారా తెలిసింది. నల్లగొండ జిల్లా ప్రజలు దాహార్తి, నీటి సమస్య తీరేదెన్నడు' అన్న ప్రశ్న దానికి సమాధానాలు కథల్లో కనిపిస్తాయి.

కాత్యాయని విద్మహే ప్రాంతీయ కాంక్షలు, అస్తిత్వ వేదనలను అర్థం చేసుకోవాల్సిన దృక్పథాన్ని 'విభజనరేఖలు' అనే కథలో వివరించారు. 'లింగపరమైన విభజన కూడదన్న వాళ్ళను కాదని, స్త్రీలను ప్రత్యేక వర్గంగా భావించి స్త్రీ సమస్యను చర్చిస్తున్నాం కదా! అట్లాగే ప్రాంతీయ సమస్యను కూడా చూడాలి ఎక్కడైనా ఎవరైనా అసమానతకు అన్యాయానికి గురవుతుంటే వాళ్ళతోటే మనముండాలి' అని తెలియజెప్పారు. ఈ దశాబ్దంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమములో భాగంగా వచ్చిన ఉద్యమ కథలు పరిశీలిస్తే, ఆత్మ బలిదానాలపై, ఉద్యమదశపై, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ వైఖరులపై వందలలో కథలు వచ్చాయి. ఇందులో తెలంగాణ బిడ్డను నేను, అనే కథలో ఆత్మాహుతి చేసుకున్న విద్యార్థి అంతరంగాన్ని శిలాలోలిత ఈ విధంగా వ్యక్తపరిచింది "నేను పుట్టిన తెలంగాణ గడ్డ విముక్తి కోసం, నా నేల కోసం, నా నీటికోసం, నా బాటకోసం, నా వారి భవిత కోసం, వేలాది జనం మధ్య విప్లవ నినాదాలు నినదిస్తూ, నన్ను నేను ఆహుతి చేసుకున్నాను. రాత్రిళ్ళు నేను లెక్క పెట్టే నక్షత్రాల్లో కొలువు దీరాను. ఇక్కడ్నుంచి ఆ నేలతల్లిని చూస్తూ నా తల్లి విముక్తి పొందే ఆ సుదినం కోసం ఎదురు చూస్తూ ... నేనిలా ఈ కథలో ఆత్మహుతి చేసుకునే వ్యక్తి అంతరంగ చిత్రణ బలంగా చిత్రీకరించబడింది.

ఈ దశాబ్దములోనే సి.హెచ్.మధు రాసిన 'శత్రువు' కథలో త్యాగాలను కథా వస్తువుగా చేసుకొని తెలంగాణ కోసం పోరాడాలని తెలుపుతూ, తెలంగాణ ఏర్పాటులో ప్రధాన రాజకీయ పార్టీలు దాచివేత ధోరణితో ప్రజల పోరాటాలను పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు, యువకులు విసిగిపోయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానాలు చేసుకుంటున్న త్యాగాలను చిత్రీకరించారు. పంజాల జగన్నాథం 'చేదు జ్ఞాపకం' కథలో 2009 తెలంగాణ ఉద్యమంలో యువకులు, విద్యార్థుల బలిదానాలను చూసి 1969 నాటి తెలంగాణ ఉద్యమపోరాటంలో విద్యార్థుల ముఖ్య భూమికను గుర్తు చేసుకుంటూ ఆనాటి ఉద్యమం విద్యార్థులకు, ప్రభుత్వ శక్తుల మధ్య కొనసాగిన పోలీసుచర్య ఈ ఘర్షణలో దాదాపు 400 మంది విద్యార్థులు ఉద్యమ

జ్యోతికి అశువులు బాసినారు. అందుకే ఈ కథలో ఆనాటి దృశ్యాలను మరల 2009 ఉద్యమంలో చూసి 1969 నాటి చిత్రణ మదిలో మెదులుతూనే ఉన్నాయి అని వాపోతాడు రచయిత.

కూతురు రామిరెడ్డి 'పోరుబాట' కథలో ఒకప్పటి 1969 ఉద్యమం అణచివేతకు గురిచేశారు. కానీ 2009లో మళ్ళీ రగిలిన తెలంగాణ ఉద్యమం కూడా అణగదొక్కుతారేమో అంటూ తెలంగాణ సాధన కోసం పోరు సల్పటానికి నిశ్చయించుకుంటూ ముందుకు సాగుతున్న ఉద్యమక్రాంతిని చిత్రీకరించారు. వెగ్గలం రవి – 'మనది' కథలో తెలంగాణ ఉద్యమం చివరిదశకు చేరుకొని ప్రకటన జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రాంత ప్రజలకు భయపడి వెనకకు తగ్గేసరికి – తెలంగాణ ప్రజలు విద్యార్థిలోకం ఈ కుట్రల క్రింద తెలంగాణ రాష్ట్రం రాదేమోనని... తెలంగాణ ప్రాంతంలో బలిదానాలు పెరిగి ఆత్మహత్యలకు నిలయమైన తెలంగాణను చిత్రీకరించారు.

జాతశ్రీ 'అడుగు' ఓదేల వేంకటేశ్వర్లు 'తెలంగాణం', పి. చంద్ రాసిన 'తెలంగాణ తల్లి' కథలో ఉద్యమాల కేంద్రమైన ఉస్మానియా విశ్వవిద్యాలయమును తెలంగాణ తల్లిగా చిత్రీకరించారు. తెలంగాణ తల్లిని 'నిత్యగాయాలనది' గా పేర్కొంటూ బెజ్జవరపు రవీందర్ కథలో రాశారు. ఇందులో తెలంగాణ ప్రజల పట్ల ప్రదర్శితమవుతున్న వివక్ష ప్రశ్నించబడింది. తెలంగాణ, కోస్తాంధ్ర రెండు విడిపోవాలనీ, ఏండ్లుగా జరుగుతున్న అణచివేతను భార్యపై భర్త చూపే ఆధిపత్యంగా నిరూపిస్తూ విడాకులు కావాలని ఒక స్త్రీ మూర్తి చేసే ప్రయత్నం పెద్దింటి అశోక్ కుమార్ 'రేపు మాపు అను ఒక విడాకుల కథ' లో కనిపిస్తుంది. అలానే ఈ నేపథ్యంతోనే భార్యభర్తల సంబంధాలతో పోలుస్తూ ఉద్యమ విశేషాల్ని, పోకడలను చిత్రించబడిన 'బి.వి.ఎస్. స్వామి – 'వర్తమాన చిత్రపటం' అనే కథలో సాగుతుంది.

డా.వి. చంద్రశేఖర రావు 'సి. హెచ్. నరసింహం ఆత్మకథ' ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణలో సాగుతున్న ఉద్యమాన్ని ఆవిష్కరించిన కథ. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావము కోసము ఎన్నో ఉద్యమాలు ఉధృతంగా కొనసాగాయి. ఆ ఉద్యమాలు గత 60 సంవత్సరాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. చివరికి 2009న కొనసాగిన ఉద్యమం ఎంతో మంది నిరుద్యోగ విద్యార్థులు, కళాకారులు మేధావులు, పోరాట సంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు తెలంగాణ ప్రజలు ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళే సరికి... ఇక తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి చివరికి రాజకీయ పార్టీలను సైతం పునాదులు లేకుండా కదలించిన ఉద్యమం తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఈ ఉద్యమంలో మరణించిన వారిని ... తెలంగాణ ప్రాంతం మరిచిపోదు... అంటూ పాట, గేయ రూపంలో నీవు మిగిలే ఉంటావు అంటూ చిత్రీకరించారు.

పెద్దింటి అశోక్ కుమార్ 'రణ నినాదం అను 7 ఎపిసోడ్ల కథ' ఈ కథలోని కథావస్తువు తెలంగాణ ఉద్యమం తారాస్థాయికి చేరిన సందర్భంలో రాసిన కథ 2009 తెలంగాణ ఉద్యమం మొదలై అది క్రమంగా తన అస్తిత్వము బలపర్చుకున్న సందర్భం అందుకే కథలో చివరిదశ అంటాడు. తెగతెంపులు చేసుకునేదశకు చేరుకుంది. చివరకు అది క్రమముగా కొనసాగి 2014 నాడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమునకు శుభ ఘంటికలను మోగించిన ఉద్యమం అందుకే విముక్తిని కోరుకుంటున్న పరిణామమును వివరించిన కథ. ఈ ఉద్యమ సమయంలో తల్లిదండ్రులు పడే ఆవేదనను చిత్రించిన కథ యుద్ధనాదం... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ నేపథ్యంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను ఇతివృత్తంగా తీసుకొని ఉద్వేగభరితమైన భావజాలంతో కథకు ప్రాణం పోశాడు. తెలంగాణ ఆకాంక్ష బలంగా ఉండి, ప్రతిదానికి అతిగా స్పందించే కుమారుడు పట్ల ఆందోళన చెందుతూ, అతన్ని కాపాడుకున్న తండ్రి పాత్ర అతి సహజంగా ఈ కథలో వ్యక్తం కావడం చూస్తాం. సి.హెచ్.మధు 'ఆయుధం' కథను రాశాడు. కాని ఇది అముద్రితంగా మిగిలిపోయింది. కథలో తెలంగాణ వ్యతిరేకశక్తులు, రాజకీయాలు నడిపేవారు, కార్పోరేట్ సామ్రాజ్యాధిపతులు, సమైక్యాంధ్ర ఉద్యోగులు, న్యాయవాదులు, రాజకీయ పార్టీలు ఇలా అందరు వ్యతిరేకశక్తులు వీరిని ఆయుధముతోనే పనిచెప్పాలని సామరస్యంగా ఉద్యమమునకు మద్దతివ్వని వ్యతిరేకులకు బుద్ధిని అహింస ద్వారానే చెప్పాలని, వారిపై దాడి చేయాల్సిన అవశ్యకతను వివరించారు. అయితే ప్రజాస్వామ్య వాదములో ఇలాంటి అహింస సంఘటనలకు తావులేదు. కాబట్టి ఇలాంటి కథలు ఎంతో మంది రాసిన అవి అచ్చు అవ్వడానికి నోచుకోలేదు. ఉద్యమం ప్రజాస్వామ్య మద్దతు కూడ గట్టుకొని ముందుకు నడిచినప్పుడు విజయం సాధిస్తుందని గమనించాలి.

వి చంద్రశేఖర్ రాసిన 'అతను అతనిలాంటి మరొకడు' కథ విద్యార్థి ఉద్యమాలకు నిలయమైన విశ్వవిద్యాలయ రాజకీయ వాతావరణంలో వస్తున్న మార్పులను చిత్రీకరించిన కథ. ఈ నేపథ్యంలోనే బెజ్జారపు రవీందర్ రాసిన "కొత్త రంగులద్దుకున్న కల' తెలంగాణ ప్రాంతపు సమస్య యుగాంతం వరకు చర్చిస్తే గాని తేలని సమస్య ఈ ప్రాంతం కోసం, ప్రజలు చేసే పోరాటం కొన్ని దశాబ్దాల నాటిది కాని ఈ సమస్య పరిష్కారానికి చర్చించిన ప్రభుత్వాలే లేవు అన్ని ప్రభుత్వాలు అణచివేయడానికి పని చేస్తాయి తప్ప, పరిష్కార మార్గమును చూపించలేదు. అందుకే నేటికి ప్రత్యేక సిద్ధాంతాలు, సూత్రీకరణలు కొత్త ఫిలాసఫీలు, కణకణమండే అగ్నికెరటపు భాష, పోరు భాష, రౌద్రమునిండని కళ్ళు పిడికిళ్ళుబిగించిన చేయి, మా ఆత్మహత్యలకు ఓ ధీరి ఉంటుందిలే! కాగడాల బాట, ఉద్యమబాట, గేయాల పుట్టా, పాటల బాణి, కెరటపు ఉప్పెన. విప్లవ అభ్యుదయం, సాహితీ ప్రియుల, కవులు – కళాకారుల సాహిత్యపు పూతోట, ఎర్రపూలతోట, ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు, సామాజిక సంఘాలు సమర్థించి పోరాటం చేసిన ఘట్టాలు. ఈ అరవై ఏళ్ళనాటి కమిలిన కలల్ని నలభై ఏళ్ళ నాటి నెత్తుటి చురకల్ని చూపిస్తూ ముందుకు సాగిపోయింది.

తెలంగాణ రాష్ట్రం కోసం నేల నుండి నింగికెగిసిన తారలు, కొన్ని నేలలోంచి కాగడాలు ఒక్కొక్కటి సర్రుమని మొలుచుకొస్తున్నాయి. దీనితో రాజకీయ నాయకులు, ప్రభుత్వ నాయకులు రాజీనామాల పర్వాలు కానీ అవి ఏవీ సమర్పించిన ఆమోదించిన దాఖలాలే లేవు. కానీ దప్పుల చప్పులతో ఊరికొక చావు... బతుకమ్మలు ... అలా కొత్త రంగులద్దుకొని ముందుకు సాగుతున్న ఆఖరి పోరాటం.... ఈ పోరాటం ఎన్నో లాటీలు విరిగిన, తుపాకుల మోత మోగిన, అరెస్టుల పర్వాలు కొనసాగినా, జైళ్ళల్లో నిండిన పోరాటం విరమించక పాటల తోరణాలతో

తరువాయి 33వ పుటలో....

శాస్త్రుల రఘుపతి
7386758370

దిశా నిర్దేశకుడు

మనం ఏది చెపుతామో అదే చేయాలి, ఏది చేస్తామో అదే చెప్పాలి, అనే మౌలిక సూత్రాలను నమ్ముతూ వాటిని మనం మాట్లాడుకునే తెలుగు భాషకు అన్వయించుతూ త్రికరణశుద్ధిగా అమలయ్యేటట్లుగా పోరాడి విజయం సాధించిన మహనీయులు గిడుగు రామమూర్తి పంతులుగారు. ఆ ఒరవడే వారిని సంఘ సంస్కర్తగానూ, తెలుగు భాషోద్యమ నాయకునిగానూ నిలబెట్టింది.

నిత్య జీవితంలో మనకు ఎదురయ్యే సమస్య చెప్పేదొకటీ చేసేది మరొకటనేదే. మన సంఘంలోని సామాన్యుల నుండి ఉన్నతమైన హోదాలో ఉన్నవారి వరకూ ఉన్న ప్రధానమైన బలహీనతలూ లోపాలు గూడా ఇవే. ఈ సమస్యలే జనాలందరినీ పట్టి పీడించుతూ ఎన్నో అనర్థాలను తెచ్చి పెడుతున్నాయి.

ఇదే సమస్య ఒక వంద సంవత్సరాల క్రితం వరకూ మన తెలుగు భాషను పట్టి పీడించుతూ ఉండేది. అందుకు కారణం మన తెలుగు భాషపై ఆధిపత్యం చెలాయించుతున్న సంస్కృత భాష ప్రభావమే. విద్యావంతులందరూ మన భారతీయ సనాతన ధర్మాలకు ఆధారమైన సంస్కృత సాహిత్యాన్ని అభిమానించుతూ ఉండేవాళ్లు. ఆ సాహిత్యాన్ని ఆధారంగా చేసుకుని ఉన్న రామాయణ మహాభారతం వంటి కావ్యాలను విధిగా చదివేవారు. అందులో ఉండే భాషనే ప్రామాణికమైందనీ, అర్థ వంతమైన ఆ భాషలో రాస్తేనే అది పదికాలాల పాటు నిలుస్తుందనీ నమ్ముతుండేవాళ్లు. ఆ అభిప్రాయం వారిలో గాఢంగా నాటుకొనిపోయి ఉండేది. అలాంటి భాషలో రాస్తేనే అది నిలుస్తుందనీ అనుకొనే వాళ్ళు. నన్నయ భట్టు లాంటి కవులు అలా గ్రాంథిక భాషలో రాయడం వల్లనే మనం ఇప్పటికీ వాటిని అర్థం చేసు కోగలుగుతున్నామనీ వాదించే వాళ్లు. అలాంటి వాళ్లకు జయంతి రామయ్య పంతులూ, కొక్కొండ వేంకట రత్నం పంతులు వంటి వాళ్లు నాయకత్వం వహించే వాళ్లు. వాళ్ళు వాడుక భాషను ససేమిరా సహించే వాళ్ళు కారు.

పరవస్తు చిన్నయ సూరి వ్రాసిన బాలవ్యాకరణాన్ని తమ వాదనలకు మిషగా చూపేవారు.

కానీ చెప్పేదొకటీ చేసేదొకటీ(రాసేదొకటీ) అనే ధోరణి గిడుగు రామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు గారిలాంటి వాళ్లకు ఎబ్బెట్టుగా తోచింది. అందుకే వాళ్ళు గ్రాంధికమనే సంకెళ్లతో బంధించిన మన భాషను విడిపించడానికి పోరాటం చేసి జనులు మాట్లాడుకొనే వాడుక భాషనే గొప్పదని నిరూపించారు.

గురజాడ వారు అప్పటి వాడుక భాషలో రాసిన కన్యాశుల్కం నాటకం గూడా వారి వాదానికి ప్రాణం పోసింది.

దాంతో మనం మాట్లాడుతున్న ఈ వాడుక భాషను అందలమెక్కించారు.

గురజాడ వారు అప్పటి వాడుక భాషలో రాసిన

మనమిప్పుడీ సౌకర్యాన్ని పొందడం వల్లనే అన్ని రంగాలలోనూ ముందుకెళ్ల గలుగుతున్నాం. మనసులో ఏమాలోచించు తున్నామో ఆ భావాల్ని మాటలలో చెప్పడమే కాదు రాతలలో అమలు పరుస్తూ మనకు కనిపించకుండా దూరంగా ఉన్నవాళ్లకు కూడా స్పష్టంగా అర్థమయ్యేటట్లు చెప్పగలుగుతున్నాం. ముక్కు సూటిగా అర్థమయ్యేటట్లుగా మన అభిప్రాయాలను ఇతరులకు స్పష్టంగా రాసి చెపుతున్నాం కనుకనే అన్ని దిశల్లో అన్ని దశల్లోనూ వెనుతిరిగి చూడకుండా ముందంజ వేయగలుగుతున్నాం. మన తెలుగుజాతి కంతటికీ గిడుగువారు ప్రసాదించిన వాడుకభాషనే మనందరికీ వరమైంది. విజ్ఞానశాస్త్ర పరంగానే కాకుండా స్కూళ్లలో చదువుకునే పాఠ్యపుస్తకాలలో రోజూ మన ముంగిట్లోకి చేరుకొనే వార్తా పత్రికల్లో వాడుతున్న ఈ భాష వల్లనే లోకజ్ఞానాన్ని పెంచుకో గలుగుతున్నాం. ఇవ్వాళ మన యువతా పిన్నలూ పెద్దలూ అందరిపైనా ఊహించలేనంత ప్రభావాన్ని చూపుతున్న సినిమాలలో, టీవీలలో, ప్రసార మాధ్యమాలు అన్నింటిలో వాడుతున్నది ఈ వాడుక భాషనే. మన మనస్సుకు హత్తుకునేటట్టుగా వాడుతున్నదీ మన వాడుక భాషలోని మాటలే. మనం ప్రతి అంశాన్నీ వాస్తవిక దృక్పథంతో ఆలోచించ గలుగుతున్నదీ ఈ వాడుక భాష చలువ వల్లనే. అందుకే ఇంత గొప్ప స్ఫూర్తిని మనందరికీ ప్రసాదించిన గిడుగు వారినీ మన తెలుగువారి జీవితాలకు వెలుగులను తెచ్చిన ఆ మహానుభావుని జయంతినీ వారిని స్మరించుకోవడం కోసం వారికి కృతజ్ఞతా సూచకంగా ఆగస్టు 29వ తేదీని ప్రతి యేటా తెలుగు భాషాదినోత్సవంగా వేడుకతో జరుపుకుంటున్నాం.

గిడుగు మహానుభావుడు నికృష్టపు బాధల నొందునట్టి యా
బడుగుల నందరిన్ భువి సెబాసన తీర్చుచు పండితాళికిన్
పిడుగయి కీర్తి చంద్రికల పేర్మిని గాంచె తెలుంగు వారు ముం
దడుగును వేయగల్గుటకు ఆదరువై మన మన్ననల్ గొనెన్ !

గురువు గిడుగు రామమూర్తిగారికి తాపీ ధర్మారావు ఇచ్చిన శ్రద్ధాంజలి- పత్రికల్లో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడం, సినిమాల్లో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడం, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టడానికి తీవ్ర కృషి చేయడం, తనకు తాను ఆ ఉద్యమంలో ముందుపీటీని ఉండడం. ఇంతకుమించి ఏ శిష్యుడు ఏ గురువుకు ఏం ఇవ్వగలడు! - ఏటుకూరి ప్రసాద్

నందమూరి లక్ష్మీపార్వతి
90001 29996

కొనియాడదగినది తెలుగు భాష

ఆంధ్ర భాషకు పర్యాయ పదాలుగా భాసిల్లిన తెలుగుభాష 'ఆంధ్ర' అనే పదాన్ని జాతి వాచకంగా మార్చేసి పూర్తి స్వతంత్రను సాధించేవరకు ఎదిగిందనటం నిర్వివాదాంశం. తెలుగు భాష సంపూర్ణ లిపిని, సాహిత్య పటిమను పొంది తెలుగు భాషగా వ్యవహారంలోకి వచ్చింది. అప్పయ్య దీక్షితులుగారు ఈ భాషలో పుట్టటం ఈ భాషను మాట్లాడటం ఎంతో పూర్వజన్మ సుకృతమని ఒక సంస్కృత శ్లోకంలో చెప్పారు.

"ఆంధ్రత్వమాంధ్ర భాషా చ నాల్పస్యతపసః ఫలమ్" అని– గతమెంతో ఘనకీర్తిని, ప్రాచీనతను కలిగిన మన తెలుగు భాష– భారతదేశ భాషలన్నింటిలోను ఎక్కువ మాధుర్యాన్ని కలిగి వుందనటానికి ఒక చిన్న సంఘటనను చెప్పుకోవచ్చు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి అధికార భాషగా తమిళాన్ని నిర్ణయించాలని అప్పటి ముఖ్యమంత్రి అన్నాదురై 1968లో జరిగిన తమిళ మహాసభల్లో నినాదం ఇచ్చారు. కాని అప్పటి పాశ్చాత్య పండితులంతా తెలుగు భాషకే మొగ్గుచూపారు. కారణం అన్ని భాషల్లోకి అత్యంత మధురమైన భాషగా, అజంత భాషగా రూపుదిద్దుకోవటమే కారణం. పైగా 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్'గా అభివర్ణించారు.

దానికి ప్రేరణం 1916–1917 లండన్ లో జరిగిన అంతర్జాతీయ సంగీత ఉత్సవాలలో మన దక్షిణ భారతం నుండి వెళ్ళిన గాయకులు త్యాగరాజు కీర్తనలను ఆలపించి, అందరి మన్ననలు పొందటమే. ప్రపంచ దేశాల సంగీతజ్ఞులు ఆ భాషా సౌందర్యాన్ని, సంగీతంలోని విలక్షణతను ఎంతో కొనియాడారు. మిగిలిన సంగీతాల కంటే భిన్నంగా, మాధుర్యంగా వుందని దాని సారాంశం.

భాష అజంత భాషగా గుర్తించి అది యూరప్ ఖండంలో ముఖ్యంగా ఇటలీ భాషకు ఈ విధమైన లక్షణం వుంది కనుక తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా పిలిచారు. అప్పటి నుండి ఆ పేరు సార్థకమైపోయింది. ఒకరకంగా త్యాగరాజస్వామి విదేశాల్లో మన భాషకు గౌరవాన్ని తెచ్చినవారుగా చెప్పుకోవచ్చు.

అందుకే దక్షిణాది తక్కిన భాషలయిన తమిళం, కన్నడం, మళయాళం వాళ్ళు కూడా తెలుగులో ఉన్న త్యాగరాయ కీర్తనలనే అభ్యసిస్తారు. కచేరీలు చేస్తారు. ఆ భాషలకు తెలుగు భాషకున్నంత సంప్రదాయం , సంగీతానికి తగిన 'రిథమిక్ అంటే తాళం, లయ లాంటివి లేవన్న మాటేగా. ఆ బాణి ఒక్క మన భాషకే సొంతం.

ప్రపంచ వాఙ్మయ చరిత్రలోనే మరే భాషకు అందని అనర్ఘరత్నం మన తెలుగు పద్యం. దీనికి సాటిరాగలిగింది మరొక్కటి లేదు. నన్నెచోదుని దగ్గర నుండి ఆధునిక పద్య కవులు 'జాషువా' గారి వరకూ ఈ పద్య సాహిత్యాన్ని మరో భాష అందుకోలేకపోయింది. విశ్వనాథ సత్యనారాయణగారు పద్యకవుల్ని ఇలా స్తుతిస్తారు.

సీ॥ ఋషివంటి నన్నయ రెండవ వాల్మీకి తిక్కన శిల్పపు దెమగుతోట
యెఱ్ఱన్న సర్వమార్గేచ్ఛా విధాతృండ పోతన్న తెలుగుల పుణ్యపేటి
శ్రీనాథుడు రసప్రసిద్ధ ధారాధుని కృష్ణరాయడనినన్యాకృతి ప్రబంధ
పెద్దన్న వడపోత పెట్టి నిక్షురసంబు రామకృష్ణుడు సురారామ

గీ॥ ఒకనాడు నాచన సోమన్న యుక్తివుండు చెణిపి
పదిసార్లు తిరగ వ్రాసినను మొక్క
వోని యీ యాంధ్ర కవిలోక మూర్ధమణుల నుదురు
స్థానములుగ నమస్కరించె

ఆదికవి నన్నయ మొదలుకొని శ్రీనాథాది ప్రబంధ కవుల వరకు వారిని గుర్తుచేస్తూ విశ్వనాథ సత్యనారాయణ వంటి ఆధునిక కవులు ఇటువంటి పద్యంలో వారికే కాదు పద్యానిక్కూడ ప్రాణ ప్రతిష్ఠ చేసారు.

తెలుగుభాషను కీర్తింప ధూర్జటికయినా, ఆ భాషా వధూటికయినా సాధ్యమే! మధురకవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు, తన ఆంధ్రకవితా కుమారిలో –

'రాణ్మహేంద్ర కవీంద్రు రత్నాల మేడలో పసిడిగిన్నెనుగ్గు బాలు దాగి

"కంచు జయభేరి దెసల మ్రోగించుకున్న ఆంధ్ర కవితా కుమారి
– జయోస్తు నీకు" అని అంటారు.

ఏ సాహిత్యం అయినా మత సంస్కృతి నుండి ఆవిర్భవించి వికాసం చెందింది కనుక ఆ సాహిత్యంలో వారి సంస్కృతి అంతర్లీనమై వుంటుంది. కనుక భాషకు దూరమవ్వటం అంటే మన సంస్కృతికి దూరం అవ్వటమే. అందులో తియ్యటి తెలుగు భాషలో పుట్టిన మనం మన వారసత్వాన్ని నిలబెట్టుకోవాలి కదా, కాలాంతరంలో జరిగే పరిణామ దశల్లో భాష తనమతాన్ని నిలబెట్టుకోవటానికి ఆదాన ప్రదానాలకు స్థానమిస్తుంది.

ఒకవిధంగా ఈ ఆదాన ప్రదానాలవల్లనే మన భాష గొప్ప కావ్య సృష్టి చేయగలిగింది. భారతదేశంలోని అన్ని ప్రాంతీయ భాషల సాహిత్యాలకు ప్రారంభంలోనే కాక, తర్వాత కాలంలో కూడా తనలో పరిపుష్టిని, అర్థగాంభీర్యాన్ని కలిగించుకోవటానికి– ఇతర భాషల నాశ్రయించక తప్పలేదు. అలాగే మన తెలుగు కూడా ఒక సంక్లిష్ట పరిస్థితిలో తనకు ఉన్న దేశీయ పదాలు చాలనందున సంస్కృత, ప్రాకృతాలను ఆశ్రయించవలసి వచ్చింది. గొప్ప కావ్య భాషగా రూపుదిద్దుకుంది.

అందువల్లనే ఇతర భాషలను తక్కువ చేసి చూడకూడదు. దాని ఉనికి, సౌలభ్యత, నిలదొక్కుకోవటానికి జరిగే ఆదాన ప్రదానాలు అన్ని కాలాల్లోను జరుగుతూనే వుంటాయి.

ఉదాహరణకు – మన తెలుగు భాష ఇతర భాషల్లో కన్పించినట్లు ఇతర భాషలయిన హిందీ, ఉర్దూ, పారశీ, ఆంగ్ల భాషా పదాలు నేటి

సమాజంలో మనకు తెలియకుండానే ఎక్కువగా ఉపయోగిస్తున్నాం, ఈ భాషల పదాలన్నీ తెలుగు ప్రత్యయాలతో కలిసి తెలుగు వ్యావహారిక భాషగా మారిపోయింది. జీపు, కండక్టరు, డ్రైవరు. బస్సు, రైలు, గ్లాసు, పెన్ను, రోడ్డు ఇలాంటివి ఏ భాషోకూడా మర్చిపోయాం . ఎందుకంటే తెలుగు భాషకున్న గొప్పతనం అదే. తత్సమ తద్భవ భాషలయిన సంస్కృత ప్రాకృతాల్ని ఎంతగా విలీనం చేసుకుందంటే అవి తెలుగుగానే మారిపోయాయి. అలాగే నేటి భారతంలో సమకాలీన భాషల్ని కూడా అంతే సులువుగా కలిపేసుకుంది.

ఉర్దూ పదాలు మన రెవిన్యూ, న్యాయస్థానాల్లో ఎక్కువగానే వ్యవహరిస్తుంటారు. ఉదా:– తాసీల్దారు, జిమ్మేదారు, హవల్దారు, శిరస్తాదారు ఇలాంటి ప్రయోగాలు. అలాగే మన 'తెనుగు' తెలంగ – తిలింగ అనే పదాలు ఇతర భాషల్లో మరో అర్థంలో కన్పిస్తాయి. 'పంజాబీలో – తెలంగ అంటే మంచి వస్తాదు అని అర్థం. ఉత్తరప్రదేశ్, బీహార్లలో– 'తెలింగ' అంటే సిపాయి. మధ్యప్రదేశ్ – రాజస్థాన్ – గుజరాత్ లో 'తెలింగ' అంటే 'సంస్కృత పండితుడు' అని అర్థం. మహారాష్ట్రలో 'తెలంగ' అంటే జ్యోతిషాచార్యుడు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో బోధనకు, మాధ్యమంగా తెలుగుభాష అనువైనది అని ప్రొఫెసర్ 'జె.బి.యస్.హాల్డేన్' అభిప్రాయపడ్డారు. తెలుగు జాతీయ భాష కాదగిన అర్హత వుందని ఈయన కాకినాడ మెడికల్ కాలేజీలో జరిగిన ఒక స్నాతకోత్సవంలో తెలుగు భాష గురించి ఈ అభిప్రాయాలను చెప్పారు. ఆయన తెలుగు భాషాభిమానం ఏ స్థాయికి వెళ్ళిందంటే– తన మరణానంతరం తన భౌతిక కాయాన్ని కాకినాడ మెడికల్ కాలేజీకి ఇచ్చేంతగా పాశ్చాత్యుడై వుండి తెలుగునేలను, తెలుగు భాషను ప్రేమించి, చివరకు తన శరీరాన్ని కూడా తెలుగు నేలకు అర్పించిన 'హాల్డేన్' మహాశయుని చూసి, మన తెలుగువాళ్ళు ఈ భాషలో పుట్టినందుకు గర్వించాలి.

అందుకే– కాళోజీ ఒక మాటంటారు.

'చెట్టు కొట్టి, మట్టితవ్వి, కంపపొదల కాల్చి నరికి
పుడమిదున్ని పండించిన మొదటివాడు తెలుగువాడు

అలాగే పాశ్చాత్యులయిన సి.పి.బ్రౌన్ మన భాష నేర్చుకోవటమే కాక, మూలన పడివున్న ఎన్నో తాళపత్ర గ్రంథాలను ముద్రించి వెలుగులోకి తెచ్చారు. పరిశోధన చేసి, తెలుగు భాష నిఘంటువును ఏర్పరిచారు. అదేబాటలో తెలుగు భాష కోసం కృషి చేసినవారు – డా॥ కార్వే, డా॥ కాంప్‌బెల్ మొదలయినవారు.

భారతీయ సాహిత్యంలోనే అపూర్వ గౌరవాన్ని అందుకున్న మన తెలుగు భాష– తెలుగువారి ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టిల్లు. మన గౌరవ చరిత్రకు గొప్ప పీఠం. కాలంతోపాటు ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నా తననితాను బ్రతికించుకోగలగాలి. ఇతర భాషలలో దానికున్న సాన్నిహిత్య లక్షణమే తననుతాను జీవింపచేసుకోగలదు. ఒకపక్క అంతమవుతున్న భాషలు ఎన్నో వున్నా మన భాష ఆ లిస్ట్‌లోకి చేరకూడదు. యునెస్కో విడుదల చేసిన సూచీలో తెలుగుభాష క్షీణతవుతుందని చెప్పటం ఆందోళన కలిగించే విషయం. ఆ దుర్దశ రాకుండా ప్రభుత్వాలు, పిల్లల తల్లిదండ్రులు మాతృభాష పరిరక్షణకు పూనుకోవాలి. దానికి ప్రధానంగా చదవటం, రాయటం, మాట్లాడటం ప్రతి ఒక్క తెలుగువాడికి వచ్చివుండాలి.

ఇంత గొప్పదయిన తెలుగు భాషను స్విట్జర్లాండ్‌లో– జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లీషు మూడు అధికార భాషలున్నట్లు మన దేశంలో కూడా హిందీ, ఇంగ్లీషుతోపాటు తెలుగును 3వ అధికార భాషగా చెయ్యాలని కోరుతున్నాను.

రచయిత డా॥నందమూరి లక్ష్మీపార్వతి యమ్.ఎ,యమ్.ఫిల్,పిహెచ్.డి.
–తెలుగు సంస్కృత అకాడమీ(ఆం.ప్ర.) ఛైర్మన్

31వ పుట తరువాయి...

తెలంగాణ ఉద్యమ కథలు

రెపరెపలాడుతూ ఎత్తిన పిడికిలిని దించకుండా ముందుకు సాగుతూ ఉద్యమంను ఉధృతం చేసిన వేళ... రాజకీయ జ్ఞానులను నిదురలేపిన ఉద్యమంగా ముందుకు సాగుతూ కొత్త రంగులద్దుకొని సాధన దిశగా పోతుంది అంటూ 60 ఏళ్ళ నాటి కలను సాకారము చేసేదిశగా ఆనాటి పరిస్థితులకనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను వివరించిన కథ.

ఈ దశాబ్దములో తెలంగాణ కథ అనేక పార్శ్వాలను స్పృశించింది. ప్రపంచీకరణ. ప్రాంతీయ భావజాలం, ప్రాంతీయ అస్తిత్వం రాజీకీయ పరిణామాలు గత పదేళ్ళ కాలంలో తెలంగాణ ప్రజలను, విద్యార్థులను ఉద్యమ సంఘాల, ఉద్యోగ సంఘాలను బాగా ప్రభావితం చేసింది. అట్లా అనే దానికన్నా తెలంగాణ ప్రజలలో, రచయితలలో 1956 నుండి తమ భాష అస్తిత్వం, తమ సాహిత్యం , తమ సంస్కృతి పట్ల తెలంగాణేతరులు చూపిన నిరాదరణ వివక్షలను ఎదుర్కొంటూ చైతన్యపూరితులై తమ భాష, సాహిత్య సంస్కృతులను అభిమానించటం, తమ భాషయాసల్లోనే వ్రాస్తాం, మాట్లాడతాం అనే పట్టుదల తమ సంస్కృతిని చిత్రించే కవిత, కథ వ్రాయటం ఒక ఉద్యమంగా, రూపంగా అధిక సంఖ్యలో జరిగింది. ఇలా తెలంగాణ అస్తిత్వం వేదన, ప్రాంతీయ అస్తిత్వవాదన తెలుగు సాహిత్యంలో ఒక వాదంగా గుర్తింపు వచ్చింది తమ ప్రాంతంపై జరిగే వివక్ష ఉపేక్షలేకాక అభివృద్ధి నిరోధం సహజ వనరుల దోపిడి, నీటి సమస్యలు ప్రజలను క్రోధులను చేసాయి ఇంతకు ముందు తెలంగాణ ఏర్పాటు ఉద్యమాలు వచ్చిన ప్రజలు ఈ భాషా, సాహిత్యం, సంస్కృతి మీద దాడిని గుర్తించలేదు. అదొక సమస్యగా ముందుకు రాలేదు. తమ చరిత్ర ఉపేక్షింపబడటం రచయితలకు, పరిశోధకులకు సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం వైపు మళ్లించింది తమ భాషను అభిమానించి జంకు గొంకులు న్యూనతాభావం లేకుండా రచనలు చేసే దశకు ఎదిగారు. అందుకే ఈ దశాబ్దము తెలంగాణ ఉద్యమాలదశ, ప్రాంతీయ వాదదశ, పునః వ్యవస్థీకరణ దశ అని చెప్పవచ్చు. ఈ దశాబ్దములో అన్ని సామాజిక వర్గములు వారి కథలు, ఉద్యమకథలు, ప్రత్యేక రాష్ట్ర కాంక్ష కోరే కథలు ప్రాంతీయాభిమతము, ప్రపంచీకరణ నేపథ్యంను ఇలా అనేక పార్శ్వాలు పునికి పుచ్చుకుంది ఈ దశాబ్ది కథా సాహిత్యం.

వ్యాసరచయిత, తెలుగువిభాగం
కాకతీయ విశ్వవిద్యాలయం

కడివెండి మమత
94404 02691

ఆదరణ కోల్పోతున్న అమ్మభాష

"**త**ల్లిపాల వంటిది అమ్మనుడి, పోతపాల వంటిది పరభాష" అన్నారు ప్రముఖ భాషావేత్త కొమర్రాజు గారు. 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్'గా విదేశీయులు మన తెలుగు నుడిని పేర్కొన్నారు. కానీ మన అమ్మనుడి తెలుగు రోజురోజుకు నిరాదరణకు గురవుతున్నది. అమ్మనుడి అంటే అమ్మ భాష అమ్మ నేర్పే తప్పటడుగుల నుడి. అది ఏ నుడి అయినా మాతృభాష. తెలుగు నుడి విదేశీయ భాషలన్నింటిలో గొప్ప భాషగా పేర్కొనబడిరది. ఇది మొదటగా శాసనభాషగా ఉండి ఆ తర్వాత పరిపూర్ణమైన సాహిత్య నుడిగా అవతరించింది.

నన్నయ్య 'అక్షరరమ్యత', తిక్కన 'నాటకీయత', ఎర్రన 'వర్ణణీయత' వెరసి కవిత్రయ కలములో పద్యమై పరిమళించింది. నన్నెచోడుడి జాను తెనుగు పాల్కురికి దేశీయత ద్విపద ఛందము తెలుగు నుడికి అందాన్ని చేకూర్చింది. స్వచ్ఛమైన తెలుగుగా అవతరించింది. శ్రీనాథుని పద్య శృంగారాలు తెలుగుభాష సింగారాన్ని మార్చాయి. పోతన శబ్దం, సౌందర్యం అలంకారికమై తెలుగునుడికి శోభచేకూర్చింది.

ప్రబంధ పదబంధాలు ప్రౌఢత చేకూర్చి వర్ణనీయమై, కమనీయమై, అర్థవంతమైన సంగీత, సాహిత్య మేళవింపులను రాణించింది. ఇక 'పదమ' జీవన మధురము పదకర్త గేయకర్తల అదరములలో నాట్యమాడుతూ, సంగీత స్వరూప సిద్ధికల్గి రాగాలలో విరాజిల్లింది. అంతేనా! జనపదుల హృదయనాదమై, జానపదమై, ఆశువై అశ్రుబిందువులు, ఆనందభాష్పములలో ఊరడిరచి, జానపదుని బతుకులో మమేకమైంది. ఆధునిక పోకడలలో వచనమై పొల్లులుగా ఎగిరిపడిరది తెలుగునుడి. వ్యావహారికంలో ఆహార్యమైంది. ఆధునికుల ఆశాజ్యోతి అయింది. ఊహాప్రేయసాలకు ఊపిరిపోసింది. దేశభక్తిని నలుదిక్కులకు విసిరింది. భావకవిత్వంలో ప్రభావితమై కిన్నెరల హొయలు చూపింది. అభ్యుదయంలా మేలుకొని శ్రమైకజీవన సౌందర్యాన్ని నిరూపించింది.

ఇది ఉద్యమకర్తలకు ఊపిరి అయ్యింది. గాయమైనా, ఓర్చుకుని గేయమైంది. ప్రాణమై పాటఅయ్యింది. అనాథలెందరికో అన్నార్తులెందరికో ఆయుధమైంది. తెలుగుభాష దేశదేశాలలో రెపరెపలాడిన మన నుడి, మనందరి నుడి విఖ్యాతిచెంది ప్రాచీనతను సంతరించుకుంది. ఇంత అందమైన భాష ఇప్పుడు కన్నీరు పెట్టింది. పరభాష పలవరింపు తట్టుకోలేకనా? పాలకుల అలసత్వంతో సొమ్మసిల్లేలా? అధికారుల అండదండలు లేకనా? ఎందుకు అని మనం ప్రశ్నించుకోవాలి. ఎందుకు ఇవ్వాళ తెలుగుభాష అందరి ఆదరణకోల్పోతుంది. ఆత్మీయత తగ్గింది. కొంతకాలం తర్వాత మనభాషను మనమే గుర్తించుకోలేని గుర్తుపట్టని పరిస్థితి వస్తుంది. మాతృభాషల ప్రశస్థిని ఎందరో విద్యావేత్తలు, తత్వవేత్తలు విచారించారు. అయినా మనం మన నుడిపైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాం.

విశ్వకవి రవీంద్రుడు బోధనలో అమ్మనుడిలోనే ఉండాలి అంటారు. అమ్మనుడిలో విద్యను బోధించడం వల్ల మనసులు చురుగ్గా పనిచేస్తాయి అనేది వారి ఉద్దేశం. అమ్మనుడిలో విద్యాబోధన విద్యార్థులకు సులువుగా ఉండటంతోపాటు గ్రహణసామర్థ్యం పెరుగుతుంది. జె.బి.ఎస్. హాల్డెన్ అనే విదేశీయుడు వైద్య విజ్ఞానశాస్త్ర విషయాలు బోధించడానికి తెలుగు నుడే అనువైందనీ చెప్పాడు. తెలుగు నుడిని నేర్చుకుని సాహిత్యాన్ని ముద్రించి సమాజానికి అందించిన వెలుగురేఖ సి.పి.బ్రౌన్. తెలుగునుడిని వివరిస్తూ ఇలా అంటారు. "ఈ భాషలోని సాహిత్యం. రసాస్వాదన ఈ నుడిని నేర్చుకోవడానికి పడిన ప్రయాసను మరిపించి మురిపిస్తుంది అని. ఈ విధంగా తెలుగు నుడిను తెలిసిన, నేర్చిన విదేశీయులు మన భాషపట్ల ఆప్యాయత చూపిస్తుంటే మనం ఈ మాత్రం విస్మరిస్తున్నామేమేనని అనిపిస్తుంది.

తక్షణం తీసుకోవలసిన చర్యలు :

తెలుగునుడిని ప్రాథమిక స్థాయి నుంచే బోధనామాధ్యమంగా ప్రవేశపెట్టాలని ఎన్నో కమీషన్లు తెలిపాయి. ప్రాంతీయ భాషల ఆవశ్యకతను వివరించాయి. ఆక్రమంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొంతఫలితాన్ని సాధించిందనే చెప్పవచ్చు. అలాగే ఆయా రాష్ట్రాలు వారి వారి మాతృభావాలను రక్షించుకునే ప్రయత్నం చేసాయి. ప్రాథమిక స్థాయిలో మాతృభాష బోధనలకు ఉపక్రమించాయి. కానీ పూర్తిగా సఫలీకృతులు కాలేకపోయాయి. అలాగే మన తెలుగు భాషపరిస్థితి కూడా ఉంది. 'త్రిభాషా సూత్రం' తెరపైకి రావడం మంచిదేకానీ దానివల్ల మాతృభాషల పరిస్థితి. ఆగమ్యగోచరంగా తయారయ్యింది.

ప్రస్తుతం తెలుగు నుడితో పాటు హింది, ఆంగ్ల భాషలు నేర్చుకోవడం తప్పని సరి. మారుతున్న కాలాన్ని బట్టి విద్యలో మార్పులు చోటుచేసుకోవడం సహజమే. కవలం తెలుగుభాషలోనే చదివి మిగతా హిందీ, ఆంగ్ల భాషలను ప్రక్కన పెట్టే పరిస్థితిలేదు. మన గడపదాటిన తర్వాత హింది, అంగ్లం రాకపోతే అవమానానికి గురవడం ప్రక్కన పెడితే అసలు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. అందుకే పరభాషలో విజ్ఞానం సంపాదించు నీ భాషలో నీవు సంతోషించు అన్నట్టుగా మనం మెలగాలి. ఇప్పటికీ చాలా పాఠశాలల్లో తెలుగు భాషను బోధించకుండా ఇతరభాషలకే ప్రాముఖ్యతనిస్తున్నారు. దీనివల్ల వారికి తెలుగు అక్షరమాల తెలియలేదు సరికదా! ఏదో కొత్తగా అనిపిస్తుంది.

ప్రభుత్వం ఇలాంటి విద్యా సంస్థలను గుర్తించి పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ స్థాయి వరకూ తెలుగు భాషను కచ్చితంగా అమలు జరిపేవిధంగా చూడాలి, లేనిచో ఆ విద్యా సంస్థల గుర్తింపు రద్దు

చేయాలి. తెలుగు కదా ఇంట్లో మాట్లాడుతున్నాం. బయటా మాట్లాడుతున్నాం. ఇక నేర్చుకోవడం ఏముంది అనుకుంటే ప్రమాదం అక్కడే ఉంది. మాట్లాడినంత మాత్రాన నుడివచ్చినట్టు కాదు. వ్రాయడం, చదవడం కూడా రావాలి. ముఖ్యంగా తెలుగునుడిపై నిర్లక్ష్యం ఎక్కువగా ఉంది. ఇతర భాషల ప్రభావం ఎక్కువగా ఉండటం, అలాగే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటంతో తెలుగు భాషను కొంతమంది వెలతిగా చూడడం కనిపిస్తుంది.

ఈ మధ్య కాలంలో ఇంటర్మీడియట్, డిగ్రీలో(ఎస్.ఎల్) తెలుగును కాకుండా సంస్కృతం, ఇతర భాషలను చాలామంది ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు మార్కుల ఎరచూపి కార్పొరేట్ కళాశాలలు సంస్కృతం, లాటిన్ లాంటి తెలియని నుడులను విద్యార్థులకు బలవంతంగా చదివేలా చేస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన చర్యగా ప్రభుత్వం తక్షణమే గుర్తించి కార్పొరేట్ కళాశాలలకు కళ్లెంవేయాలి. ముఖ్యంగా తెలుగును ప్రత్యేకంగా అభ్యసిస్తున్న ఇంటర్, డిగ్రీ, పిజీ, విద్యార్థులకు, అలాగే ఓరియంటల్ విద్యార్థులకు, విద్యా, ఉపాధి, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలి. ముఖ్యంగా ప్రకార్యభాషగా తెలుగును మరింత ప్రాధాన్యత కల్పించి విస్తారించాల్సి అవసరం ఉంది. పరిపాలనలో ఉత్తర ప్రత్యుత్తరాలలో తెలుగు భాషను కచ్చితంగా ఉపయోగించుకొనేలా ప్రభుత్వం చూడాలి.

గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఆంగ్లంలోనే అధికార కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనివల్ల సామాన్య ప్రజలకు విషయం అర్థం కావడం లేదు. కనుక ఏ చిన్న ఉత్తరమైనా ప్రభుత్వ అధికార ఉత్తరమైనా తెలుగు నుడిలోనే ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని తగిన చర్యలు చేపట్టాలి. మనకు ప్రభుత్వ గోడలపైనా, పర్నిచర్స్ పైన, అలాగే బస్సుగోడలపైన దేశభాషలందు తెలుగులెస్స అనే కొటేషన్లే కలర్‌ఫుల్‌గా ఉంటాయి. కానీ అధికార పత్రాలు ఆంగ్లంలో ఉంటాయి.

ఇతర రాష్ట్రాల వారు వారి వారి ప్రభుత్వ ప్రైవేట్ కార్యకలాపాలు అమ్మనుడిలోనే జరపడం గర్వించదగ్గ విషయం. జపాన్ లాంటి దేశాలు అమ్మనుడిలోనే కీర్తిని సంపాదించి, ప్రపంచ దేశాలన్నిటిలో ముందంజలో ఉన్న విషయ మనందరం గమనించాలి.

తమిళ, కన్నడ, సోదరుల గల్లీ నుంచి ఢిల్లీ దాకా వారి అమ్మనుడిలో మాట్లాడుతుంటే... మన తెలుగు వారు వచ్చీరాని ఆంగ్లానే దమ్ముతీస్తూ..... ఆయాసవుడుతూ... మాట్లాడుతున్నారు... ఎందుకీ ప్రయాస... ఇతర దేశీయులు, భాషీయులు తెలుగు నేర్చుకుంటున్నారు. తెలుగు భాషలో అభ్యసిస్తున్నారు... తెలుగు జాతి సంస్కృతే సంప్రదాయాలను పాటిస్తూ నలుదిశలా చాటుతుంటే... మనం నిద్రపోతున్నాం.

ఈ కారణాలు తెలుగునుడికి ఆదరణ లేకుండా చేస్తున్నాయని చెప్పవచ్చు. మన భాష పట్ల, సంస్కృతిపట్ల అనేక మంది ఆవేదన చెందుతున్నారు. మనలో ఎందరో వేదన పడుతున్నారు. ఆవేదన చెందుతున్నారు.

రోజు రోజు పరభాషల, పరాయి సంస్కృతుల కారణంగా, మనభాష సంస్కృతీ సంప్రదాయాలు చిన్నాభిన్నమవుతున్నాయి. దీనిని గమనించి ఇప్పటికైనా విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, సాహితీవేత్తలు, భాషా సంఘాలు విస్తృతంగా పని చేయాల్సిన అవసరం ఉంది. యువత నడుం బిగించాలి. భాషాభిమానులు మేల్కోవాలి, అప్పుడే అమ్మ నుడికి ఆదరణ దొరుకుతుంది. మన భాష, మన యాస మరిచిపోతే కన్నతల్లిని మర్చిపోయినట్లే అవుతుంది. అమ్మనుడిని మృతభాష కానీయొద్దు. దాన్ని మరిచిపోతే అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది. కాబట్టి అందరూ అమ్మభాషను గౌరవించాలి. మన భాషను మనం కాపాడుకోవాలి.

ఈ వ్యాస రచయిత సహాయ ఆచార్యులు
బద్రుకా వాణిజ్య మరియు కళల కళాశాల హైదరాబాద్

కవిత

అమృతోత్సవ పతాకం

వలస దోపిడి నరమేధానికి
లక్షల కంఠాలు నేలకొరిగినా
వారి రణగొణ ధ్వనుల ప్రకంపనలే
పోరాట దివిటీలను పూరించి
అగ్ని జ్వాలలను రగిలించి
స్వేచ్ఛాఫలం అశోకచక్రమై ఎగిసింది

దాస్య శృంఖలాలను త్రుంచడానికి
ఉరికొయ్యలకు ఉయ్యాలలూగి
భరతమాత మెడలో విరులై విరిసిన
త్యాగధనుల త్యాగఫలమే
త్రివర్ణ కేతనమై మెరిసింది

జలియన్ వాలాబాగ్ దమనకాండ
వేదన కన్నీళ్లను మిగిల్చినా
విజయమో.. వీరస్వర్గమో... అంటూ
తెల్లదొరల పీచమణిచి
మువ్వెన్నల జెండా స్వాతంత్ర్యమై మురిసింది

స్వాతంత్ర్య పోరాట విలుంబులు
చీకటి దుప్పటి తెరలను చీల్చి
స్వరాజ్యపువెలుగులను పూయించి
అమృతోత్సవ పతాకమై రెపరెపలాడుతుంది

పిల్లి హజరత్తయ్య
9848606573

స్పందన

ఈ వైతాళికుల పేర్లు చరిత్రకెందుకు యెక్కలేదు?

'అమ్మనుడి' మాసపత్రిక ఆగస్టు 2022 సంచికలో ప్రచురితమైన(పునర్ముద్రితం) రావిపూడి వెంకటాద్రి గారి వ్యాసం ('ఈ వైతాళికుల పేర్లు చరిత్రకెందుకు యెక్కలేదు?') చదివిన తర్వాత నా ఆలోచనలను కొన్నింటిని ఇక్కడ పంచుకోవాల్సిన చారిత్రిక అవసరం ఉందనే భావన కలిగింది. రావిపూడి గారు 1994లో ప్రచురించిన 'స్వామినేని హితసూచని పర్యాలోకనం' గ్రంథం ఈ వ్యాసానికి మూలం. బ్రాహ్మణ్యంతో తగాదాపడి, ఇంగ్లాండ్‌లో ప్రివీకౌన్సిల్ వరకు వెళ్ళిన మామిడి వెంకయ్య; 19వ శతాబ్ది మధ్యనాటికే తన రచనల ద్వారా ఉదాత్త సంస్కరణ భావాలను ప్రచురించిన/ వ్యక్తంచేసిన స్వామినీన (స్వామినేని) ముద్దునరసింహ నాయుడు పేర్లు వైతాళికుల జాబితాలో చేరకపోవడం ఆశ్చర్యకరం, విచారకరం. చారిత్రిక తప్పిదమనే భావాన్ని/ విమర్శను ఆయన వ్యక్తంచేశారు. ఈ విషయంగా మనం మన చరిత్రను కొంత పరిశీలించాలి. కొంత విశ్లేషించుకోవాలి. వెరసి, అనుమానాలను / అపవాదులను నివృత్తి చేసుకోవాలి. మామిడి వెంకయ్య గారిది వ్యక్తిగత విషయం(ఉపనయన ఇత్యాది సంస్కారాల విషయంలో బ్రాహ్మణ వ్యతిరేక పోరాటం) మనం ఇక్కడ సమకాలీన విషయాలను గమనించాలి. 1800–1900 సంవత్సరాల మధ్య కాలంలో తెలుగు ప్రజలు, వివిధ బ్రాహ్మణేతర వర్గాల నుండి నాటి మద్రాస్ ప్రెసిడెన్సీ గవర్నర్‌కు, అలాగే కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్‌కు(ఇంగ్లాండు) పుంఖాను పుంఖాలుగా వ్యక్తిగత మహజర్లు, ఫిర్యాదుల రూపంలో లేఖలు వెళ్ళాయి. కొందరు వ్యక్తులు మరికొంత ముందుకు వెళ్ళారు. ఈ ఫిర్యాదులన్నీ బ్రాహ్మణ ఆచారాలు, సంప్రదాయాలను వ్యతిరేకించడమే కాక, సమానావకాశాల కొరకు గళం విప్పాయి. బ్రాహ్మణుల మూలంగా తాను పదోన్నతి పొందలేక పోయాననీ, తన కులస్తులు(బలిజ, వెలమ) ఉన్నతాధికారులుగా ఉన్న సమయంలో ప్రదేశంలో మాత్రమే తనకు పదోన్నతి లభించిందని కొక్కు హనుమంతరావు అనే ఉద్యోగి ఏకంగా తన 'ఆత్మకథ'నే రాసుకొన్నాడు. ప్రత్యేక పుస్తకరూపంలో భద్రపరచుకొన్నాడు. అదే విధంగా, విశ్వబ్రాహ్మణ (అధికారిక పత్రాల్లో 'కంసాలి' పేరుతో పిలువబడే సామాజికులు) కులస్తులు తమకు పల్లకిలో ఊరేగే అవకాశం ఇవ్వాలని, పల్లకిసేవ కేవలం బ్రాహ్మణులకు పరిమితం కారాదని, తమకూ సమానాధి కారాలివ్వాలని మచిలీపట్నం నుండి ప్రభుత్వానికి మహజర్లు పంపారు. మామిడి వెంకయ్య వలె వ్యకిగత, సంస్థాగత విషయాలను బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ఇంగ్లాండ్ స్థాయికి తీసుకెళ్ళిన వారెందరో ఉన్నారు. ఇచట రెండు విషయాలను గమనించాలి:

1. వ్యక్తిగత వ్యవహారాల కోసం వ్యతిరేకత వ్యక్తంచేసిన వ్యక్తులను వైతాళికులనాలా? 19వ శతాబ్దిలోబీజిస్తున్న సాంఘిక మార్పు భావాలకు వారిని తొలి ప్రతినిధులుగా గుర్తిస్తే మన చారిత్రిక అవగాహన పెరుగుతుంది.

2. 19–20 శతాబ్దాల్లో విస్తృతంగా వ్యాపించిన బ్రాహ్మణేతరోద్యమంలో భాగంగానే వీరిని, వీరి కార్యక్రమాలను పరిగణించాలి. అలాకాక, మరో విధంగా మనం మథ్యపడితే, వేరే విధంగా ఆలోచిస్తే చరిత్రపుటలు పట్టరానంతగా మనం 'వైతాళికుల' పేర్లతో నింపాల్సి వస్తుంది. అసలు చారిత్రిక అంశమేమంటే, చరిత్ర పునర్నిర్మాణక్రమంలో వారందరూ అనివార్యమైన పనిముట్లే కాని, ఆవశ్యక మైలురాళ్ళు కాదు.

ఇక, మరో విషయం, స్వామినీన(స్వామినేని) ముద్దు నరసింహ నాయుడు గారి పుస్తకం, 'హితసూచిని' అనేక సాంఘిక విషయాలపై ఆయన విస్పష్ట సంస్కరణధోరణిని వ్యక్తంచేసుంది. ఆ పుస్తకంలో ఆయన 'ప్రమేయాలు' పేరిట వివిధ సాంఘిక విషయాలపై తన అభిప్రాయాల్ని వెల్లడించాడు. ఈ పుస్తకం 1980 నాటికే చరిత్రకారుల దృష్టిని ఆకర్షించింది. ప్రముఖ చరిత్రకారుడు వకుళాభరణం రామకృష్ణ తన సిద్ధాంత గ్రంథంలో దీన్ని పేర్కొన్నారు. స్వామినేని రచన సారాన్ని ఉటంకించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి ఈ పరిశోధన గ్రంథం సమర్పించబడింది. 1983లోనే ఇది ప్రచురితమై (వికాస్ పబ్లికేషన్స్ న్యూఢిల్లీ), దేశవిదేశ గ్రంథాలయాలకు చేరింది. ఈ సిద్ధాంత గ్రంథంలోని విషయాలను మరికొంత విపులీకరించి, ఆయనే 1994లో తెనాలి వి.ఎస్.ఆర్– ఎన్.వి.ఆర్. కళాశాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ మహాసభల్లో స్వామినేని రచనలపై విస్తృత వ్యాసం సమర్పించారు. అది సాధికారక ప్రచురణ. ఆ నాటికీ లభ్యం. ఈ వ్యాసంలో ఆయన స్వామినేని రచన ప్రభావం వీరేశలింగం పంతులుపై తప్పకుండా ఉందని పేర్కొన్నారు. తద్వారా, స్వామినేని రచనను చరిత్రకారులు విస్మరించలేదు. ఐతే, వర్గవ్యతిరేక కోణంలో చూస్తే మాత్రం స్వామినేని రచనను విస్మరించినట్లే కనపడుతుంది. చరిత్ర పునర్నిర్మాణ రచనా కార్యక్రమాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో తర్ఫీదుపొందిన చరిత్రకారులు చేపట్టినపుడు వాస్తవాల విశ్లేషణ సక్రమంగా, తార్కికంగా, హేతుబద్ధంగా జరుగుతుంది.

నేటి కాలంలో సమాచార లభ్యత అత్యంత సులభం. ఎవరూ ఎవ్వరినీ తప్పుదారి పట్టించలేరు. నిజమైన వాస్తవాలను, పరిశోధనను ఆపలేరు. ఐతే మన భావాలను వ్యక్తీకరించేటప్పుడు చారిత్రిక అప్రమత్తత అవసరం. 'అమ్మనుడి' సంపాదకవర్గం కూడా దీన్ని గమనించాలని నా విన్నపం. ఉన్నంతలో లభ్యమయ్యే శాస్త్రీయ చారిత్రిక పరిశోధన పద్ధతులను కాదనుకొనేవారితో నాకు వైరం లేదు. దూషణా లేదు. ఆవహన కూడా లేదు. కారణం, చరిత్ర రచనలో, శాస్త్రీయ పద్ధతుల్లో నాకు తగినంత శిక్షణ ఉంది కావున.

సుందర్ కొంపల్లి
94823 64838
(చరిత్రకారుడు, రచయిత, విశ్లేషకుడు)

మధురాంతకం నరేంద్ర
98662 43659

పుస్తకాల్ని పూజించే చోటు

యింగ్లాడు, వేల్స్, స్కాట్లాండు, ఉత్తర ఐర్లాండులను కలిపి యునైటెడ్ కింగ్‌డమ్ అనీ, బ్రిటన్ అనీ పిలుస్తారు. స్కాట్లాండు రాజధాని అయిన ఎడింబరో నగరం మిగిలిన అన్ని బ్రిటీషు నగరాలకంటే భిన్నంగా వుంటుంది. 15వ శతాబ్దినుంచీ వుండే పాత ఎడింబరో నగరమూ, 17వ శతాబ్దినుంచీ వుండే కొత్త ఎడింబరోనగరమూ యునెస్కో వాళ్ళ వరల్డ్ హెరిటేజ్ ప్రాంతాల్లో వొకటిగా గుర్తించబడ్డాయి. యేడుకొండలపైన వ్యాపించిన విశాలమైన ఎడింబరో నగరం మొత్తం పెద్ద మ్యూజియంలా వుంటుంది. లెక్కపెట్టలేనన్ని చారిత్రక ప్రదేశాలూ, కట్టడాలూ వుండే ఎడింబరో నగరంలో, ఆ ప్రదేశాలకంతా తలమానికంగా కనబడే కట్టడమొకటుంది. దాని పేరు స్కాట్ మాన్యుమెంటు.

ఎడింబరో నగరానికి గుండెకాయలా, నగరం మధ్యలో కాజల్‌రాక్ అనే పెద్ద గుట్టపైన, ఎడింబరో కోటుంటుంది. దానికానుకుని, గుట్ట కింద సాగే ప్రధాన రహదారి పేరు ప్రిన్సెస్ స్ట్రీట్. ఆ వీధికి నట్టనడుమ, రెండు వందల అడుగుల యెత్తుండే కిరీటపు ఆకారపు పెద్ద కట్టడం పేరు స్కాట్ మాన్యుమెంటు. సర్ వాల్టర్ స్కాట్ అనే సుప్రసిద్ధ చారిత్రక నవలా రచయిత జ్ఞాపక చిహ్నంగా కట్టిన కట్టడమది. దాన్ని చూసినప్పుడు నాకాశ్చర్యం కలగడానికి కారణాలు రెండు: వొక రచయితను అంతగొప్పగా గౌరవించడం మొదటిది. స్కాట్‌ను గురించి నాకంతవరకూ సమగ్రమైన పరిచయంలేక పోవడం రెండవది.

ప్రముఖ యింగ్లీషు నవలా రచయిత, విమర్శకుడు ఇ.ఎం.ఫాస్టర్ 'ఆస్పెక్ట్స్ ఆఫ్ ది నావెల్' అనే తన ప్రసిద్ధమైన పుస్తకంలో స్కాట్ కథను చెప్పడంలో గొప్పప్రతిభ వుండేవాడుగా పేర్కొన్నాడు. అయితే అయన శైలి, కథానిర్మాణం(ప్లాట్), పాత్రచిత్రణ బాగా బలహీనమైనవని తేల్చిపారేశాడు. ఫాస్టర్ విమర్శను ముందుగా చదవడం వల్ల నేను స్కాట్ రచనలనంతగా పట్టించుకోలేదు. అయితే స్కాట్‌ను స్కాట్లాండ్ ప్రజలు అంతగా గౌరవించడం చూశాక నాకు ఆయన గురించి పునారాలోచించాల్సిన అవసరం ఉందని తెలిసివచ్చింది.

స్కాట్లాండు హైలాండ్సును వొకప్పుడు ఆటవిక సముదాయమనీ, బందిపోట్ల రాజ్యమనీ, మత మూర్ఖుల నిలయమనీ భావించిన వాళ్ళు స్కాట్ రాసిన వేవర్లీ నవలలు చదివాక తమ అభిప్రాయాలు తప్పని తెలుసుకున్నారు. ఎడింబరో రాయల్ సొసైటీ అధ్యక్షుడుగా గూడా పని చేసిన స్కాట్ స్కాట్లాండుదే అయిన విశిష్టమైన సంస్కృతినీ, నాగరికతనూ ప్రపంచమంతా గుర్తించి గౌరవించేలా చేశాడు. అందుకే స్కాట్లాండు ప్రజలంతా యిప్పటికీ ఆయనను గొప్పగా ఆరాధిస్తారు. అంతేగాదు, తరువాతి కాలంలో బాల్జాక్, డాస్కోలిస్కీ, ఫ్లాబార్ట్, టాల్‌స్టాయ్, అలెగ్జాండర్ డ్యూమా, పుష్కిక్ వంటి మహారచయితలకంతా స్కాట్ రాసిన చారిత్రిక నవలలు స్ఫూర్తిదాయకమయ్యాయి.

1832లో స్కాట్ చనిపోయిన తరువాత ఆయన పేరుతో జ్ఞాపక మందిరానికి స్కాట్లాండు ప్రభుత్వం ప్రణాళికలు మొదలు పెట్టింది. భవనపు డిజయిన్లకోసం పోటీని పెట్టింది. జార్జ్ మెకీ కెంఫ్ అనే వాస్తుశిల్పి నమూనాను యెన్నుకుని, ఎడింబరో కోట నేపథ్యంలో వుండేలా, ప్రిన్సెస్ స్ట్రీట్ పక్కన నిర్మాణాన్ని ప్రారంభించింది. 1840 మొదలైన యీ పెద్ద మందిర నిర్మాణం 1844లో పూర్తయింది.



ఎడింబరోలోని స్కాట్ మాన్యుమెంటు

200 అడుగులా ఆరుయించీల పొడవుండే యీ గోపురం ఒక రచయిత జ్ఞాపక చిహ్నంగా తయారైన నిర్మాణాల్లో రెండవ యెత్తయినదని అంటారు (హవానాలో జోస్‌మార్టి అనే రచయిత స్మారక మందిరం ప్రపంచంలో ఎత్తయినదని వికిపీడియా చెప్తోంది. దాని ఎత్తు 358 అడుగులు. కన్యాకుమారిలో తమిళులు కట్టిన తిరువళ్ళువర్ మందిరం ఎత్తు 386 అడుగులు. పెద్ద వేదికపైన 95 అడుగుల ఎత్తుండే తిరువళ్ళువర్ విగ్రహముంది. బహుశా ప్రపంచంలో ఎత్తయిన సాహిత్యకారుడి విగ్రహం మాత్రం అదే అయి వుండాలి).

యీ పెద్ద జ్ఞాపక మందిరం పైకి వొంపులు తిరిగిన మెట్లదారి పైన వెళ్తే, రకరకాల అంతస్థుల్లో నిలబడి నగరాన్నంతా చూడొచ్చు. కోవిడ్ వల్ల మేమావూర్లో వున్న మూడు నెలల్లో దాని పైకి వెళ్ళేదారుల్ని మూసేశారు. గాలి తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే యాత్రికుల్ని పైకి

వెళ్ళనిస్తామనీ, గాలెక్కువైతే యెవరైనా పైనుంచి పడిపోయే ప్రమాదముందనీ అక్కడుండే ఉద్యోగి చెప్పాడు. యీ పెద్ద మందిరంలో క్విల్ అనే కలం పట్టుకొని రాసుకొనే పనిని కాస్సేపాపి విశ్రాంతి తీసుకుంటున్న భంగిమలో స్కాట్ చలువరాతి విగ్రహముంది. పక్కనే ఆయన పెంపుడుకుక్క 'మైదా' పడుకునివుంటుంది.

మందిరంపైన మొదటి అంతస్థు దగ్గర రాబర్ట్ బర్న్స్, లార్డ్ బైరన్, టొబియాస్ స్మాలెట్ లాంటి రచయితలు, రాణీ మేరీ, జేమ్స్ లాంటి రాజవంశీకుల తలలు వరసగా 16 కనబడతాయి. జ్ఞాపక మందిరపు మిగిలిన అంతస్థుల్లో, అనేక చోట్లలో స్కాట్ నవలల్లోని 64 పాత్రల బొమ్మల్ని అందంగా అమర్చారు. ఒక రచయిత చిత్రించిన పాత్రలకిలాంటి గౌరవం లభించడం మరెక్కడా కనిపించదు.



80 అడుగుల యెత్తున్న పెద్ద స్థంభం పైనుండే స్కాట్ పెద్ద విగ్రహం

ఎడింబరో నగరానికి బస్సులో గంట ప్రయాణపు దూరంలో వుండే గ్లాస్కో నగరంలో జార్జ్‌స్క్వేర్‌లో చుట్టూ వుండే పెద్ద విగ్రహాలమధ్యలో 80 అడుగుల యెత్తున్న పెద్ద స్థంభం పైనుండే స్కాట్ పెద్ద విగ్రహం కింది నుంచీ చూసినప్పుడు కూడా మనిషంత పొడుగ్గా కనబడుతుంది. ఎడింబరోలో వుండే యే పుస్తకాలషాపుకెళ్ళినా స్కాట్ రచనల కొత్త ముద్రణలప్రతులు తాజా ముఖచిత్రాలతో మెరిసిపోతూ కనబడతాయి. ప్రిన్సెస్ స్ట్రీట్‌లో స్కాట్ మాన్యుమెంటుకెదురుగా ఆయన పేరుతో స్కాట్లాండుకు చెందిన అనేక వస్తువుల్ని, సంగీత వాయిద్యాలనూ, దుస్తులనూ అమ్మే దుకాణమొకటుంది. దానిపై నుండే స్కాట్ రెస్టారెంటులో కాఫీ తాగడాన్ని అక్కడివాళ్ళు గొప్పగా భావిస్తారు.

స్కాట్ మాన్యుమెంటుకు రెండు మూడు వందల అడుగుల దూరంలో ఎడింబరో రైల్వేస్టేషను పేరు వేవర్లీ. వేవర్లీ అన్నది స్కాట్ రాసిన చారిత్రక నవల పేరు. ఆ తరువాత ఆయన తన నవలలకు వేవర్లీ రచయిత రాసిన నవల అనే ప్రత్యేకంగా పేరు పెట్టుకున్నాడు. తరవాత అదే జీవితాల గురించి అవే పాత్రలతో ఆయన రాసిన నవలలను 'వేవర్లీ నవలలు' అని పేర్కొంటారు. ఎడిందరో వాసులు ఆ పేరునే తమ రైల్వే స్టేషనుకు పెట్టుకుని మురిసిపోయారు.

స్కాట్లాండులో స్కాట్ తర్వాత అంతటిగౌరవం పొందిన మరో సాహిత్యకారుడు రాబర్ట్ బర్న్స్. 18వ శతాబ్దపువాడైన బర్న్స్ యింగ్లీషు రొమాంటిక్ యుగానికి ఆద్యుడు. ఆయనను యిప్పటికీ స్కాట్లాండు వాళ్ళు తమ జాతీయ కవిగా ఆరాధిస్తారు. బర్న్స్ తన మాతృభాష అయిన 'గాలిక్'లో కవితలూ, పాటలూ రాశారు. అయితే ఆయన యింగ్లీషుకే చెందిన స్కాట్లాండు మాండలికాన్ని యింగ్లీషు వాళ్ళకు అర్థమయ్యేలా రాశాడు. బర్న్స్ తన స్కాట్లాండు దేశపు జానపద గీతాల్ని సేకరించి వాటికి ప్రాచుర్యాన్ని తెచ్చారు. దాదాపు అదే పద్ధతిలో ఆయన రాసిన పాటల్ని యిప్పుడికీ అక్కడి గాయకులు ఆనందంగా పాడుకుంటారు. ఎడింబరోలోని రెజింట్‌రోడ్డులో. పాత అసెంబ్లీ



బర్న్స్ మాన్యుమెంట్

భవనానికెదురుగా బర్న్స్ స్థూపమున్నది. ఆయన పుట్టిన వూరు అల్లోవేలో ఆపాత బోగకప్పు యింటిని అలాగే పదిలపరచారు. గ్లాస్గోలోని జార్జి స్క్వేర్‌లో మొదట బర్న్స్ విగ్రహం లేదట! ఆవూరి ప్రజలంతా చందాలేసుకుని, ఆ తర్వాత ఆ విగ్రహాన్నక్కడ ప్రతిష్టించుకున్నారని అక్కడి గైడు చెప్పాడు.

ఎడింబరో కోటకు దగ్గరలో వుండే సెయింట్‌గైల్స్ కెథిడ్రల్ అనే పెద్ద చర్చిలో ప్రముఖ నవలా రచయిత ఆర్. ఎల్. స్టీవెన్సన్ స్మారక చిహ్నముంది. పడకపైన ఆనుకుని నడుమువరకు శాలువాకప్పుకుని



ఆర్. ఎల్. స్టీవెన్సన్ స్మారక చిహ్నం వద్ద రచయిత



రైటర్స్ మ్యూజియం

రాసుకుంటున్న భంగిమలో వుండే స్టీవెన్‌సన్ బొమ్మ నాలుగో డైమన్షన్ కూడావుండే ఫోటోలా సజీవంగా తయారైంది. ఆయన రాసిన ట్రెజర్ ఐలాండ్, డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ నవలలు తెలుగువాళ్ళకెంతో యిష్టమైనవి.

నేను ఎడింబరో వెళ్ళినప్పటికి అక్కడి ప్రసిద్ధమైన రైటర్స్ మ్యూజియంను కోవిడ్ వల్ల మూసేసి ఉన్నారు. అయితే నేను తిరిగిరావడానికి పదిహేను రోజుల ముందు దానిని తెరిచారు. ఎడింబరో కోట దగ్గరలో, రాయల్‌మైల్ ఆనుకుని లాన్ మార్కెట్‌లో పెద్ద మూడంతస్థుల భవనంలో రైటర్స్ మ్యూజియంలో స్కాట్, బర్న్స్, స్టీవెన్‌సన్‌ల జీవితాలకు చెందిన ఆనేక వస్తువుల్ని అక్కడ జాగ్రత్త చేశారు. ట్యూడర్ శైలికి చెందిన ఆ పాత భవనాన్ని నగరానికి బహుమతిగా యిచ్చిన లేడీ స్టయిర్ అనే ఆవిడ పేరుతో పిలుస్తారు.

1622లో కట్టిన యీ భవనం, ఎడింబరోలోని చాలా పురాతనభవనాల్లాగే, యిప్పటికీ దృఢంగా, చెక్కు చెదరకుండా వుంది. యిందులో బర్న్స్ రాతబల్ల, స్కాట్ నవలల్ని మొదట్లో అచ్చువేసిన అచ్చుయంత్రం, స్కాట్ చిన్నతనంలో ఆడుకున్న బొమ్మగుర్రం, స్టీవెన్‌సన్ బూట్లూ, ఆయన వుంగరమూ వున్నాయి. బర్న్స్ పుర్రెతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌నుపయోగించి తయారు చేసిన నమూన ఒకటి ఆ మ్యూజియంలో వుంది. ఆ ముగ్గురు రచయితల లిఖిత గ్రంథాలూ, ఛాయాచిత్రాలతో బాటూ, స్కాట్ వేవర్లీ నవల తొలి ముద్రణ ప్రతీ, స్టీవెన్‌సన్ సంతకంచేసిపెట్టుకున్న పుస్తకాలూ, బర్న్స్ ప్రూఫులు దిద్దినప్పుడు కూర్చున్న కుర్చీ, స్టీవెన్‌సన్ దుస్తులూ, ఆ దుస్తులనుంచిన వార్డ్‌రోబ్‌లాంటివెన్నో ఆ మ్యూజియంలో వున్నాయి.

రైటర్స్ మ్యూజియం ముందుండే విశాలమైన ఆవరణను 'మార్కర్స్



'మార్కర్స్ కోర్ట్'లోని ఫ్లాగ్‌స్టోన్స్

కోర్ట్' అని పిలుస్తారు. అక్కడ 14వ శతాబ్దం నుంచీ ఇప్పటి వరకూ వుండే ప్రసిద్ధ రచయితల 'ఫ్లాగ్‌స్టోన్స్'(flag stones) వున్నాయి. రచయితల కొటేషన్లు చెక్కిన రాళ్ళను ఫ్లాగ్‌స్టోన్స్ అంటారు. వాటిని టైల్స్‌లా నేలపైన పేరుస్తారు. అక్కడ యెప్పటికప్పుడు ఆధునిక రచయితల మాటలతో ఉండే ఫ్లాగ్‌స్టోన్స్ చేరుస్తుంటారు. అక్కడకెళ్ళిన సందర్శకులంతా వాటిని చదువుతూ తిరుగుతారు. స్టీవెన్‌సన్ 'ఎడింబరో వీధిదీపాలంత అందమైన నక్షత్రాలు మరెక్కడా లేవు'. డేవిడ్ డయచిన్ 'వంతెనలు కట్టడమే నా వృత్తి' లాంటి మాటల్ని అక్కడ మళ్ళీ మళ్ళీ చదువుకోవచ్చు.

యీ ముగ్గురు రచయితలే కాకుండా ఎడింబరో దగ్గరి వూర్లలో ఆర్తర్ కానన్‌డైల్, తామస్ కార్లయిల్, ఆర్. ఎం.బాలంటైన్ లాంటి ప్రసిద్ధ రచయితలెందరో పుట్టి పెరిగారు. వాళ్లయిండ్లూ, వస్తువులూ ఆయా వూర్లలో మ్యూజియాల్లో జాగ్రత్త చేశారు. నేటి ప్రసిద్ధ బాలసాహిత్య రచయిత్రి ఆర్.కె. రౌలింగ్‌ది కూడా ఎడింబరోనే! ఆమె తొలినవల రాసిన రాయల్ మైల్లోని పబ్బును గూడా అక్కడి గైడ్లు దర్శనీయస్థలంగా చూపిస్తారు.



సర్ ఆర్తర్ కానన్‌డైల్,

ఎడింబరోలాంటి చలి నగరంలో సామాజిక జీవితం మిగిలిన ప్రాంతాల్లాగాకుండా చాలా పరిమితంగా వుంటుంది. అందునే అక్కడి రచయితలు చరిత్రలోకి, ఫాంటసీల్లోకి పారిపోయారు. దీనికి టొబియాస్ స్మాలెట్ అనే 17వ శతాబ్దపు రచయిత పెద్ద మినహాయింపు. ఆయన రాసిన హంఫ్రీక్లింకర్, రొదరిక్ రాండామ్, పెడిగ్రీ పికెల్ వంటి పికరస్క్ నవలలు ఆ తరువాత చార్లెస్ డికెన్స్, మార్క్ ట్వయిన్ వంటివాళ్లు రాసిన గొప్ప సామాజిక నవలలకు స్ఫూర్తిగా వున్నాయి.

ఆర్థిక శాస్త్ర పితామహుడనే అడంస్మిత్ ఎడింబరోవాడే ! డాక్టర్ జాన్సన్ జీవిత చరిత్ర రాసిన జేమ్స్ బాస్వెల్, లాగరితమ్స్ సృష్టికర్త జాన్ నేపియర్, మానవ పరిణామాన్ని కొత్తగా నిర్వచించిన చార్లెస్ డార్విన్, టెలిఫోన్ కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రాహంబెల్, టెలివిజన్ రూపకర్త జాన్ బెయిర్డ్ – యిలా ఎడింబరోకు చెందిన ప్రసిద్ధులెందరో వున్నారు.

ఎడింబరోలో నేషనల్ గ్రంథాలయముంది. వూర్లోని ప్రతికాలనీలో

దానికి శాఖలున్నాయి. వొక చోట సభ్యత్వముంటే అన్ని గ్రంథాలయాల నుంచీ పుస్తకాలు తెచ్చుకోవచ్చు. ప్రతీ గ్రంథాలయంలోనూ పిల్లల విభాగముంది. పిల్లల సాహిత్యానికి ఎడింబరోలో తరుచుగా వర్క్ షాపులు జరుగుతాయి. మౌఖికంగా కథలు చెప్పడాన్ని ప్రోత్సహిస్తూ రాయల్ మైల్లోనే వొక స్కాటిష్ స్టోరీ టెల్లింగ్ సెంటర్‌ను ఏర్పరచారు. అక్కడ తరచుగా కథలు చెప్పడం, ఎగ్జిబిషన్లు, వర్క్‌షాపులూ, నాటకాల ప్రదర్శన జరుగుతాయి.

ఎడింబరో నగరంలో ప్రతి చోటా చాలా పుస్తకాల అంగళ్ళున్నాయి. చిన్న చిన్న అంగళ్ళలో కూడా కనీసం రెండు మూడు అరల్లో పుస్తకాలుంటాయి. ప్రతీచోటా పుస్తకాల్ని అందరూ విరివిగా కొంటుంటారు. బాగా రద్దీగా వుండే వీధుల్లోనూ, బస్సుల్లోనూ కూడా చాలా మంది పుస్తకాల్ని దీక్షగా చదువుతూ కనబడతారు. తాము చదివేసిన పుస్తకాల్ని చాలా మంది బస్టాపుల దగ్గర వదిలేసి వెళ్తారు. కావల్సిన వాళ్ళు వాటిని తీసుకెళ్ళి చదువుకుంటారు. అక్కడి ఫెస్టివ్ తియేటరులో షేక్స్‌పియర్ డ్రామా మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్ (Mid Summer Night's Dream) వోపెరాను చూడ్డానికెళ్ళినప్పుడు, టికెట్లు తనిఖీ చేస్తున్న యువతి ముందు వొపెరా పుస్తకాల గుట్ట కనిపించింది. వోపెరా ప్రారంభమయ్యేసరికి ఆ పుస్తకాలన్నీ 'హాట్‌కేక్సు'లా అమ్ముడైపోయాయి.

ఎడింబరో విశ్వవిద్యాలయం గ్రంథాలయ ముఖద్వారం దగ్గర పబ్బొకటి కనబడగానే ఆశ్చర్యపోయాను. ఆ పబ్బులోని రెండు అంతస్థుల గోడల పొడవునా అరల్లో పుస్తకాలేవున్నాయి. అక్కడ కూర్చున్న విద్యార్థులందరూ పుస్తకాలు తిరగేస్తూ, లాప్‌టాపుల్లో పనిచేసుకుంటూ విస్కీ, బ్రాందీ, కాక్‌టయిల్లాంటి మద్యాల్ని రుచిచూస్తున్నారు. ఎడింబరో ప్రజలంతా (ఆ మాటకొస్తే స్కాట్లాండు వాసులందరూ) తాము తయారు చేసే విస్కీ, జిన్, వోడ్కాలనెంతో గౌరవిస్తారు. అక్కడి వాతావరణానికి కవసరమైనంతగా కాస్త పుచ్చుకుంటారు. వాళ్ళు తాగుతారు గానీ తాగుబోతులుకారు.

అవసరమైనంత మోతాదులో తాగినప్పుడు మద్యంకూడా ఔషధమే అవుతుంది. పుస్తకాల్నీ, రచయితల్నీ, కనీసం అవరసమైనంతగానయినా, గౌరవించకపోయినప్పుడు, ఆ మనిషి మానసిక ఆరోగ్యం చెడితీరుతుంది.

యిప్పటి తెలుగు వాళ్ళకు ఎడింబరో నగరం చేస్తున్న హెచ్చరిక యిదే! అ

కవిత

ఎడతెగని ప్రయాణం

యథాలాపంగా నడుస్తున్నా..నడుస్తున్నా
కొన్ని నిట్టూర్పుల్ని కొన్ని నిస్పృహల్ని
కొంత క్లేశాన్ని కొంత ద్వేషాన్ని
నాలో ఇంకా తెగిపోని
విభిన్న ధృవాల ప్రేమ దారాల్ని
మూట గట్టుకొని నడుస్తున్నా నడుస్తున్నా..

ఎక్కడ వదలాలో తెల్వటంలేదు
ఎక్కడ గిరాటు కొట్టాలో తోచటంలేదు

మూట ముడివిప్పి ఎవరైనా చూస్తారేమో..!
ఇంతకాలం దాచుకున్న రహస్యం
కడుపుచించుకుని కాళ్ల మీద పడుతుందేమో..!
లోలోపల వెంపర్లాట
ప్రసవ వేదనకు మించిన వేదన


పచ్చగా చక్కగా గీసుకున్న
మూర్తిమత్వ ముఖచిత్రం
పీఠభూమిలా బీటలు వారుతుందేమో..!
నా భయమే నన్ను వెంటాడింది..వేటాడింది
ఏ కరాలకు ఏ శరాలకూ చిక్కలే

మూటను ఎక్కడా పడేయ బుద్ధికాలే
మళ్లీ భుజానికే ఎత్తుకున్నా
మళ్లీ యథావిధిగానే నడుస్తున్నా..

విస్తుపోయే విషయమేమిటంటే..!?
నా ముందు చాలా మందే ఇలా నడుస్తున్నారు
నా వెనక సుత ఇలానే వస్తున్నారు
మూటల్ని భద్రంగా భుజానికెత్తుకుని..!

కటుకోర్ఖ్వల రమేష్
9949083327


గ్రంథాలయం



బుద్ధుని బోధనలపై విమర్శల పరామర్శ
రచయిత:**డి. చంద్రశేఖర్**
పుటలు:56 వెల:రూ.30
ప్రతులకు: **ధర్మదీపం ఫౌండేషన్,** భద్రావతినగర్ పాత మంగళగిరి, ఆంధ్రప్రదేశ్-03.
ఫోను: 090322 93121



కృష్ణపక్షం
సాహితీ వ్యాసాలు
రచయిత:**కృష్ణుడు**
సంపాదకులు:
డా॥డి. చంద్రశేఖర రెడ్డి
పుటలు:208 వెల:రూ.100
ప్రచురణ: **ఎమెస్కో బుక్స్ ప్రై.లి.**
1-2-7, భానూకాలనీ, గగన్‌మహల్ రోడ్,
దోమలగూడ, హైదరాబాద్-500 028.
విజయవాడ: 0866-2436643




భారతీయ సాహిత్య నిర్మాతలు
నేదునూరి గంగాధరం
రచయిత:**నన్నిధానం నరసింహ శర్మ**
పుటలు:80 వెల:రూ.50
ప్రచురణ: సాహిత్య అకాదెమి, న్యూఢిల్లీ
ప్రతులకు:
అన్ని సాహిత్య అకాదెమి విక్రయ కేంద్రాలలో

పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977


జానపద దార్శనికుడు ఏ.కే..రామానుజన్

'విస్మృతి అనంతరం' (ఎమెస్కో 2014) రచయిత దేవీ 'లిఖిత రూపంలోని జ్ఞానమంతటినీ చదివే వాడిని ఒక గ్రాంధిక మూర్ఖుడు'గా పేర్కొన్న సమర్థ రామదాసును ఉదహరించారు (పుట 122)కానీ ఆయన కీలకోపన్యాసం చుట్టూ తిరిగిన Nativism:Essays in Criticism లో (సాహిత్య ఎకాడమీ 1997)



వ్యాసాలన్నీ లిఖిత సాహిత్యం, నవలలలో దేశీయత మీద రాసినవే. ఈ దేశీయతను మరాఠి సాహిత్యరంగంలో మొదటిసారిగా ఆంగ్లోపాధ్యాయులు బాలచంద్ర నేమాడే, తరువాత దేవి బలంగా ముందుకు తెచ్చారని వారి అభిప్రాయం. సాహిత్య అకాడెమీ వారి ఈశాన్య రాష్ట్రాల సాహిత్య పరంపర సంపాదకుడుగా, దేవి, దండకం లాంటిమొక్కుబడి ముందుమాటతో సరిపెట్టాడు.

కాని కన్నడ ,తమిళాలు మాతృభాషగాగల మరో ఆంగ్లోపాధ్యాయుడు, ఆ భాషలలో అచ్చుమైన జానపద సాహిత్యాన్ని, శిష్ట సాహిత్యాన్ని అనువదించటమేకాక (Folktales from India1992) ప్రాచ్య పాశ్చాత్య విచారధారతో అన్వయించిన చికాగో విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఏ.కే.రామానుజన్(the collected eassays




of A.K . Ramanujan 1999 Oxford).

93లోనే స్వర్గస్థుడైన రామానుజన్ వ్యాసాలమీద అతడు రాసుకున్న నోట్స్‌తో కలిపి నవీకరించిన 36 వ్యాసాలను ఆరు విభాగాలు చేసి, ఒకో విభాగాన్ని చికాగోలో అతని సహాధ్యాపకులు ఈ collected works లో పరిచయం చేసారు. భారతీయ పండితులు విదేశీయులకు ముడిసరుకును అందించటానికి పరిమితమైన రోజుల్లో, రామానుజన్ చామ్స్కి, డెరిడా, లేవిస్ట్రాస్, ఫ్రాయిడ్, యుంగ్, ససూర్, స్టితాంప్సన్, మొదలైన వారి వివేచనాపద్ధతులతో మేళవించి వ్యాఖ్యానించిన తీరును, వెండీ దొంగియర్, అతనిలో 'తల్లి చెప్పిన ఊరి (ఆకం) కథలు,తండ్రి ఆసక్తి కలిగించిన సంస్కృతం ,షేక్ స్పియర్ సాహిత్యం (పురం) కలగలిసిపోయాయి.పురాణ దేవతలను స్తన దేవతలుగా, ఊరివి కోర దేవతలుగా; అమ్మనుడిని మదర్ టంగ్, శిష్ట భాషను ఫాదర్ లాంగ్వేజ్‌గా పేర్కొనే, అతని మాటలు 'మనిషి ఎక్కడ తిరిగినా చివరికి ఇంటికే చేరుకుంటాడు' అంటూ ప్రస్తుతించటం(పుట4), విశ్వనాధ సూక్తిని 'పక్షి ఎన్ని దేశములు తిరిగినా, తిరిగి గూటికే చేరును' తలపిస్తుంది.

రామానుజన్ 1955లోనే తన తల్లి దగ్గర విన్న అమ్మమ్మ నాయనమ్మ కథలను కన్నడ సామెతలతో పాటు ప్రచురించాడు. చికాగో వెళ్ళాక దక్షిణ ఆసియా జానపదసాహిత్యం మీద వ్యాసాల పట్టిక తయారు చేసాడు. మధ్యలో 70 దాకా తమిళ భక్తి సాహిత్యాన్ని ఆంగ్లంలోకి అనువదిస్తూ వచ్చాడు.70 నుండి జానపదం మీద దృష్టి పెట్టాడు.అప్పటికి అతనికి మార్గ దేశి సంప్రదాలయాల మీద పట్టుతోపాటు, ప్రపంచ జానపద గాధల లక్షణ శాస్త్రం motif index అవగతమయింది.


భారతీయుల మౌఖిక సంప్రదాయం దేశ, కాల, వర్ణ, వర్గ సాపేక్షం అని వివరిస్తూ; అలంకార శాస్త్రంలో రసం, వ్యాకరణంలో స్ఫోట, ఆశ్రమ ధర్మాలు మోక్ష, సన్యాసాలు, మతంలో భక్తి; దేశ కాల పరిమితులను అంటే మాయను అధిగమించి ముందుకు పోవటానికి దారిచూపాయి(పుట 48)అని మన ఆలోచనా సరణిని తెలియపరుస్తాడు.

కురించి-కొండ; ముల్లై-అడవి; నెయ్తల్-తీరం; మరుతం-బీడు; పాలై-ఎడారి; ఈ ప్రకృతి నేపథ్యంలో చెప్పుకునే కథలలో ప్రతీకలు, వాటి మధ్య సామ్య, వైషమ్యాలు; రాగద్వేషాలలో క్రమం విప్పి చెపుతాడు. కథలో పునరావృతి పొందే సూక్ష్మాంశాలను మోటిఫింగా, మానవ శాస్త్రవేత్తలు పురాగాధలో మౌలికాంశాలను,



భాషా శాస్త్రంలో, ఫోనిం- మోర్ఫిం ఒరవడిలో మిథిం,సెమింగా పేరు పెట్టారు. రామానుజన్ ఆలోచనలు వికసించటంలో ఈ దశలను తన పరిచయవ్యాసంలో వివరించిన అలాన్ దండేస్, మైసూరులో జవహర్‌లాల్ హండు, పరమశివయ్య వగైరాలతో కలిసి ఈ అధ్యయనం మీద రామానుజన్‌తో కలిసి శిక్షణ తరగతులు నిర్వహించారు(పుట 347). మెదడుకు మేతలో(food for thought- ఈ శీర్షిక మానవ శాస్త్రజ్ఞురాలు మేరీ డగ్లస్ ది) ఆహారంతో ముడిపడిన దక్షిణాది పద్ధతులను విశదీకరిస్తాడు. జానపదంతో ఇంత మమేకమైనప్పటికీ, అనంతమూర్తి 'సంస్కార' నవలను అనువదించాడు. ప్రయోక్త గిరీష్ కర్నాడ్‌ను ప్రస్తావిస్తాడు. పాశ్యాత్య రచనలలో తిరుగుబాటును ప్రోత్సహించే ఇడిపస్ కాంప్లెక్స్ (మన:ప్రవృత్తి) భారతీయ సంప్రదాయంలో లేదని అందువల్లనే వారు చిరకాలం పరాయి పాలనను భరించారనే విదేశీయుల అతివాదాన్ని అడ్డుకుంటూ, మన ఆలోచనా సరణిని వెలికి తీసి చూపించాడు. అతని ఆంగ్ల కవిత్వాన్ని బోధించే ఇంగ్లీష్ పంతుళ్ళకు, పుస్తకపాఠం వల్లించే మన తత్వశాస్త్ర పండితులకు అతని జానపద దర్శనం ఎక్కదు. మూడు వందల రామాయణాలు, మహాభారతంలో పునరావృతి వ్యాసాలు, బిరుదురాజు రామరాజు గారు సేకరించిన తెలుగు జానపదకథనాలను గుర్తు తెస్తాయి. రామానుజన్, వెల్చేరు నారాయణరావు నుండి తెలుగు జానపద కథలు తెలుసుకున్నానని రాశాడు. కాని రామరాజు గారి సేకరణలు అతని వ్యాసాలలో కనిపించవు.

రామరాజుగారి జానపద గేయసాహిత్యంలోని సేకరణను విస్తృతంగా ఉదహరిస్తూ, తెల్లవాళ్ళు రాకముందు మన పల్లె ప్రజలలో స్వతంత్ర భావాలు, నేటి స్త్రీవాదులకేమీ తీసిపోవని గుర్తించినవాడు విరసం త్రిపురనేని మధుసూదనరావు (సాహిత్యంలో వస్తు శిల్పాలు. పర్‌స్పెక్టివ్స్1997 పుట182). 'లేఖన ప్రక్రియను మాత్రమే కవితా విప్లవాలకు చోదకశక్తిగా చెప్పటం అర్ధరహితం' (పుట74) అని నారాయణరావును దుయ్యబడతాడు. 'ప్రజారాశులకు లేని సంస్కృతి తమకు ఉన్నదనే గుర్తింపును పొందటానికి ప్రయత్నం చేస్తుంటారు'(145) అని శిష్టులను ఎండగడతాడు. **మనం మన జానపద సాహిత్యాన్ని పట్టించుకోకుండా, వాటికి కూడా రష్యన్ కథల అనువాదాలు దిగుమతి చేసుకున్నాం. పిల్లలచేత రాయిస్తున్నాం, బాలసాహిత్యం సృష్టిస్తున్నాం అనుకునే**



వాళ్ళ ప్రయత్నాలు ప్రయోగాలు, పుంజుకోవటం లేదు. అమ్మమ్మ నాయనమ్మ కథలలో శిల్పం, సూచన అర్థం చేసుకుని ప్రోత్సహిస్తే కథలు చెప్పుకునే, వినే సంప్రదాయాలతో పాటు కుటుంబ సంబంధాలు బలపడతాయి. అందుకోసం రామానుజన్ సేకరించిన కథలను అనువదించి, అదేవిధంగా మనకథలను కూడా సేకరించి చెప్పుకోవటం వల్ల ఆత్మీయత వెల్లివిరుస్తుంది.

రామానుజన్ జానపదం మీద చేసినట్లుగానే మన గిరిజనసాహిత్యం మీద కృషి జరిగింది('కొండ కోనలలో తెలుగు గిరిజనులు' 2007. తెలుగు గిరిజన సాహిత్యం. సాహిత్య అకాడెమీ 2021). మానవశాస్త్రజ్ఞుల మెప్పుపొందింది. కొడవటిగంటి కుటుంబరావు అన్నట్లు 'సమాజం దిగబెరుకుతుంటే సాహిత్యం ఎగబెరకదు'. అని నమ్మినందువల్ల, గిరిజనులలో పోరాటపటిమను బలపరచటానికి క్షేత్రస్థాయిలో పూనుకున్నందున ఈ కృషిని 'శిష్టులు నిర్లక్ష్యం చేసారు.' మానవశాస్త్రం జోలి మనకెందుకు అనుకున్న పండితులు, అటు జానపద సంప్రదాయాన్ని కూడా వృద్ధిలోకి తేలేకపోయారు. మధుసూదనరావు తరువాత విరసంలోకి వచ్చిన వాళ్ళు, ప్రజాసాహిత్యం కోసం అంకితమైన ఆఫ్రికన్ రచయిత *గూగి వాంగ్ థియాంగో* రచనలను అనువదించారు కానీ ఇక్కడి సాహిత్యాన్ని పట్టించుకోలేదు. అమ్మమ్మ నాయనమ్మ కథలు చెప్పుకునే సంప్రదాయం ఉద్యమంలో ఆహుతి అయిపోయింది అని సర్దిచెప్పుకున్నారు. (జంగల్ నామా ముందు మాట. మలుపు ప్రచురణ) కానీ తెలుగు రాష్ట్రాలలో గిరిజనులే సంప్రదాయసాహిత్యం సేకరించి ఆటవీహక్కులగుర్తింపుచట్టం బలోపేతం చేసుకుంటున్నారు.

కొండొక కోతి చెట్టు కొనకొమ్మనుండగ,
కింద గండభేరుండ మదేభ సింహ
నికురుంబములుండవె, చేరి భాస్కరా!

గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (16)



భారతదేశం వివిధ కులాలు, మతాలు, భిన్న సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనం. భిన్నత్వంలో ఏకత్వమన్న అంత:స్సూత్రంతో ముడిపడి జీవిస్తున్న జాతీయత మనది. మనకున్న సంపద, భూమి ఉపరితల భాగంలో ఎంత ఉందో భూమిలోపల నిక్షిప్తమైన భూగర్భ సంపద మరెన్నో రెట్లు ఉంది. అలాగే మూడు వైపులా విస్తరించిన జల సంపద కూడా అపారమే. ఇంత సంపన్నదేశంలో ఉంటూ మన సంపద మనవే పరిరక్షించుకోలేని స్థితిలో ఉన్నందువల్లే ఇతర దేశీయులు మనల్ని పరిపాలించారు. మనసంపదను, మన జాతి జీవనాన్ని, మాన ప్రాణాలను సర్వం దోచుకున్నారనేది జగమెరిగిన సత్యమే. అలాంటి మన జీవన విధానానికి తూట్లు పొడిచి మనల్ని మనమే బానిసలుగా చేసిన దౌర్భాగ్య విధానానికి కారకులం కొంతవరకు మనమే. ఇతర దేశస్తులు మనపై దండయాత్రలు జరిపినప్పుడు మన రహస్య సంపదను వారికి ఉప్పందించిన దుబాసీలు, స్వల్ప స్వార్థ ప్రయోజనాలకు వారి ప్రాపకం చేరింది మనవాళ్లే. ఇటువంటి వారి చరిత్రలు వెలుగులోకి రావు. కేవలం దండెత్తిన దుర్మార్గులను మాత్రమే గుర్తిస్తాం. వారి ప్రాపకం చేరిన దేశీయులను మాత్రం చూసి చూడకుండా వదిలివేశాం. అయినా మనం జ్ఞాన సంపన్నులుగా మిగిలి పరాయి సేవలోనే తరతరాలు జీవించాం. అలాంటి పరిస్థితులు ఒకసారి మననం చేస్తే భారతదేశాన్ని గ్రీకులు, శకులు, హూణులు ఆపై ఇబ్న్ ఖాశిం, మహ్మద్ ఘజిని(17 సార్లు దండయాత్రలు చేశాడు) మహమ్మద్ ఘోరి, ఇల్టుట్ మిష్, ఖిల్జి, తుగ్లక్, ఇబ్రహీం లోడి, బాబర్,హుమయూన్, షేర్ షా, అక్బర్, జహంగీర్, షాజహాన్, ఔరంగజేబ్, అహమ్మద్ షా ఆపై పోర్చుగీసు, ఫ్రెంచ్, డచ్, బ్రిటీష్వారు వచ్చిభారతదేశాన్ని 1300 సంవత్సరాలు పరిపాలించారు. మన సంపద అన్నివిధాలుగా దోచుకున్నారు. ఒకరకంగా మన అనైక్యత, అసహాయత,అస్తవ్యస్త జీవన విధానం బయటివాళ్ళకు లోకువ అయ్యాయన్నది జగమెరిగిన వాస్తవం.

పదమూడు వందల సంవత్సరాల పరాయి పాలనలో మన సంపద దోచుకోవడమే పరమావధిగా వాళ్లు ఎంచుకున్న విధానం. అన్ని విధాల సుఖ సౌఖ్యాలు భోగ భాగ్యాలు మన సంపదతోనే అనుభవించారు. ఏఒక్కరూ మన మౌలిక జీవన సూత్రాలను అందుకోలేక పోయారు. అడపాదడపా వాళ్ళ ఆనందం కోసం మన సంప్రదాయ, సామాజిక, ఆనువంశిక, జానపద కళలు, ప్రదర్శనా విద్యలు చూసి ఆనందించారే తప్ప ఏఒక్కటీ ఎవ్వరూ చిరస్థాయిగా నిలిపే ప్రయత్నం చేయలేదు. అగ్గిపెట్టెలో ఆరు గజాల వస్త్రాలను ఇమడ్చగల నైపుణ్యాన్ని వాళ్ళు అనుభవించారు లేదా భవితకు లేకుండా చేసిన దుర్మార్గం కూడా చరిత్ర పుటల్లో నిలిచిన దాఖలాలు ఉన్నాయి. ఇంతకన్నా ఎక్కువ సాహిత్య సంపద తాళ పత్రాల్లోనూ, బూర్జ పత్రాల్లోనూ, శిలా శాసనాల్లోనూ, రాగి, తామ్రశాసనాల్లోనూ నిక్షిప్త మయిందే తప్ప సమాజానికి అందుబాటులోకి రాలేదు. మరోకారణం చదువు, విద్యాగంధం కొద్దిమందికి మాత్రమే పరిమితమై బందీ అయిన కారణంగా రహస్య విద్యగానే చాలావరకు మృతి చెందినదన్నది స్తవము కాని వాస్తవము. అలాంటి వాటిల్లో మన ఆయుర్వేదము ఒకటి. మన విజ్ఞాన సంపద అక్షర బద్ధం చేయడానికి దండయాత్రలు చేసి పాలించిన వాళ్లెవరూ ప్రయత్నించలేదు. ఆ దిశగా ప్రయత్నించిన వాళ్ళు ఎవరూ లేరు. మన సాహిత్య సంపద భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు నిధి. దానిని అక్షర బద్ధం చేసి పదికాలాలపాటు భవిష్య నిధిగా చేసింది ఆంగ్లేయుల కాలంలోనే. దేశ వ్యాప్తంగా విస్తరించిన ఆంగ్లేయులు, డచ్, ఫ్రెంచ్, పోర్చుగీసువారి ప్రతినిధులు ఆయా సంస్థల పరిపాలనాధిపతులు, భాషలపై మక్కువ ఉన్న భాషాభిమానులు భారతీయ భాషలను, భాషా సాహిత్య సంపదను వెలికితీసి శుద్ధ ప్రతులు రాయించి, నిఘంటువులు, వ్యాకరణాలు రచించి మేలు చేశారన్నది మనమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో తెలుగు భాష, ప్రాచీనమైన తెలుగు భాషా సాహిత్య సంపదఅంతా వెలికితీసి శుద్ధప్రతులు తయారుచేసి తరతరాలకు తరగని గనిగా చేసిన మహోన్నత వ్యక్తి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (10-11-1798 12-11-1884) సి.పి. బ్రౌన్‌గా తెలుగువారికి సుపరిచితమైన వ్యక్తి భారతీయుడనే అనాలి. ఎందుకంటే ఆయన కలకత్తా నగర శివార్లలోహుగ్లీ నదీ తీరంలో ఉన్న 'ఆల్డీన్' అనే బంగ్లాలో

డేవిడ్ బ్రౌన్, కాలే దంపతులకు నవంబర్ 10 వతేదిన 1798లో జన్మించాడు. బ్రౌన్ జన్మించే నాటికే తండ్రి డేవిడ్ బ్రౌన్ కలకత్తాలోని ఫోర్టు విలియం కాలేజిలోప్రొవోస్టుగా, చాప్లిన్ గా ఉన్నాడు. మహా పండితులయిన కొల్ బ్రూక్, గ్లాడ్ విన్, హీలింగ్టన్, గిల్ క్రిస్ట్, బుకనన్, కేరి మొదలయిన వారితో కలిసి పనిచేశాడు. ఆకళాశాలలో విద్యార్థులకు హిబ్రూ, - సిరియన్, అరబిక్, పర్షియన్, గ్రీకు, లాటిన్ భాషలు బోధించేవారు డేవిడ్ బ్రౌన్ హిబ్రూలో మంచి ప్రావిణ్యం ఉన్న పండితుడు. అందువల్ల కుమారుడైన సి.పి. బ్రౌన్‌ను అన్ని భాషలు నేర్పించాడు. బాల్యం నుంచే వివిధ భాషలపై అవగాహన పట్టుదల ఉన్నందువల్ల అరబ్బీ, పర్షియన్, హిందుస్తాని, సంస్కృతం కూడా నేర్చుకున్నాడు. బాల్యంలోనే వాల్టర్ స్కాట్ నవలలు వే, మర్మియన్ చదివాడు. తామస్ మూర్ రచనలు, బైరన్ కవితలు మొదలయిన సాహిత్యం చదివి అవగాహన చేసుకుని పండితులతో చర్చించేవాడు. దీనికి తోడు బాల్యం నుంచే తండ్రి సారథ్యంలో పరిష్కరించే పుస్తకాలకు తప్పొప్పులు చూసి సవరించడం, గ్రంథాలలో లుప్తమయిన భాగాలను పూరించడం, మరికొన్ని పుస్తకాలను సవరించి, క్రమానుగుణంగా సరిచేయడం లాంటి పనులు చేసేవాడు. ఇది ఉత్తరోత్తరా తన తెలుగు గ్రంథాలు పరిష్కరించే పనికి బాగా ఉపయోగమయింది. తండ్రి నేతృత్వంలోనే అమూర్వ గ్రంథాల సేకరణ వాటిని పరిష్కరించిప్రచురించడం లాంటి పనులన్నీ తండ్రి వద్దనే నేర్చుకున్నాడు. ఇదంతా పన్నెండేళ్ళలోపు వయస్సులో బ్రౌన్ నేర్చిన మంచి పని. దానికి తోడు తండ్రి సేకరించిన నూరు ఫోలియో గ్రంథాలను ఫోర్ట్ విలియం కళాశాలకు దానం చేయడంలో బ్రౌన్ చేయూత కూడా ఉంది. తండ్రి ప్రాపకంలో ఎందరెందరో పండితులతో కలిసి పనిచేసే అవకాశం కలిగింది. దీనివల్ల పండితుల నుంచి విషయ సేకరణ ఎలా చేయాలనేదానిపై సమగ్రమైన అవగాహన ఏర్పడింది. దానికి తోడు కలకత్తాలో వారి బంగ్లాకి దగ్గరల్లో ఉన్న శ్రీరామపురం(సిరంపూర్)లో విలియం కేరి, వార్డ్, మార్ష్మన్ అనేవారు 42 భాషల్లో పోత అక్షరాలు తయారు చేయడం వివిధ భారతీయ భాషలలో నిఘంటువులు, సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక గ్రంథాల ముద్రణం చేయడం కళ్ళారా చూశాడు. దీనికితోడు కుంఫిణి పురోహితులు, పండితులు అయిన క్లాడియస్, బుకనన్, తామస్ ట్రూబడి తామ్సన్, హెన్రీ మార్టిన్, డేనియల్, కేరి వంటి మేధావులతో పరిచయం కలిగింది. సి.పి. బ్రౌన్ సాహిత్య భాషా పాండిత్యం వృద్ధి చెందే క్రమంలో విధి వక్రించింది. తండ్రి డేవిడ్ బ్రౌన్ అనారోగ్యం వల్ల 1812లో మరణించాడు. అప్పటికి సి.పి.బ్రౌన్‌కి పద్నాలుగేళ్ళు. ఆ పరిస్థితులలో తల్లి తన బిడ్డలను తీసుకుని ఇగ్లండ్ వెళ్లింది. నిజానికి ఇంగ్లడ్ వెళ్లే సమయంలో వాళ్ళకి ఛార్జీలకు కూడా డబ్బులు లేని పరిస్థితి. అందుకు రెవరెండ్ చార్లెస్ సిమియన్ అనే మిషనరీ నేతృత్వంలో బ్రౌన్ తల్లి సంపాదకత్వంలో డేవిడ్ బ్రౌన్ జీవిత చరిత్రను, ఆయన నెలకొల్పిన బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ చరిత్రను, సి.పి. బ్రౌన్ బాల్య దశలో తండ్రికి తోడ్పడిన సాహిత్య, చారిత్రక అంశాలను, కళాశాల ప్రొవోస్ట్ గా బహుభాషా పండితునిగా చేసిన సేవలను ధర్మబడుల స్థాపన మొదలయిన విషయాలు వివరించే 'మెమోరియల్ స్కెచెస్' అనే గ్రంథం వెలువరించారు. ఇది వంద రూపాయల చొప్పున 190 మంది కొన్నారు. ఈ డబ్బు వారి ప్రయాణానికి చాలకపోతే కలకత్తాలోని 'ఓల్డ్ చర్చ్ ఇవాంజలికల్ ఫండ్' నుంచి కొంత అప్పుగా తీసుకున్నారు. ఆడబ్బు బ్రౌన్, తన సోదరుడు జార్జ్ కలిసి తర్వాత చెల్లించారు. అటువంటి పరిస్థితుల్లో వారు ఇండియానుంచి ఇంగ్లండ్ వెళ్ళారు. భర్త అభీష్టం మేరకు తల్లి తన బిడ్డలను హెయిల్ బరి కాలేజిలో చేర్పించింది. భారత దేశంలో తమ కొలువులో మరణించిన వారి పిల్లలకు, కుటుంబానికి ఆసరాగా నిలిచి ఆర్థిక సాయం చేసేవారు. ఆవిధంగా సి.పి.బ్రౌన్ తనసోదరుడు ఇంగ్లండ్లో సివిల్ సర్వీస్ చదువులు పూర్తి చేశారు. కుంఫిణీవారు తమ కొలువులో సివిల్ సర్వీసు నమోదయినవారు భారత దేశంలో ఏ ప్రాంతంలో పనిచేయాలో ముందుగానే నిర్ణయించేవారు. కృతార్థుదయ్యాక ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ని మద్రాసుకు ఎంపిక చేశారు. 1816 జూన్ 30 వ తేదిన మద్రాస్ సివిల్ సర్వీస్ రైటర్‌గా పంపించారు. 1817 ఆగష్టు 4 వ తేదిన కర్ణాటెక్ ఓడలో చెన్న పట్టణం చేరిన బ్రౌన్ జీవితం భారతదేశంలో పున: ప్రారంభమయింది. బాల్యమంతా బెంగాల్ రాష్ట్రంలో గడిచింది. యవ్వన ప్రాయానికి దక్షిణ భారతదేశంలో అడుగు పెట్టాడు. ప్రతి సివిల్ సర్వెంట్ రెండు ప్రాంతీయ భాషలు తప్పనిసరిగా నేర్చుకోవాలి అనే నిబంధన ఉంది. పైగా పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలనే నియమం ఉంది. అందుకోసం ఆయన ఆగష్టు 13వ తేదిన కళాశాలలో చేరి తెలుగు, మరాఠి భాషల అధ్యయనం చేయడం ప్రారంభించాడు. నిజానికి బ్రౌను అప్పటివరకు తెలుగు భాష ఒకటి ఉందనే విషయం తెలియదు. తెలుగువారి అదృష్టం కొద్ది బ్రౌన్ మహాశయుడు తెలుగు అధ్యయనం చేయడం మన భాషకు లభించిన వరం.

విద్యార్థి జీవిత ప్రారంభంలో కొందరు కొంత వెనుకబడినా, స్వయం కృషి పట్టుదల ఉంటే ఏదయినా సాధిస్తారు. అదే స్థితి, పరిస్థితి సి.పి.బ్రౌన్‌కి ఏర్పడింది. ఆయన తెలుగు నేర్చుకుందామనికళాశాలలో చేరితే అక్షరాభ్యాసం చేయించినవాడు వెలగపూడి కోదండరామ పంతులు. చేరిన నాలుగు నెలలకే అర్థ సంవత్సర పరీక్షలు 1817 డిసెంబర్లో జరిగాయి. అప్పుడు బ్రౌనికి మంచి మార్కులు రాలేదు. 1818 జూన్లో అర్థ సంవత్సర పరీక్షల్లోనూ ప్రతిభ కనబరచలేదు.

పోనీ తెలుగుతో పాటు మరో ప్రాంతీయ భాష అయిన మరాఠి బాషలోకూడా శ్రద్ధ చూపలేకపోయాడు. ఇక్కడే బ్రౌన్ లేఖల్లోనూ, ఆయన రాసిన డైరీల్లోనూ ఒక విషయం స్పష్టంగా ఉంది. ప్రజలు మాట్లాడే భాషకి, పుస్తకాల భాషకి, పండితులకు బోధనకు చాలా అంతరం గమనించాడు. దీన్ని మనం వ్యావహారిక - గ్రాంథిక భాష అంటున్నాం. దీనివల్ల బ్రౌన్ చదువుపై శ్రద్ధ మాటల అర్థాలు, వ్యాకరణ సూత్రాలు, భావ వ్యక్తీకరణ కొంచెం క్లిష్టంగానే ఉందన్నాడు. అతి కష్టం మీద 1820 జూన్ నెలలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఈ నేపథ్యంలో బ్రౌన్ కన్నా ఒక ఏడాది ఆలస్యంగా చేరిన జె.సి.మారిస్ తెలుగు, హిందుస్థాని పర్షియన్ భాషల్లో ప్రావీణ్యం చూపించాడు. అనంతర కాలంలో ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు నిర్మాణానికి మారిస్నే కుంఫిణీ

వారు ఎంపిక చేశారు. ఈ పరిస్థితుల్లో 1820 జూన్ నెలలో తామస్ మన్రో ఉత్తీర్ణులయిన విద్యార్థులతో సభా కార్యక్రమం నిర్వహించారు. ఆ సభలో దేశ భాషల్లో వ్యావహార జ్ఞానం లేకపోతే చదివిన చదువంతా వ్యర్థం. భాషా జ్ఞానం వలన సమాజ పురోగతి మార్పు గమనించవచ్చు. భాష వల్ల సమాజాన్ని సన్మార్గంలో నడిపించవచ్చని చెప్పాడు. నిజానికి ఇది ఒక స్నాతకోత్సవ ప్రసంగం లాంటిది. ఈ మాటలు బ్రౌన్‌కి బాగా వంటబట్టాయి. అంతే భాషా నైపుణ్యంతో భావి జీవితం కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నాడు. అనంతరం 1820 ఆగష్టు 8వ తేదిన కడప జిల్లా కలెక్టర్ హన్బరీకి అసిస్టెంట్‌గా నియమితుడయ్యాడు. హన్బరీ దొర తెలుగులో ధారాళంగా మాట్లాడేవాడు. ఈయన భాషా పాండిత్యం బ్రౌన్‌కి కొంత ప్రేరణ, ఉత్సాహాన్నిచ్చింది. ఇంత భాషా వ్యావహారిక జ్ఞానం ఉన్నా ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రజలతో కలసిమెలిసిన సంభాషణలన్నీ మునీల ద్వారానే జరిగేది. మునీల పెత్తనం కొంచెం ఎక్కువగానే ఉన్నట్టనిపించింది. అసిస్టెంట్‌గా పనిచేసే కాలంలోనే బ్రౌన్ వ్యావహారిక భాషా పరిజ్ఞానంలో మెలకువలు తెలుసుకున్నాడు. ప్రజలతో మమేకమై తెలుగు భాషపై పట్టు సాధించాడు. ఈనేపథ్యంలో తన తండ్రి డేవిడ్ బ్రౌన్ కలకత్తాలో స్థాపించిన 'ధర్మబడి' విషయం గుర్తుకొచ్చింది. అదే తడవుగా తెలుగువారికి రెండు ధర్మబడులు ప్రారంభించాడు. దీనివల్ల ఆపాఠశాలల్లో భాషా నైపుణ్యం ఏర్పడింది. విద్యార్థులతో, ప్రజలతో మమేకమై భాష పై పట్టు సాధించాడు. 1922 అక్టోబర్ 22 నాటికి బ్రౌన్ మచిలీపట్నం జిల్లాకు రిజిస్ట్రార్‌గా నియమితుడయ్యాడు. ఇక్కడకూడా మున్షీలదే పెత్తనం దానికితోడు అధికారులయిన 'కోర్టునాజరు' మరికొందరు ఉద్యోగులు కలిసి చేసే అవినీతి, లంచగొండితనం చూసి వారిని బర్తరఫ్ చేశాడు.

స్థానికులయిన వాళ్ళు ఎప్పుడూ ఏదో ఒకరి పక్షం వహించి వారి ప్రాపకంలో లంచాలు తినే అలవాటును సహించలేకపోయాడు. లంచాలు తినే వాళ్ళు స్థానికులను రెచ్చగొట్టి బ్రౌన్ మీదికి ఉసిగొలిపారు. దీనివల్ల స్థానికుల్లో కొంత వ్యతిరేకత వచ్చింది. ఇక్కడ వారి దృష్టి మరల్చడం కోసం రెండు ధర్మబడులు ప్రారంభించాడు. ప్రజల మన్ననకు పాత్రుడయ్యాడు. ఈలోగా 1823 జూన్ నెలలో ఆరువారాలు సెలవుపై మద్రాసు వెళ్లాడు. అక్కడ పుస్తకాల అన్వేషణలో అబెదుబాయ్ (1770-1848) అనే పోర్చుగీసు మిషనరీ హిందువుల ఆచార వ్యవహారాలపై ఫ్రెంచ్ భాషలో రాసిన ఒక గ్రంథం దొరికింది. ఆ పుస్తకంలో రాయలసీమకు చెందిన వేమన అనే గొప్ప కవి ఉన్నాడని, ఆయన పద్యాలు సమాజాన్ని, మూఢవిశ్వాసాలను, అంధ ఆచారాలను తొలగించే గొప్ప సాహిత్య సృజన చేశాడని రాశాడు. అది చదివి మచిలీపట్నం కోర్టులో సదరు అమీనుగా ఉన్న తిప్పాభట్ల శివశాస్త్రికి చెప్పి వేమన పద్యాలు తెప్పించుకున్నాడు. అన్నీ తాళ పత్రాల్లోనే ఉన్నాయి. వాటిని కనకాద్రి అనే లేఖకుడి ద్వారాకాగితాలపై రాయించాడు. ఈ లోగా తెలుగు ప్రాంతాల్లో లభించే వేమన పద్యప్రతులన్నీ తెప్పించి వాటికి శుద్ధ ప్రతులు తయారు చేసి ఇంగ్లీషులోకి అనువదించాడు.

- తరువాత భాగం వచ్చే సంచికలో

గిడుగు

జాతికి దిక్సూచి గిడుగు

గిడుగు వారి అసలు పేరు గిడుగు వేంకట రామమూర్తి గారు. రావుబహదూర్ అనేది అతని సేవా దృక్పథాన్ని మెచ్చి ప్రభుత్వం వారు అతనికి గౌరవ సూచకంగా ఇచ్చిన బిరుదు. అతడు పుట్టింది 1863వ సంవత్సరం ఆగస్టు 29 రోజున శ్రీకాకుళం జిల్లాలోని ముఖలింగం క్షేత్రం దగ్గరి పర్వతాలపేటలో. చదువుకున్నది మాత్రం వాళ్ళ మేనమామ గారి ఊరు విజయనగరంలోని మహారాజావారి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో. గురజాడ అప్పారావు గారి సహవాసం అబ్బింది కూడా అక్కడే. అందుకే చిన్నప్పుడు చదువుకొనే రోజులలోనే ఆయనలో వాస్తవిక దృక్పథం సత్యాన్వేషణ వేళ్ళూనుకొంది. అదే ఆయన సంఘసంస్కర్తగానూ హేతువాదిగానూ ఎదగడానికితోడైంది.

అంటరాని వాళ్ళుగా ఉండే సవరలను చేరదీసి తన ఇంట్లోనే వసతీ భోజనాలను ఏర్పాటు చేసి వాళ్లు రోజూ మాట్లాడుకుంటుండే సవర భాషలోనే వారికి చదువు చెప్పాడు.

అప్పటి స్కూళ్లలో చెప్పే తెలుగుభాష మాత్రం అంతా గ్రాంధికంలోనే ఉండేది. ఆ భాషను వినేవాళ్ళు ఆ భాషను తమ వాడుక భాషలోకి మార్చుకొని అర్థం చేసికొనే వాళ్ళు.

మళ్లీ పరీక్షలు వ్రాసేటప్పుడు మాత్రం ఇప్పటి విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో తమ మాతృభాషలో ఉండే భావాలను ఇంగ్లీషులోకి అనువాదం చేసుకుని రాస్తున్నట్లే తమ భావాలను గ్రాంధికంలోకి తర్జుమా చేసుకుని రాస్తూ ఇబ్బంది పడేవారు. **ఒకే భాషలో ఉండే ఈ తేడాలను సహించని గిడుగు వారు గ్రాంధిక భాష పైనా ఆ భాషను సమర్థించే పండితులపైనా తిరుగుబాటుచేసి తెలుగు భాషకున్న సంకెళ్లను తెంచివేశాడు.**

ఊరూరా సభలను పెట్టి వాడుక భాషలోనే ఉపన్యాసాలిచ్చి జనాన్ని మెప్పించాడు. అప్పట్లో గిడుగు వారికి తోడుగా నిలిచింది అప్పటి స్కూళ్ల ఇన్స్పెక్టర్ జె.ఎ. ఏట్స్ దొర, పిటి శ్రీనివాస అయ్యంగార్, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం వంటి భాషోద్యమకారులు. వాళ్ళ సహేతుకమైన ఉద్యమానికి చివరకు ప్రభుత్వం గూడా దిగివచ్చి వారి వాదనలను అంగీకరించింది. మనమిప్పుడు స్వేచ్ఛగా వాడుక భాషలోనే వార్తలనూ కవిత్వాలనూ కథలనూ రాస్తున్నాం వింటున్నామంటే అది కేవలం గిడుగువారి చలువ వల్లనే. నిత్య జీవితంలో స్త్రీ పురుషులం స్వేచ్ఛగా దూసుకు పోతున్నామంటే కేవలం సినిమాలలో వాడే భాషతో మనం మమేకమై పోతున్నామంటే అందుకు కారణం మొదటగా మనం భాషలో సాధించిన స్వేచ్ఛ వల్లనే. అంతకు ముందు స్త్రీలకు స్వేచ్ఛ అనేదే ఉండేది కాదు. కూపస్థ మండూకాలలాగా ఉండేవారు. లోక జ్ఞానాన్ని సంపాదించుకునే అవకాశమే ఉండేది కాదు. స్త్రీల స్వేచ్ఛ కారణంగానే కుటుంబమూ సమాజమూ మన జాతి అన్ని రంగాలలోనూ విజయ పథంలో దూసుపోతున్నది. దేశం అన్ని రంగాలలోనూ పురోగతి సాధించడానికి మంచి అవకాశం ఏర్పడింది గూడా.

శ్రీలక్ష్మి కూచిభొట్ల
9959979894

సి.వి. క్రిష్ణయ్య
93965 14554



ఎవరు తెలివి గలవారు?! 10

జరిగిన కథ:

కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకొన్నారు జంతు పక్షిజనాలు. ఆడవిలో పిల్లలకు అనేక మానసిక శారీరక అనారోగ్య సమస్యలు వచ్చాయి. తొలకరి వానలు కురవడంతో అడవిలో మొలకల పండుగ వచ్చింది. ఈ పండుగ సందర్భంగా అడవిలో ఆనందంగా ఆటల ప్రదర్శనలు జరిగాయి. బడిలో పరీక్షలూ, మార్కులు నిషేధించారు. శిక్షలు బహుమతులు కూడా నిషేధించారు. పిల్లలు ఎలా నేర్చుకుంటారో, ఎలా నేర్చుకోరో తెలుసుకున్నారు.

దుర్బలుడైన మనిషి

చుక్కల గుర్రం మరోసారి అడవిజనాల్ని మనుషుల ప్రపంచంలో ప్రవేశించి, మంచి బడి ఎలా ఉండాలో తెలుసుకొని రమ్మని విజ్ఞప్తి చేసింది. "మిత్రులారా అందరూ ప్రవాహంలో కొట్టుకునిపోరు. ఏటికి ఎదురీదే వాళ్లు ఉంటారు. ఈ సాంప్రదాయ బడులకు విరుద్ధంగా ఎక్కడో ఒకచోట కొత్త పద్ధతుల్లో చదువులు చెప్పే బడులు ఏర్పాటు చేసి ఉంటారు. అలాంటి బడులను వెతికి పట్టుకోండి. ఆ పిల్లల ప్రవర్తనను పరిశీలించండి. తల్లిదండ్రులను అడగండి. బడి మధ్యలో మానేసిన పిల్లల్ని, పెద్దల్ని బడి ఎలా ఉండాలో అడగండి. చివరగా శుకశ్రేష్టులు మన చిలుక గారు మాట్లాడతారు అంటూ తన ఉపన్యాసం ముగించింది చుక్కల గుర్రం.

రంగుల చిలుక ఎగురుకొంటూ వచ్చి అందరికీ అభివాదం తెలిపింది. 'ప్రజలారా మన ముందు పెద్ద సమస్య ఉంది. మనం మాటి మాటికి బడి గురించి మనిషి గురించి మాట్లాడుకోక తప్పడం లేదు. అవునన్నా కాదన్నా మనిషి కథానాయకుడి స్థానంలో ఉన్నాడు. కథానాయకుడు దారి తప్పకూడదు. కథానాయకుడు గెలిస్తేనే కథ సుఖాంతమవుతుంది.

మనిషిది తనివి తీరని విజ్ఞాన దాహం. ఆ దాహాన్ని తీర్చేది బడి. అలాంటి బడిలో విజ్ఞులు శ్రేష్ఠమానవులు తయారు కాకుండా కర్మాగారాలలో పనిచేసే కూలీలను మాత్రమే తయారు చేయడం విషాదం. అలాగని అన్ని విషయాలలో బడిని ఒక్కదాన్నే తప్పుపట్టలేం. మనుషుల గురించి మరో విషయం తెలుసుకోవాలి. మనుషులు రోగిస్టులుగా మారి శక్తి లేని దుర్బలులు కావడానికి కారణం ఏమిటి?


భయంకరమైన అంటువ్యాధులను, యుద్ధాలను. కరువుకాటకాలను , జలప్రళయాలను, భూకంపాలను, మంచుయుగాలను, రాక్షసబల్లుల కాలాన్ని దాటుకుని అజేయుడిగా నిలిచాడు. అంతటి శక్తిమంతుడు ఇప్పుడు కంటికి కనిపించని అర్ధజీవి చేతుల్లో విలవిలలాడి పోతున్నాడు. లక్షలాది మంది మృత్యువాత పడ్డారు. ఆర్థిక సామ్రాజ్యాలు కూలిపోయాయి. ఎందుకని? అతని రోగనిరోధక శక్తిని ఏయే కారణాలు హరించాయి. అతని తిండి, అలవాట్లు కూడా పరిశీలించండి. ఆలస్యంచేయకుండా రంగంలోకి దిగండి. మనుషుల మధ్య ఉండగల్గిన వారు మాత్రమే వెళ్లండి. నాగరికతకు దూరంగా ఉన్న కొండకోనల్లో నివాసముంటున్న ప్రజలను కూడా పరిశీలించండి. అందరికి శుభం కలగాలని కోరుకొంటున్నానని సభ ముగించింది చిలుక.

చిలుక చెప్పిన మాటలు విన్న పక్షిజంతుజనాలలో మనుషులు మధ్య నివసించగల పిల్లులు, కుక్కలు, కోళ్లు, పావురాళ్లు, బాతులు, మేకలు, గొర్రెలు, బర్రెలు, ఆవులు, గాడిదలు ఒక చోట చేరారు. ఎవరు బడి గురించి, సమాచారం సేకరించాలో, ఎవరు మనిషి ఆరోగ్యం, ఆహారం గురించి తెలుసుకోవాలో, ఎవరు ఏయే ప్రాంతాలకు వెళ్లాలో పని విభజన చేసుకొన్నారు. మనుషుల నివాసాలలోకి ఇళ్లల్లోకి ప్రవేశిందానికి ఏమేమి చెయ్యాలో మాట్లాడుకొన్నారు. అడవి జనాలకు వీడ్కోలు చెప్పి మనుషుల నివాసాలవైపు ప్రయాణమయ్యారు.

మనుషుల ఇళ్ల ముందుకెళ్లి పిల్లల దృష్టిలోపడి వారికి చేరువై రకరకాల శబ్దాలు చేసి, విన్యాసాలు చేసి, వారికి ఆనందం కల్గించి ఇళ్లలోకి సులభంగా ప్రవేశించారు. సెల్‌ఫోన్లతో, టీవీలతో విసిగిపోయిన జనం జంతువుల్ని పక్షుల్ని దగ్గరకు తీసి ఆనందించారు.

వెంటనే జంతు పక్షి జనాలు పని ప్రారంభించారు. మనుషులు తినే తిండి, రోజువారి పనులు అన్నీ పరిశీలించారు. బడుల్ని, బడుల్లో పిల్లల్ని, వారు ఎలా చదువుతున్నారో బడి చదువులు అంటే వారు ఆనందంగా ఉన్నారా, బాధగా భయంగా ఉన్నారా అన్న విషయాలను తమ సూక్ష్మబుద్ధితో గ్రహించారు.

ఒక విచిత్రపరిస్థితి ఏర్పడింది. మనుషులు మాట్లాడుకోవడం బాగా తగ్గిపోయింది. టివీలు, సెల్‌ఫోన్లలోను ఇంటర్నెట్‌లోనూ మనిషి కాలం గడపడం వలన విషయసేకరణ ఆలస్యమవుతూ వచ్చింది. ఎట్టకేలకు పని ముగించుకొని అడవి దారి పట్టారు. ఇందుకు ఏడాది కాలం పట్టింది. మనుషులతో ఏర్పడిన అనుబంధం తెంచుకొని



వెళ్లుతున్నందుకు బాధపడుతూ, స్వచ్ఛమైన ప్రకృతిలోకి వెళుతున్నందుకు ఆనందపడుతూ చివరకు అరణ్యంలోకి ప్రవేశం చేసారు.

అడవికి చేరిన రెండోరోజు నుంచి మనుషుల దగ్గర కెళ్లిన వాళ్లంతా ఒక చోట చేరారు. సేకరించిన సమాచారాన్ని సమీక్షించారు. ఈ సమీక్షలో అందరి అనుభవాలు వినడానికి చుక్కల గుర్రం, రంగుల చిలుక వచ్చి కూర్చున్నారు. ఇందుకోసం వారం రోజులు పట్టింది. వాతావరణం సానుకూలంగా ఉన్న రోజు రెండో సభకు కొనసాగింపుగా మూడో సభ ఏర్పాటు చేశారు. ఈ సారి సభను ప్రారంభించవలసినదిగా వృద్ధ గోమాతను పిలిచారు. గోవు అందరికి నమస్కరించి సభను ప్రారంభించింది.

“సభా సదులారా! మన జనాలు మనుషుల దగ్గర అద్భుతమైన సమాచారం సేకరించుకొని వచ్చారు. అందరూ శ్రద్ధగా వినాలి. ఎవరు ఏం చెప్పాలో నిర్ణయించుకొన్న ప్రకారం మాట్లాడతారు. ఇది ఏ ఒక్కరి అభిప్రాయమో గాదు. అందరి అభిప్రాయాలు. ముందుగా ఏకసంథాగ్రాహి బహుముఖ ప్రజ్ఞాశాలి మార్జాలంగారు మాట్లాడతారు” అంటూ నల్ల పిల్లిని పిలిచారు.

నడివయస్సులో ఉన్న ఒక నల్లని రంగుగల పిల్లి గంభీరమైన నడకతో వేదిక మీదకి వచ్చి నిలబడింది. రాజుగారికి సభా సదులకు నమస్కారం చేసింది. “సభాజనులారా! మనుషుల రోగనిరోధక శక్తి నశించడానికి, దుర్బలుడై అనేక జబ్బులకు గురికావడానికి చాలా కారణాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనవి ఐదు కారణాలు. ఈ ఐదు కారణాలు నేను స్వయంగా పరిశీలించి నా అనుభవంలోనికి కూడా వచ్చినవని మనవి చేస్తున్నాను. అవి 1. ఆహారం. 2 నిద్ర. 3 శృంగారం. 4 శారీరక శ్రమ. 5 అలోచనలు. – ఇవన్నీ దారితప్పాయి. ఒక్కోదాని గురించి క్లుప్తంగా వివరిస్తాను.

1. **ఆహారం:** ఆహారాన్ని విషపూరితంగాను, నిస్సారంగాను చేసుకొన్నాడు. అధికోత్పత్తి కోసం, కృత్రిమ విత్తనాలు, కృత్రిమ ఎరువులు ఆహార పంటలను పండ్లను నిస్సారం చేస్తే, పురుగు మందులు విషపూరితం చేసాయి. వండే వంటల్లో వాడే నూనెలు చక్కెరలు, రంగులు, నిల్వ రసాయనాలు మరింత విషపూరితం చేసాయి. ఒక రకంగా అతను తింటున్నది గరళమే.

2. **నిద్ర:** నిద్ర అనేది పిల్లల్లో పెరుగుదలకు శరీర అవయవాల మరమ్మత్తుకు, శక్తి కూడగుట్టుకోడానికి పనికి వచ్చే సహజమైన ఔషధం. చీకటి పడగానే నిద్రించి వెలుగురాకముందే నిద్రలేవడం జీవుల సహజ లక్షణం. కాని ఏ అర్ధరాత్రో నిద్రకు ఉపక్రమించి చాలినంత నిద్ర లేకుండా జీవనం సాగిస్తున్నాడు. కలతలు లేని గాఢమైన నిద్రలేకుండా బ్రతుకుతున్నాడు. నయంగాని జబ్బులకు నిద్రలేమి కూడా ఒక కారణం.

3. **శృంగారం:** స్త్రీ పురుషుల సంబంధంలో సృష్టికార్యం ఎంతో గొప్పది. అద్భుతమైనది. దాన్ని పాపకార్యంగా ప్రచారం చేసి జుగుప్సాకరంగా చేయకూడని తప్పుగా చిత్రీకరించుకొని నిజంగానే పాపం చేసాడు. దాన్ని వ్యాపారంగానూ మార్చాడు. మానసికానందంలేని పాపకార్యం అయిపోయిది. జీవితాంతం అసంతృప్తితో ఆరని మంటగా

మారింది– అతని శృంగార జీవితం.

4. **శారీరక శ్రమ:** శరీరంలో ప్రతి అవయవం ప్రతి కణం జీవంతో తొణికిసలాడుతూ ఉండాలి. ఇందుకు దోహదం చేసేది కదలికలు. పిల్లలైతే ఆటలద్వారా, పెద్దలైతే పనుల ద్వారా శరీరాన్ని తాజాగా ఉంచుకోవాలి.

కాని ఆటలు పనికిరావని, పనులు చేయడం అగౌరవమని భావించే సంస్కృతి వ్యాపించింది. దీనికి తోడు ఒక చోట కూర్చుని చేసే పనులు ఎక్కువయ్యాయి. వీధి వీధికి వ్యాయమశాలలో, ఆటల మైదానాలో ఉండాలి. మారిన జీవన పద్ధతులకు ఇవి అవసరం. అసలు దీని ప్రాధాన్యతే గుర్తించడంలేదు. కదలికలు లేని శరీరాలు తుప్పులాంటి కొవ్వు పేరుకొని రోగగ్రస్తమవుతున్నాయి.

5. **మంచి ఆలోచనలు** – పరుగుల జీవితం, పోటీలు పడడం ఒకరిని మించి పోవాలనే ఆలోచనలు మనిషిని అసూయపరుడిగా మారుస్తున్నాయి. పసితనంలో పరీక్షలు, మార్కులు, ర్యాంకుల భయం వెంటాడితే, పెరిగి పెద్ద వాళ్లయిన తర్వాత సంపాదన భయంతో వత్తిడికి గురవుతున్నాడు. నిరంతరం భయం. తన నీడను చూసుకొని తానే భయపడుతున్నాడు. భయపడే వాళ్లకు, దిగులుతో ఉన్న వాళ్లకు, మానసిక ఆందోళనలు ఉన్న వాళ్లకు జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. తిన్నది అరగదు. కడుపులో ఉండే రసాయన పదార్థాలు శరీర అవయవాలను చుట్టుముట్టి అనేక రోగలక్షణాలు కన్పిస్తాయి. అసలు జబ్బేమిటో ఎవరికీ అర్థం కాదు. మరింత మానసిక ఆందోళనకు గురై సరైన ఆలోచనలు చేయలేడు.

తినే ఆహారం, తాగేనీళ్లు, పీల్చే గాలి, నివసించే నేల, చేసే ఆలోచనలు అన్నీ కలుషితమే. విషపూరితమే. వీటిని తట్టుకొని మనిషి ఇంత కాలం బ్రతికి ఉండడం ఆశ్చర్యమే.

ఇంకా ఆశ్చర్యం గొల్పే విషయం ఏమిటంటే ఈ విషయాలన్నీ మనిషికి తెలుసు. కాని నిస్సహాయకుడిగా మారిపోయాడు. ఇక చేసేది ఏమి ఉంది? అంటూ తన ప్రసంగం ముగించింది నల్లపిల్లి.

మనిషి నవ్వులు, ఏడ్పులు గురించి చెప్పిన తెల్లపావురం–

అవు తెల్ల పావురాన్ని ఆహ్వానించింది. తెల్లటి మల్లెపువ్వులా ఉన్న పావురం రెక్కలాడిస్తూ సభా ప్రాంగణమంతా వెలుగులు నింపగా వేదిక మధ్య నిలుచున్నది. తాను తెలుసుకొన్న సంగతి చెప్పడం ప్రారంభించింది. ప్రకృతి ఏ జీవికి ఇవ్వని అద్భుతవరాలు మనిషికి ఇచ్చింది. శరీరాన్ని తనకుతాను మరమ్మత్తు చేసుకొనే నిద్రను ఇచ్చింది. దాన్ని పాడుచేసుకొన్నాడు. బ్రహ్మానంద భరితమైన శృంగారాన్ని పాపంగా శాపంగా మార్చుకొన్నాడు. అద్భుతమైన ఆలోచనలు చేసే మెదడును ఆందోళనకరంగా మార్చుకొన్నాడు! అయినా బాధలను కష్టాలను మరిచిపోయే నవ్వు, ఏడ్పు అనే మరో రెండు వరాలు అతని దగ్గర ఉన్నాయి. వీటితో అతను ఆనందంగా, ఆరోగ్యంగా ఉండగలడు – కాని వీటినిగూడా శాపాలుగా మార్చుకొన్నాడు.

నవ్వు ఎంతో అద్భుతమైనది. మామూలు చిరునవ్వులో ముసిముసి నవ్వులో కాదు. పగలబడి నవ్వాలి. పొట్టచెక్కలయ్యేట్లు నవ్వాలి. కడుపుబ్బ నవ్వాలి, పసి బిడ్డలు హాయిగా నవ్వినట్లు నవ్వాలి. ఇలాంటి నవ్వే బ్రహ్మానందం. ఈ నవ్వు అన్ని దిగుళ్లను, బాధలను, మరుగునపడేటట్లు చేస్తుంది. మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. కాని మనిషి ఈ నవ్వును మరిచిపోయాడు. అలా నవ్వడం అనాగరికమని భావిస్తున్నాడు. క్రమక్రమంగా నవ్వునే మరిచిపోయాడు. నవ్వడం చేతగాత నవ్వుల సంఘాలు పెట్టుకొని, రాని నవ్వులను పెద్దగా అరుస్తూ వెకిలి నవ్వులు నవ్వుతున్నాడు. రెండవది ఏడ్పు – ఏడ్పు ఎంతో గొప్ప వరం. పెద్ద కష్టం వచ్చింది. ప్రమాదం వచ్చింది. ఆస్తులు కోల్పోయారు అంతులేని బాధ చుట్టుముట్టింది. ఏడ్పు పెల్లుబికిరావాలి. ధారాపాతంగా కన్నీరు కార్చాలి. ఆ బాధ కన్నీరులో కొట్టుకుపోవాలి. ఒకరకమైన మనోనిబ్బరానికి రావాలి. కాని మనిషి ఏంచేస్తున్నాడు. పెద్దగా ఏడ్వడం, కన్నీళ్లు పెట్టుకోవడం అనాగరికమంటూ ఏడవడం తప్పని దుఃఖాన్ని దిగమింగుకొని కన్నీళ్లను కూడా మింగుతున్నాడు. వాటిని బయటకు పోనీయడంలేదు. ఆ ఏడుపు తనకు రాకపోతే ఊరకుండాలి. తనకు మారుగా కూలీలను బెట్టి ఏడ్చినందుకు డబ్బులిస్తున్న మనిషి ఎంతగా చెడిపోయాడో ఇంతకంటే ఏమి రుజువుకావాలి.

మనుషుల సహజస్వభావం ఒకటి ఉంది. ఏడ్చేవారిని చూసి తనూ ఏడవాలి – నవ్వే వారిని చూసి తానూ నవ్వాలి. ఇవి రెండూ తిరగబడ్డాయి. ఏడ్చేవారిని చూసి లోలోపల సంతోష పడుతున్నాడు. ఇతరులు నవ్వుకోవడం చూసి లోపల ఏడుస్తున్నాడు.

మనిషి శరీరంలోకి ఇన్ని జబ్బులు ప్రవేశించి దుర్బలుడిని చేయడానికి ముఖ్యకారణం అతను సంతోషంగా లేకపోవడమే. లోలోపల గూడుకట్టుకొన్న అసంతృప్తి అగ్నిజ్వాలలు అతన్ని దహించి వేస్తున్నవి. ఈ అసంతృప్తి జ్వాలలకు కారణం ఏమిటో తెలిసికోవాలి. అంటూ తెల్లపావురం తన ప్రసంగం ముగించింది. తెల్ల పావురం చెప్పిన మాటలు విని మనుషులు ఎంత దురదృష్టవంతులోనని అందరికీ జాలి కల్గింది. ఇంత ఆనందమైన జీవితాన్ని పాడుచేసుకొంటున్నవాడిని తెలివిగలవాడని ఎలా నమ్మడం. అని పక్షి జంతుజనాలు ఆలోచనల్లో పడ్డారు.

మనిషి లయకారకుడని చెప్పిన వృద్ధ శునకం

అవు ఒక వృద్ధ శునకాన్ని ఆహ్వానించింది. ముసలిదైన ఆ కుక్క మెల్లగా నడిచి వచ్చి నిలబడింది. దాని చెవులు పొడవుగా మెడవరకూ వాలిపోయి ఉన్నాయి. దాని దవడలు కిందికి జారిపోయాయి. కనురెప్పలు వాలిపోతున్నాయి. దాని మాటలు మాత్రం కొండగుహాలో నుండి వచ్చినట్లు గంభీరంగాను భీతి గొలిపేటట్లు ఉన్నాయి.

“సభాసదులారా! నా మాటలు కఠినంగా ఉండవచ్చు. నిజం ఎప్పుడూ నిష్ఠూరంగానే ఉంటుంది. ఆశ మంచిదే కాని ఆ ఆశ నెరవేరుతుందా లేదా అని వివేకంతో ఆలోచించాలి. మనిషి తనను తాను రక్షించుకోవడంతోపాటు మనల్ని కూడా కాపాడాలని ఆశ పడుతున్నాం. మనిషి ఎటుప్రయాణం చేస్తున్నాడో అర్థం చేసుకోవాలి. అతనితో మా జాతి స్నేహం లక్షల సంవత్సరాల నాటిది. అతని కూడా నడిచాం. అతనితో పాటే వేటాడాం. అతనితోపాటు తిన్నాం. నిద్రపోయాం. అతని అభివృద్ధిని చూసాం. ఇప్పుడు పతనం మొదలయింది.

మనిషిని బాగా అర్థం చేసుకోండి. అతను సృష్టికారకుడు కాదు. లయకారకుడు. మనిషి ఈ భూమిమీద అవతరించింది విధ్వంసం

చేయడానికి. అతని పాత్ర అతను నిర్వర్తిస్తున్నాడు. మనం తప్పు పడుతున్నాం. ఈ విశ్వం, విశ్వంలో భూమి పుట్టింది. భూమి మీద జీవరాశి పుట్టి అభివృద్ధిచెందింది. ఇప్పుడు జరగాల్సింది మరణం. అంటే నాశనం. ఈ సృష్టి- భూమినీ, ప్రకృతినీ విధ్వంసం చేయడానికి మనిషిని ఎన్నుకొన్నది. బాగా ఆలోచించండి. మనిషిలా ఏ జీవీ తనకుతాను ఆత్మహత్య చేసుకోదు. మనిషిమాత్రమే తనను తాను హతం చేసుకొంటాడు. అతను చేసుకొంటున్న పనుల వల్ల తాను ఆరోగ్యంగా ఆనందంగా లేనని అతనికి తెలుసు. తెలిసి కూడా ఎందుకు ఆపలేకున్నాడు- ప్రకృతి చక్రభ్రమణాన్ని ఆపడం ఎలా సాధ్యం కాదో మానవ సమాజ ప్రయాణం కూడా ఆపడానికి సాధ్యం కాకుండా చేసుకొన్నాడు. సంక్లిష్ట నిర్మాణం మానవ సమాజానిది. ఒక యంత్రంలా సకల కార్యకలాపాలు జరిగిపోతున్నాయి. కొద్దిసేపు ఆగి ఆలోచించే వ్యవధి లేదు. మానవ కార్యకలాపాలన్నీ ఆగిపోతాయి. సమాజమనే ఒక యంత్రానికి విద్యుత్తు- శక్తినిస్తే, అంతర్జాలం మెదడుగా ఆలోచించి పనిచేస్తున్నది. ఇవి రెండూ లేకుండా ఇప్పుడు మనిషిని ఊహించుకోలేం.

కనిపించే ప్రతిదాన్ని ధ్వంసంచేస్తున్నాడు. కనిపించని సూక్ష్మజీవులతో పోరాడడం అంత సులభంకాదు. అతని అవివేకం ఆశ నుండి అకస్మాత్తుగా పుట్టి, క్షణ క్షణం రూపాలు మార్చుకొనే మాయజీవులతో పోరాటం అంత సులభం కాదు. మరణం అనేది ఏ రూపంలో ఎలా వస్తుందో చెప్పలేం. మనిషిని మేల్కొల్పాలని మనం చేసే ప్రయత్నం వ్యర్థమని నా అభిప్రాయం. మీ ఇష్టం అంటూ తన ఉపన్యాసాన్ని ముగించింది ముసలి కుక్క .

ఈ మాటలు విన్న పక్షిజనాలకు భయం వేసింది. నిరాశ కల్గింది. చేస్తున్న ప్రయత్నాలన్నీ వ్యర్థమేనా అని అనుమానం కల్గింది. సభికుల్లో కల్గుతున్న ఆందోళనలను రంగుల చిలుక పసిగట్టింది. వెంటనే జోక్యం చేసుకొన్నది. "మిత్రులారా మన వృద్ధ శునకం మాటలు విని భయపడకండి. ఎప్పుడో ఒకప్పుడు మరణమనేది వస్తుందని అందరికీ తెలిసిన సత్యమే. అందుకని ఎవరూ మరణం కోసం ఎదురుచూడరు. బ్రతకడానికే చూస్తారు. బ్రతకడానికి చేసే ప్రయత్నాలను తప్పుపట్టడం న్యాయం కాదు. మనం ప్రయత్నిద్దాం. మనిషి విధ్వంసం వైపు ప్రయాణిస్తున్నాడని, ఆపండని, ఎలుగెత్తి అరచి చెప్పేవాళ్లలో మనుషులుకూడా ఉన్నారుగదా! వీరి సంఖ్య పెరగవచ్చు. విధ్వంసం నెమ్మదించవచ్చు. ప్రకృతే అలాంటి అవకాశాలు కల్గించవచ్చు. మనిషి పొదుపుగా ప్రకృతితో బ్రతికే రోజులు రావచ్చు. రాబోయే కొత్తతరం బడుల్లో తయారయ్యే విజ్ఞులైన మనుషులే ప్రకృతి విధ్వంసాన్ని ఆపవచ్చు. ఏదైనా జరగవచ్చు. నిరాశతో ముందుకు నడవలేం. అంటూ భవిష్యత్తుమీద ఆశ కల్గించింది చిలుక.

వచ్చే సంచిక: 'అద్భుతమైన మనిషి మెదడు'

కవిత

వ్యామోహం

ఇంగ్లీషు పాఠశాలలో
పిల్లవాణ్ని దండిస్తే
వాడు "అమ్మా" అనే ఏడుస్తాడు.

మా ఫ్యామిలీస్ అండీ అంటూ
భార్యను చూపిస్తాడు రిక్షావాడు.
కొడుకు డాడీ అంటేనే పలుకుతాడు
ఇది సంస్కృతీకరణ.

"ఇంగ్లీషులో మాట్లాడండిరా"
అంటుంది వెంకమ్మ కన్యాశుల్కంలో
అప్పటికి ప్రపంచీకరణ ఊహే లేదు
అది నాటి ప్రపంచం పోకడ.

నాలుగు తుంటలు నేర్చుకుని
అదే భాష అనుకుంటారు
తెలుగు వ్యాకరణానికి
ఇంగ్లీషు పూసలు కుదరవు
నీ పేరు చెప్పు
"మై నేమ్ ఈజ్ రాము"
రెన్ అండ్ మార్టిన్‌తో
వచ్చిన గోల యిది.

జ్ఞానం కోసం కాదు
నేటి ఇంగ్లీషు
మార్కెట్ సౌలభ్యం కొరకే
ఈ భాషాభ్యసనం.


స్వభాషను
పురిట్లోనే చంపుతున్నారు.
పసివాడి నోట్లో
విషం వొంపుతున్నారు
వెరీ బ్యాడ్!

ఎన్. గోపి
9391028496

'బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది నా ఖచ్చితమైన అభిప్రాయం. విద్యావ్యాప్తికి పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం. విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా మాతృభాషను స్వీకరిస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదు." - రవీంద్రనాథ్ ఠాగూర్

పుస్తక సమీక్ష

వ్యక్తిత్వ వికాస శతకం



వ్యక్తిత్వ వికాస శతకం

రచన: **కొంపల్లి వేంకట కోటిలింగం**

పుటలు: 111, వెల :150/-

ప్రతులకు :

అన్ని ప్రముఖ అంగళ్ళల్లో దొరుకును

కొత్తతరానికి మార్గదర్శకులవటం పాత తరం వారి బాధ్యత. ఆ బాధ్యతలో భాగంగా 'అక్షరాలు పేర్చి గణముల సంకూర్చి, ప్రవచనంబు కొంత రంగరించి అనుభవంబు చేర్చి, సలహాలు సమకూర్చి' అల్లిన ఆటవెలది పద్యాల శతకం శ్రీ కొంపల్లి వేంకట కోటిలింగం రాసిన శతకం యిది. నాటి వేమన కవి దారిలోనే మనిషిని సన్మార్గంలో నడిపేందుకు కోటిలింగం కవి ఎంచుకున్న మార్గం 'వ్యక్తిత్వ వికాస శతకం' ఆ శతకానికి మకుటం అవసరం లేదు. ఎవరు చెపుతున్నారనే దానికన్నా ఏం చెపుతున్నారు ఎలా చెపుతున్నారు అనే భావానికి ప్రాధాన్యత. 'ఒక్కొక్క పద్యం చొప్పున' వేరు వేరు సందర్భాలలో రాసినవిగా శతక కవి చెప్పినా, నిజానికి ఈ శతకంలోని ప్రతి పద్యం సర్వకాలాలకు, అన్ని వయసులవారికి, ప్రతి సందర్భానికి తగినవిగా, మనసుకు హత్తుకునేవిగా వున్నాయి.

జీవితంలో పైకి ఎదిగిన వారిని చూసి కాలం కలసి వచ్చిందనో, అదృష్టం వరించిందనో తేలికగా తీసిపారేసే గుణముంది సమాజంలో. "అలలమీద హంస అలవోకగా ఈదు, కనలేము కింది కాళ్ళ శ్రమను" అని సుతిమెత్తగా హెచ్చరించారు. నేడు ఎక్కడ చూసినా 'స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ' అంశం మీద గొంతులు చించుకుంటున్న గుంపులకు ఈ శతకంలోని 'అంక్షలేని స్వేచ్ఛ అసలు స్వేచ్ఛయే కాదన్న' విషయం నిలబెట్టి చదివించాలి. ఏదైనా మితం వుండి తీరాలి. 'అరగనట్టి తిండి విషమగు' అని నేడు విచ్చలవిడిగా అక్రమ మార్గంలో సంపాదిస్తున్న వర్గాలకు "ధనము కూడా గీత దాటిన విషమౌను" అంటూ చేసిన హెచ్చరిక వినిపిస్తుందా!

మత అంశాలు సమాజాన్ని చీలుస్తున్న వేళ 'అసలు పుణ్యము పూజలయందు లేదు, ఆర్తజనులను కాచుట యుందు కలదు" అని జనులందరికి అసలైన ధర్మమార్గం చూపించేయత్నం చేశారు.

ప్రతిపద్యంలో ఒక గొప్ప సందేశముంది. విద్యార్థి, ఉద్యోగి, పాలకుడు ప్రతి ఒక్కరికి వారివారి బాధ్యతలను తెలియ చెప్పాయి.

కవిగారి అవేదన కొన్ని పద్యాలలో కనిపిస్తుంది. తెలుగు భాషను వదులుతున్న "తెలుగు బిడ్డలు" తెలుగురాదని చెప్పెడి తెలుగు ప్రజలే అని ప్రస్తుత తెలుగు సమాజానికి అద్దం పట్టారు.

శతకంలో సృజించని సామాజిక అంశం లేదు. నడవడి, స్నేహబంధం, విద్యనేర్వాల్సిన విధానం, నేర్చిన విద్యను వినియోగించాల్సిన రీతి, పెద్దలతో ప్రవర్తన, బంధాలు, బాంధవ్యాలుతో పాటుగా , యువత ఎలా ఎదగాలి, ఎలా మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలి, ఒక సంపూర్ణ మానవుడిగా సమాజానికి మేలు చేకూర్చే వ్యక్తిగా రూపుదిద్దుకోవాలి అనేవన్నీ ఈ పద్దాలలో అందించారు.

చాలా సులభమైన పదాలను ప్రయోగించి, సూటిగా చెప్పినవైనా, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పాఠకుల కోసం, ప్రతి పద్యానికి వివరణ నిచ్చారు. వివరణ ముందుగా చదివి, ఆ తర్వాత పద్యం చదివితే మరింత గొప్పగా కవి ప్రయత్నాన్ని అర్థం చేసుకో గలుగుతారు. ఎంత ఎదిగినా ఒదిగి వుండాల్సిన అవసరం తెలుసుకుంటారు.

వ్యక్తిత్వ వికాస అంశంపై పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు వచ్చాయి, వస్తున్నాయి. పది పేజీలు చదివినా అసలు విషయం అర్థం కానంత గందర గోళంలోకి నెడుతున్నారు రచయితలు. దానికి భిన్నంగా నాలుగు పంక్తుల్లో సూక్ష్మంగా సుమతి, వేమన వంటి శతకకారుల పంథాలో 'నిస్తారంగా ఆటవెలదులు, అక్కడక్కడ కందం, తేటగీతులతో' చేసిన పద్యరచన యిది.

ఇవి హాయిగా చదువుకోదగినవి. శ్రావ్యమైన గొంతుతో, ఈ వ్యక్తిత్వ పద్యాలను భావయుక్తంగా పాడించి నేడు ప్రజలు ఆదరిస్తున్న యూట్యూబ్ వంటి మాధ్యమంలో వుంచితే బహుశ మన శతక పద్యాలకు మల్లే జనాల నోళ్ళలో బాగా నాని చిరస్థాయిగా నిలబడే అవకాశం వుంటుంది. ఆ మేరకు కవిగారి పుత్రుడు సుందరమైన ఆలోచన చేయమన్నది నా సూచన.

దుగ్గరాజు శ్రీనివాసరావు
9440421695

రావిపూడి వెంకటాద్రి గారు...


'అమ్మనుడి' 2022 ఆగస్టు సంచిక 51పుటలో వ్యాస రచయిత కీ॥శే॥ రావిపూడి వెంకటాద్రిగారు అని పొరపాటున ముద్రించాము. శ్రీ రావిపూడి వెంకటాద్రి గారు వందేళ్ళ వయస్సు పైబడి సజీవంగా, ఆరోగ్యంగా ఉన్నారు. జరిగిన తప్పుకు క్షమించకోరుతున్నాము.

-సంపాదకుడు

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

గ్లాస్కో నగరంలో
జార్జి స్క్వేర్‌లో
80 అడుగుల
స్థంభంపైన
సర్ వాల్టర్ స్కాట్
విగ్రహం

37వ పుటలో
మధురాంతకం నరేంద్రగారి
వ్యాసం 'పుస్తకాల్ని పూజించే
చోటు' చదవండి





అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
SEPTEMBER 2022 Vol :8, Issue 6 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/14/2021-23

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244